
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

13వేల అడుగుల ఎత్తులో.. 2 వరుసల్లో!

అరుణాచల్‌లో సెలా టన్నెల్ ప్రారంభించిన మోదీ
సొరంగం పొడవు 12 కిలోమీటర్లు
ఏడాది పొడవునా చైనా సరిహద్దులకు బలగాలు, ఆయుధ సామగ్రి తరలించడానికి అవకాశం
మోదీ గ్యారంటీలకు ఈశాన్యమే రుజువు
ఐదేళ్లలో మేం సాధించింది కాంగ్రెస్‌కైతే 20 ఏళ్లు
అరుణాచల్, అసోం పర్యటనల్లో ప్రధాని వ్యాఖ్యలు

12



శనివారం మోదీ ప్రారంభించిన సెలా టన్నెల్ ఇదే..

ఆదివారం | 10-3-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 325 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం తిథి: అమావాస్య మ. 2.29 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 1.56 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ. 10.32-11.56; దుర్ముహూర్తం: సా. 4.46-5.34; అమృతఘడియలు: రా. 6.56-8.20; రాహుకాలం: సా. 4.30-6.00 వరకు; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రభంజనం సృష్టిస్తాం


శనివారం ఢిల్లీలో అమిత్ షాతో చంద్రబాబు, పవన్ కల్యాణ్



మా కూటమి ఘన విజయం ఖాయం
రాష్ట్రం కోసమే బీజేపీతో కలిశాం: బాబు

జగన్‌తో 20 ఏళ్లు వెనకబడిన ఏపీ
రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే ఈ పొత్తు
వైసీపీ అరాచక పాలనపై జనంలో భయం
జగన్ మళ్లీ వస్తే అప్పు పుట్టదు
సచివాలయం సహా అన్నీ తాకట్టులోనే..
పథకాల అమలు దుర్భరమవుతుంది
సంపద సృష్టి, ఆదాయ పెంపు మాతోనే
కేంద్ర ప్రభుత్వ సహకారమూ అవసరం
అందుకే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి
మైనారిటీలకు ఎలాంటి ఆందోళనా అక్కర్లేదు
రాష్ట్రాభివృద్ధి కోసం మాకే ఓటేస్తారు
ఢిల్లీలో చంద్రబాబు ఉద్ఘాటన
చిలకలూరిపేట సభలో ఉమ్మడి మేనిఫెస్టో!
ఎన్డీయేలోకి స్వాగతం: షా, నడ్డా

రాష్ట్రం కోసం.. దేశం కోసం!

పొత్తుపై 'ఉమ్మడి'గా ప్రకటన
17 లేదా 18న కూటమి సభ
చిలకలూరిపేటలో ప్రచార భేరీ
ప్రధాని నరేంద్ర మోదీ హాజరు!

న్యూఢిల్లీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): 'పొత్తు' ఖరారైంది. టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ఏర్పాటైంది. శనివారం దీనిపై అధికారికంగా ఉమ్మడి ప్రకటన విడుదలైంది. ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభంజనం ఖాయమని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు ఉద్ఘాటించారు. పొత్తుపై సంయుక్త ప్రకటన విడుదల చేసిన అనంతరం.. అమరావతికి బయలుదేరే ముందు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిన జగన్ అరాచక పాలనను అంతం చేయడమే ధ్యేయంగా తమ మధ్య రాజకీయ అవగాహన కుదిరిందని

మిగతా 11వ పేజీలో...

ప్రజా విశ్వాసం కోల్పోయిన జగన్ ఎన్నికల్లో విజయానికి అక్రమాలపై ఆధారపడ్డారు. స్థానిక ఎన్నికలు, తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక వైసీపీ అక్రమాలకు నిదర్శనంగా నిలిచాయి. ఇవి పునరావృతం కాకుండా ప్రజాస్వామ్యం నిలబెట్టుకోవడానికి కూడా పొత్తుల అవసరం ఉంది.

బీజేపీతో పొత్తుపై ముస్లిం మైనారిటీలు అభద్రతా భావానికి లోనుకావాల్సిన అవసరం లేదు. 2014-19లో మోదీ ప్రభుత్వంలోనూ టీడీపీ భాగస్వామిగా ఉంది. మైనారిటీలకు ఎలాంటి ఇబ్బందీ కలుగలేదు. జగన్ ప్రభుత్వం కంటే టీడీపీ ప్రభుత్వమే మైనారిటీలకు ఎక్కువ మేలు చేసింది. - చంద్రబాబు



క్యాడర్‌ను వదిలేశాం!

ఐదేళ్లకు అంగీకరించిన సజ్జల, వైవీ!?
జగన్ పట్టించుకోలేదనే ఆగ్రహం ఉంది
వలంటీర్లకే ప్రాధాన్యం ఇవ్వడం నిజమే
ఈసారి క్యాడర్‌ను పూర్తిగా ఆదుకుంటాం
ఉత్తరాంధ్ర నేతలతో 'ముఖాముఖి'

అమరావతి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లూ వలంటీర్లను మాత్రమే పట్టించుకుని.. ఎన్నికల ముందు కూడా వలంటీర్లనే నమ్ముకున్న వైసీపీకి 'క్యాడర్' భయం పట్టుకున్నట్లుంది! "2019 ఎన్నికల్లో గెలిచాక వలంటీర్లకే అధిక ప్రాధాన్యం ఇచ్చాం. క్యాడర్‌ను పట్టించుకోలేకపోయాం. తమను జగన్మోహన్ రెడ్డి పట్టించుకోలేదన్న ఆగ్రహం క్యాడర్‌లో ఉంది" అని స్వయంగా ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి, పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నట్లు తెలిసింది. శనివారం

మిగతా 11వ పేజీలో...

'సిద్ధం' కోసం స్టేషన్లు ఖాళీ!

వందల సంఖ్యలో పోలీసుల తరలింపు
బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఒకరిద్దరితోనే చాలా పోలీస్ స్టేషన్ల నిర్వహణ

2

వంచనాశిల్పం జగన్!



ఈ ఐదేళ్లలో జగన్ ఏర్పాటు చేయించిన సినిమా సెట్లకు, ఫేక్ ప్రచారాలకు అంతే లేదు. అయినా మాకు జగనే కావాలని ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుకోవాలని జగన్ అండ్ కో భావిస్తున్నారు. చంద్రబాబు పాలన అంతా గ్రాఫిక్స్ మాయాజాలం అని విమర్శించిన వారు ఇప్పుడు ఏమంటారో?

అసత్యాలు ప్రచారం చేసే వారిలో ఎక్కడో ఒకచోట వెరపు కనిపిస్తుంది. కానీ వేల మంది సమక్షంలో అమాయకంగా ముఖం పెట్టి అలవోకగా అసత్యాలు చెబుతున్న జగన్ వంటి వారిని ఇప్పుడే చూస్తున్నాం. సర్వత్రా 'మోసం గురూ' అన్నట్టుగా ఐదేళ్ల పాలన సాగింది.

వచ్చే వారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఇక చూడండి.. అప్పటి నుంచి పోలింగ్ జరిగే వరకు జగన్మోహన్ రెడ్డి తన ముఖంలో నవరసాలనూ పండిస్తారు. తల్లి లేదు.. చెల్లి లేదు.. చెప్పుకొందామంటే బాబాయి కూడా లేడు అని ప్రజల ముందుకు వెళ్లి బిక్క ముఖం పెట్టవచ్చు.

ఐదేళ్ల క్రితం జగన్‌కు అండగా నిలబడిన తల్లి ఇప్పుడు సైలెంటయ్యారు. తనకు ద్రోహం చేసిన అన్నకు వ్యతిరేకంగా రాజకీయ రణ క్షేత్రంలో షర్మిల మోహరించారు. తండ్రి హంతకులను కాపాడుతున్న అన్న జగన్‌కు వ్యతిరేకంగా డాక్టర్ సునీత సైతం తన వంతు ప్రచారం చేస్తున్నారు.

తెలుగుదేశం-జనసేనతో బీజేపీ చేతులు కలిపితే ఎన్నికల్లో తాను అనుకున్న విధంగా అక్రమాలకు పాల్పడలేనని గ్రహించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి పరుగెత్తారు. ప్రధాని మోదీని కలిసి తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవద్దని ప్రాధేయపడ్డారు. తన ప్రయత్నాలు ఫలించే అవకాశం సన్నగిల్లడంతో జగన్ రెడ్డి చివరి ప్రయత్నంగా తనకు అనుకూలమైన ఒక మీడియా సంస్థతో సర్వే నివేదికను ప్రసారం చేయించారు.

ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై కమలనాథులకు తత్వం బోధపడింది. ఆరెస్సెస్ కూడా తన ఫీడ్ బ్యాక్ అందించింది. రాష్ట్రంలో హైందవ సంస్కృతిని జగన్మోహన్ రెడ్డి ధ్వంసం చేస్తున్నారని ఆరెస్సెస్ గుర్రుగా ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ కూడా పొత్తుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట.

పొత్తుల వ్యవహారంపై తెలుగుదేశం-జనసేన పార్టీలను విమర్శిస్తున్న వైసీపీ నాయకులు బీజేపీని మాత్రం పల్లెత్తు మాట అనడం లేదు. కమలనాథులతో వైరం పెట్టుకునే సాహసం జగన్ చెయ్యలేరు. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా తనను కేసుల బారి నుంచి ఆదుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమే కనుక బీజేపీ జోలికి పోకుండా జగన్ అండ్ కో జాగ్రత్త పడుతున్నారు.

కొత్త పలుకు - ఆర్కే విశ్లేషణ 4లో..

జగన్ మళ్లీ వస్తే హోదా రాదు!

ఇప్పటికే పాతికేళ్లు వెనకబడ్డాం
సీఎం మద్యం వ్యాపారం చేస్తున్నారు
ఎన్నికల్లో ఎవరు డబ్బులిచ్చినా తీసుకోండి
అడ్డంగా మాఫియాలతో సంపాదించినదే
పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలు
'ఇందిరమ్మ అభయం' పథకానికి శ్రీకారం
కొండపల్లిలో పేదల ఇళ్లలోకి వెళ్లి పరామర్శ

3


ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి సభలో మాట్లాడుతున్న షర్మిల





ఈసీలో కలకలం!

లోక్‌సభ ఎన్నికల ముంగిట సంచలనం
గత నెలలో మరో కమిషనర్ పదవీ విరమణ
ఎన్నికల సంఘంలో మిగిలింది సీఈసీ ఒక్కరే
కమిషనర్ల నియామకానికి సిద్ధమవుతున్న కేంద్రం
అరుణ్ గోయల్ నియామకమూ వివాదాస్పదమే
2022లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన మరుసటి రోజే కమిషనర్‌గా నియామకం
అప్పట్లో కేంద్రాన్ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు

ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ అనూహ్యంగా రాజీనామా

న్యూఢిల్లీ, మార్చి 9: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మరి కొన్ని రోజుల్లో విడుదల కానున్న తరుణంలో సంచలనం చోటు చేసుకుంది. ఎన్నికల సంఘం (ఈసీ) కమిషనర్ అరుణ్ గోయల్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అరుణ్ గోయల్ రాజీనామాతో ఈసీలో

మిగతా 12వ పేజీలో...

14-16 మధ్య షెడ్యూల్!

లోక్‌సభతో పాటు 5 అసెంబ్లీలకూ
వచ్చే నెలాఖరులో ఏపీలో పోలింగ్
ముమ్మరంగా ఈసీ కసరత్తు

ఈసీ.. దీనికేమంటుందో..?



వైసీపీ కార్యకర్తల్లా వలంటీర్లు

చిన్నమండెం, మార్చి 9: మెడలో వైసీపీ కండువా, నెత్తిన పార్టీ జెండా రంగు టోపీ, చేతిలో కరపత్రం.. ఫొటోలో మార్క్ వేసినవారంతా వైసీపీ కార్యకర్తల్లా ఉన్నారు కదూ..! కానీ వారంతా వలంటీర్లు. ప్రభుత్వ ఖజానా నుంచి గౌరవ వేతనాలు తీసుకుని వైసీపీకి ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘం ఆదేశించగా.. వారు ఏకంగా

మిగతా 11వ పేజీలో...

ఎడాపెడా వాడేస్తున్నారు!

సచివాలయాల ఉద్యోగులపైనా జగన్ సర్కారు గురి

పార్టీకి వారి సేవలు ఉపయోగించుకునేలా ప్లాన్
ఉద్యోగుల సమన్వయానికి కోర్ టీమ్‌ల ఏర్పాటు
కలెక్టర్ కార్యాలయ పరిధిలో ఉండేలా ఆదేశాలు
జగన్ పట్ల విధేయత ఉన్నవారికి డిప్యుటేషన్
సమాచార సేకరణతో పాటు వైసీపీ ఆదేశాలు అమలు చేసేలా టీమ్‌లకు బాధ్యతలు
ఇప్పటికే వలంటీర్లను వాడుకుంటున్న వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నిబంధనలు ఏమాత్రం పట్టవు. పారదర్శకత, నైతికత వంటి వాటికి తావే లేదు. అంతా అడ్డగోలు వ్యవహారం. బరితెగింపు ధోరణి. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలవడానికి జగన్ సర్కారు అన్ని అడ్డదారులూ తొక్కుతోంది. ప్రభుత్వానికీ, పార్టీకీ ఉన్న గీతను పూర్తిగా చెరిపేసింది. ఇప్పటికే వలంటీర్లను సొంత ప్రచారానికి, ఎన్నికల్లో పార్టీకి లబ్ధి చేకూర్చడానికి వాడుకుంటున్న జగన్ సర్కారు.. ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులపైనా గురి పెట్టింది. రెండున్నర

మిగతా 2వ పేజీలో...

కర్నూలులో భారీగా బోగస్ ఓట్లు!

ఒక్కరికే రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు
6,700 పైగా డబుల్ ఎంట్రీలు గుర్తించిన టీడీపీ

11

దస్తగిరి తండ్రిపై దాడి

ఓటమి భయంతోనే దాడులు
నా జోలికి వస్తే నేనూ మీ దారిలోనే వస్తా
నా తండ్రికి రక్షణ కల్పించండి: దస్తగిరి

2

ఆస్ట్రేలియాలో ఆంధ్రా యువ డాక్టర్ మృతి

స్నేహితులతో ట్రెక్కింగ్‌కు వెళ్లి.. జారి లోయలోకి

12

తమిళ సినీ నిర్మాత జాఫర్ సాదిక్ అరెస్టు

రూ.2 వేల కోట్ల డ్రగ్స్ స్మగ్లింగ్ ఆరోపణలు
జాఫర్.. డీఎంకే మాజీ నాయకుడు

12

హిమాచల్ సంక్షోభంలో మరో మలుపు!

బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌కు 11 మంది ఎమ్మెల్యేలు
వీరిలో అనర్హతకు గురైన ఆరుగురు కాంగ్రెస్‌వారు

12

జగన్‌కు హీరో జనానికి జీరో

అమ్మో ఎమ్మెల్యే

పశ్చిమ గోదావరిలో ఎమ్మెల్యే దాదాగిరీ
సొంత ఆస్తుల పెంపు కోసం అడ్డదారులు
సెటిల్మెంట్ ద్వారా వచ్చిన భూమి దానం
పైసా పెట్టకుండా లేఅవుట్‌లో లాభం
పైకి దాతగా పోజు.. తెర వెనుక ఆమ్యామ్యాలు
మట్టి దందాలోనూ ఎమ్మెల్యేదే పెత్తనం
సీఎం దృష్టిలో పడేందుకు విపక్ష నేతలపై దాడులు



సీఎం జగన్ ఆయన్ను రియల్ హీరో అంటూ ఆకాశానికెత్తేస్తారు. ఓ ప్రముఖ నాయకుడిని ఢీకొట్టే మొనగాడు అంటూ ఊదరగొడతారు. క్షేత్రస్థాయిలో మాత్రం సదరు నేత రియల్ ఎస్టేట్‌లో దందాలు చేసే ఎమ్మెల్యేగా.. జనం దృష్టిలో జీరోగా మారారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన సెటిల్మెంట్లు చేయడంలో ఆరితేరిపోయారు.

2

నియోజకవర్గంలో ఎవరైనా భవన నిర్మాణ అనుమతులు తీసుకోవాలంటే ముందుగా ఎమ్మెల్యేను కలవాలి. ఆ తర్వాతే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. లేదంటే అధికారులు కొర్రీలు వేస్తారు. అనుమతుల కోసం ఎమ్మెల్యేను కలవాలంటే జనం కాసులు పోగేసుకోవాల్సిందేనని స్థానికంగా చెబుతున్నారు.

ఏపీటీడీసీ ఆస్తుల తాకట్టు!

12

రూ.150 కోట్లకు ప్రైవేటు బ్యాంకుల్లో తనఖా.. జాబితాలో భవానీ ఐల్యాండ్ సహా పర్యాటక యూనిట్లు
వాటి ప్రైవేటీకరణకు ఇప్పటికే టెండర్లు పిలిచిన సంస్థ.. ఇప్పుడు అప్పుతో ఆధునికీకరణంటూ నాటకం

గాయపడిన పులి.. సురక్షితంగా అడవిలోకి!



ఆత్మకూరు, మార్చి 9: నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు పరిధిలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కి తీవ్రంగా గాయపడిన పెద్దపులికి అటవీశాఖ అధికారులు వైద్యం చేయించి శుక్రవారం రాత్రి నల్లమల అడవిలో వదిలారు. శనివారం ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులు తెలిపారు. మూడేళ్ల వయస్సున్న ఆడపులి నడుము భాగంలో బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు బిగుసుకొని తీవ్రంగా గాయపడినట్లు కెమేరా ట్రాప్స్ ద్వారా ఫిబ్రవరి 25న అటవీ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ దృష్టికి వెళ్లడంతో పులికి చికిత్స చేయించాలని సూచించారు. దీంతో మహారాష్ట్రలోని పుణెకు చెందిన ఐదుగురు రెస్క్యూ టీంతో పాటు 50 మంది అటవీశాఖ ఉద్యోగులు, ప్రొటెక్షన్ వాచర్లు బృందంగా ఏర్పడి మార్చి 5న పులికి మత్తు మందు ఇచ్చి బంధించారు. ఆతర్వాత బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. నాలుగు రోజుల తర్వాత పులి కోలుకోవడంతో శుక్రవారం రాత్రి నల్లమల అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

విశాఖకు మరో రెండు వందేభారత్ రైళ్లు

పూరి-విశాఖ-పూరి ఒకటి

సికింద్రాబాద్-విశాఖ మధ్య అదనంగా మరొకటి



విశాఖపట్నం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజలకు మరో రెండు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ రెండూ విశాఖపట్నం నుంచి నడుస్తాయి. పూరి-విశాఖ స్టేషన్ల మధ్య ఒకటి, విశాఖ-సికింద్రాబాద్ మధ్య మరొకటి అదనంగా రానుంది. వీటిని ప్రధాని మోదీ ఈ నెల 12న లాంఛనంగా ప్రారంభించనున్నారు. రెగ్యులర్‌గా నడిచే తేదీలు రైల్వే అధికారులు ఆ తరువాత ప్రకటిస్తారు. 20841/20842 నంబరుతో పూరి-విశాఖపట్నం-పూరి మధ్య శనివారం మినహాయించి వారానికి ఆరు రోజులు వందేభారత్ నడుస్తుంది. 20841 నంబరు రైలు పూరిలో తెల్లవారుజామున 5.15 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఇటు నుంచి 20842 నంబరుతో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 11.30 గంటలకు పూరి చేరుకుంటుంది. విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య కొత్తగా ప్రారంభించే రైలు 20707/20708 నంబర్లతో గురువారం తప్ప వారంలో మిగిలిన ఆరు రోజులు నడుస్తుంది. 20707 నంబరుతో సికింద్రాబాద్‌లో ఉదయం 5.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం వస్తుంది. 20708 నంబరుతో ఇక్కడ మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 11.20 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	40.0	26.0
కర్నూలు	39.7	26.7
తిరుపతి	37.6	25.4
హైదరాబాద్	35.6	23.5
విజయవాడ	35.5	24.0

వేడి నూనెలో పడి చిన్నారి మృతి



హిందూపురం, మార్చి 9: తినుబండరాలు తయారుచేసే నూనె బాండ్లీలో పడి ఏడాదిన్నర వయసున్న చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. తమిళనాడుకు చెందిన రామ్మూర్తి, సంధ్య దంపతులు శ్రీసత్యసాయి జిల్లా పరిగికి వలస వచ్చి, తినుబండారాల దుకాణం నడుపుతున్నారు. వాటి తయారీ కోసం శనివారం నూనె వేడిచేసి, పక్కన ఉంచారు. ఆడుకుంటూ వచ్చిన వారి కూతురు నిఖిత.. ఆ బాండ్లీలో పడిపోయింది. చెన్నైకి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతిచెందింది.

కోస్తాలో వర్షాలు, సీమలో ఎండలు

విశాఖపట్నం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఉత్తర ఒడిశా నుంచి ఉత్తర కోస్తా వరకు ద్రోణి విస్తరించింది. ఇదే సమయంలో రాష్ట్రంలో ఎండ తీవ్రంగా ఉండడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో శనివారం ఉత్తర కోస్తాలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అనంతపురంలో 40.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

దస్తగిరి తండ్రిపై దాడి

- ఓటమి భయంతోనే దాడులు
- నా జోలికి వస్తే నేనూ మీ దారిలోనే వస్తా
- నా తండ్రికి రక్షణ కల్పించండి: దస్తగిరి



గాయపడ్డ దస్తగిరి తండ్రి హాజీవల్లి

పులివెందుల టౌన్, మార్చి 9: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి తండ్రి హాజీవల్లిపై శుక్రవారం రాత్రి దాడి జరిగింది. పులివెందులలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన శివరాత్రి సందర్భంగా నామాలగుండు వెళ్లాడు. అక్కడ తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని హాజీవల్లి తెలిపారు. దాడిలో గాయపడ్డ ఆయన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా శనివారం పులివెందలలో దస్తగిరి మీడియాతో మాట్లాడుతూ 'నీ కొడుకు దస్తగిరి వైఎస్ జగన్‌పై పోటీ చేసేంత వ్యక్తినా.. నిన్ను, నీ కొడుకును చంపేస్తాం' అంటూ కత్తితో దాడి చేశారని చెప్పారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. సామాన్యుడికి పులివెందులలో పోటీ చేసే అర్హత లేదా? అని ప్రశ్నించారు. 'నేను, నా కుటుంబం పోటీ చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నేను నిలబడితే జగన్మోహన్‌రెడ్డి ఓడిపోతారనే భయంతోనే మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ ఘటనపై సీబీఐ వారికి తెలిపి కోర్టులో పిటిషన్ వేస్తాం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా భయపడేది లేదు. ఈసారి వార్ వన్‌సైడ్ అవుతుంది. నా కుటుంబం జోలికి వస్తే ఎవరినీ వదిలేదు లేదు. ఎంత దూరమైనా వెళ్తాం. వైఎస్ అవినాశ్‌రెడ్డి బయట ఉండడంతోనే ఇలాంటివి జరుగుతున్నాయి. వివేకా కేసు విచారణ కూడా సజావుగా సాగడం లేదు. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కావాలి. లేదంటే ఈవిధంగా మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తుంటారు. ఆయన బెయిల్ రద్దయ్యేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తా. నన్ను జైల్లో కూడా కొనాలని చూశారు. దీనిపై కోర్టులోనే పోరాటం చేస్తా. నన్ను అక్రమంగా అరెస్టు చేయాలని పన్నాగాలు పన్నుతున్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడను' అని దస్తగిరి అన్నారు.

జగన్‌కు హీరో
జనానికి జీరో

- శ్రీనివాసా.. ఇవేం అవినీతి లీలలు!.. పశ్చిమగోదావరిలో ఎమ్మెల్యే దాదాగిరి
- సొంత ఆస్తుల పెంపు కోసం అడ్డదారులు .. సెటిల్మెంట్ ద్వారా వచ్చిన భూమి దానం
- పైసా పెట్టకుండా లేఅవుట్‌లో లాభం.. పైకి దాతగా పోజు.. తెరవెనుక ఆమ్యామ్యాలు
- మట్టి దందాలోనూ పెత్తనం.. సీఎం దృష్టిలో పడేందుకు విపక్ష నేతలపై దాడులు

సీఎం జగన్ ఆయన్ను రియల్ హీరో అంటూ ఆకాశానికెత్తేస్తారు. ఓ ప్రముఖ నాయకుడిని ఢీకొట్టే మొనగాడు అంటూ ఊదరగొడతారు. క్షేత్రస్థాయిలో మాత్రం సదరు నేత రియల్ ఎస్టేట్‌లో దందాలు చేసే ఎమ్మెల్యేగా.. జనం దృష్టిలో జీరోగా మారారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన సెటిల్మెంట్లు చేయడంలో ఆరితేరిపోయారు.

నియోజకవర్గంలో ఎవరైనా భవన నిర్మాణ అనుమతులు తీసుకోవాలంటే ముందుగా ఎమ్మెల్యేను కలవాలి. ఆ తర్వాతే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. లేదంటే అధికారులు కొర్రీలు వేస్తారు. అనుమతుల కోసం ఎమ్మెల్యేను కలవాలంటే జనం కాసులు పోగేసుకోవాల్సిందేనని స్థానికంగా చెబుతున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నారు. పలు పార్టీలు మారారు. గతంలో కాంగ్రెస్ తరఫున ఒకసారి, వైసీపీ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో ప్రముఖ నాయకుడిపై విజయం సాధించడంతో ఆయన పేరు రాష్ట్రవ్యాప్తంగా వినిపించింది. అవినీతిలోనూ సదరు నాయకుడు బాగా 'ఫేమస్' అయ్యారు. ఎమ్మెల్యే కాకముందు అర్బన్ బ్యాంక్‌లో గోల్‌మాల్ వ్యవహారంలో ఆయనపై ఆరోపణలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలోకి రావడం, ఆయనా ఎమ్మెల్యేగా గెలవడంతో సంపద బాగానే పోగేసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని 16ఎకరాల భూమి విషయంలో ఎమ్మెల్యే సెటిల్మెంట్ చేశారు. కొంతమంది రియల్టర్లను పోగేశారు. భూ యజమానికి సొమ్ములు ఇప్పించారు. సొమ్ములు చెల్లించిన రియల్టర్లు 12 ఎకరాల్లోనే లే అవుట్ వేశారు. మిగిలిన 4 ఎకరాలను ఎమ్మెల్యే అప్పనంగా సొంతం చేసుకున్నారు. విషయం ఆ నోటా ఈ నోటా నియోజకవర్గమంతా పాకింది. అభాసుపాలవుతున్నామన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే దాతగా మారారు. ప్రభుత్వ అభివృద్ధి ప్రాజెక్టుకు ఆ భూమిని విరాళంగా ఇచ్చారు. భూమి ఇచ్చిన దాతగా ఎమ్మెల్యేను ఆయన అనుచరవర్గం చెప్పుకొంది. ఆ భూమికి ఆనుకుని ఉన్న మిగిలిన 12 ఎకరాల్లో లే అవుట్ అభివృద్ధి చేశారు. ఎమ్మెల్యే దానంగా ఇచ్చిన భూమిలో ప్రభుత్వ ప్రాజెక్ట్ అభివృద్ధి జరుగుతుండడంతో లే అవుట్ స్థలాలకు అధిక ధరలు నిర్ణయించారు. అందులోనూ ఎమ్మెల్యే భాగస్వామిగా ఉన్నారు. అంటే.. పేరుకు పేరు.. పైసా పెట్టుబడి లేకుండా లాభమన్నమాట.



మట్టి దందా

గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో మట్టి దందాకు అడ్డూ అదుపూ లేకుండాపోయింది. ఎమ్మెల్యే పేరుతోనే అధికార పార్టీ నాయకులు దందా నడిపారు. నియోజకవర్గంలోని రెండు మండలాల్లోనూ అక్రమ చెరువుల తవ్వకాలు యథేచ్ఛగా సాగించారు. పంట పొలాలు తవ్వేశారు. మట్టి తవ్వకాలకు అనుమతులు లేకపోయినా ఎమ్మెల్యే ఆశీస్సులతో రూ.కోట్లు ఆర్జించారు. అందుకు ప్రతిఫలంగా ఎమ్మెల్యే సిండికేట్ వేసిన మరో 60 ఎకరాల లే అవుట్‌ను పూడ్చారు. సదరు లేవుట్ పూడిక చేసేలా మట్టి మాఫియా అంగీకరించడంతో రెండు మండలాల్లోనూ తవ్వకాలకు అనుమతిచ్చారు. అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేదు. చివరకు వారూ మాఫియాతో కుమ్మక్కయ్యారు. ఎమ్మెల్యే లే అవుట్ పూడిక చేసిన మట్టి మాఫియా.. అదేపేరుతో ఇతర ప్రాంతాలకు మట్టి తరలించి రూ.కోట్ల వ్యాపారం చేసింది. ఇదే నియోజకవర్గంలో పట్టణ ప్రజలకు జగనన్న లేఅవుట్ ఉంది. దానిని పూడ్చేందుకు మట్టి అందుబాటులో లేదంటూ అధికారులు చేతులెత్తేశారు. వర్షాకాలంలో అక్కడ చేపలు పట్టుకున్నారు. ఎమ్మెల్యే సిండికేట్ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో మట్టి పూడిక అయినా జగనన్న లేఅవుట్‌లో పూడిక కోసం వేలమంది లబ్ధిదారులు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.

ప్రతిపక్ష నేతలు నియోజకవర్గంలో పర్యటించినప్పుడల్లా ఎమ్మెల్యే తన అనుచరవర్గంతో వివాదాలు సృష్టించడం ఆనవాయితీగా మారింది. సీఎంను ప్రసన్నం చేసుకోవాలన్న తహతహతో సదరు నాయకుడు ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులకు పాల్పడేలా అనుచరులను పురికొల్పుతున్నారు. ఈ క్రమంలో జరిగిన వివాదంలో టీడీపీ నేతలపై కేసులు నమోదయ్యాయి. ఇలా సీఎం దృష్టిలో ఎమ్మెల్యే హీరో అయ్యారు. జనంలో మాత్రం జీరోగా నిలిచారు.

విపక్ష నేతలపై దాడులు

మున్సిపల్ నిధులతో..

సాధారణంగా లే అవుట్‌లో కంకర రహదారులు వేసే బాధ్యత లేఅవుట్ యజమానులదే. కానీ ఎమ్మెల్యే లే అవుట్‌లో మున్సిపాలిటీ నిధులు వెచ్చించి కంకర రహదారులు, విద్యుత్ లైన్లు వేసేశారు. ఇటీవల ఆ లేఅవుట్‌లో ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించగా దానికి ప్రధాన రహదారిని మున్సిపాలిటీ అభివృద్ధి చేసింది. ఇక జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే సమీప బంధువు భూమిని దాదాపు 14ఎకరాలు ప్రభుత్వం కొనుగోలు చేసింది. అక్కడ ఎకరం బహిరంగ మార్కెట్‌లో గరిష్ఠంగా రూ. 40లక్షలు పలుకుతున్నా కూడా రూ.1.07కోట్ల చొప్పున విక్రయించారు. ఇలా దాదాపు రూ.9కోట్లు లబ్ధి పొందారు. ఇక జిల్లాలో పేరుమోసిన రియల్టర్ నియోజకవర్గంలో రూ.25కోట్ల విలువైన లేఅవుట్ వేశారు. అందులోనూ ఎమ్మెల్యే వేలు పెట్టి రియల్టర్ నష్టపోయేలా చేశారు.

ఎడాపెడా వాడేస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

లక్షల మంది వలంటీర్లను పార్టీ కోసం వాడుకుంటున్నట్టుగా... ఒకటిన్నర లక్షల మంది సచివాలయ ఉద్యోగులు కూడా పార్టీ కోసం పనిచేసేలా ప్లాన్ వేసింది. జగన్, వైసీపీ పట్ల వీరాభిమానం ఉండే సచివాలయ ఉద్యోగులను ప్రతి జిల్లాలో డిప్యూటేషన్‌పై కోర్ టీమ్‌లుగా నియమించి, ఉద్యోగులను సమన్వయం చేసే బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించింది. కోర్ టీమ్‌లు కలెక్టర్ కార్యాలయాల పరిధిలో ఉండేలా ఆదేశాలు జారీ చేసింది. సమాచార సేకరణతో పాటు వైసీపీ ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేయడం ఈ టీమ్‌ల బాధ్యత. సచివాలయ ఉద్యోగుల సంఘానికి గౌరవాధ్యక్షుడిగా ఉన్న ఉద్యోగ సంఘం నేత వెంకట్రామిరెడ్డి జగన్ గెలుపు కోసం పనిచేయాలని సచివాలయాలకు వెళ్లి మరీ చెప్పారు. ఈ అంశం వివాదమైనప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులను వైసీపీ గెలుపు కోసం వాడుకోవాలని నిర్ణయించింది. వెంకట్రామిరెడ్డి సిఫారసుతోనే సచివాలయ ఉద్యోగుల డిప్యూటేషన్ ప్రక్రియ చేపడుతున్నట్టు చెబుతున్నారు. కాకినాడ మున్సిపల్ కమిషనర్ కోర్ టీమ్‌కు సంబంధించి సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఆదేశాలిచ్చారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో కోర్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగుల నుంచి సమాచారాన్ని సేకరించి ఎన్నికల ప్రక్రియకు వారిని వాడుకోవాలని యోచిస్తున్నారు. గత నాలుగేళ్లుగా కోర్ టీమ్‌ల ఏర్పాటు ఆలోచన చేయని ప్రభుత్వం ఎన్నికల ముందు నియమిస్తుండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఉద్యోగులను మచ్చిక చేసుకుని...

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో చాలా వరకు ప్రభుత్వం పట్ల సంతృప్తిగా లేరు. వైసీపీ సర్కార్ ఆర్భాటంగా ఒకటిన్నర లక్షల మంది సచివాలయ ఉద్యోగులను నియమించినా పోస్టింగ్‌లు, జాబ్‌చార్ట్ విషయంలో పిల్లిమొగ్గలు వేసింది. జాబ్‌చార్ట్ ఒకటిచ్చి మరో బాధ్యత అప్పచెప్పింది. అంతేగాక డిగ్రీ అర్హతతో రాత పరీక్షలు నిర్వహించి రికార్డ్ అసిస్టెంట్ స్థాయి కేడర్ పోస్టులు కల్పించడం, ప్రొబేషనరీ డిక్లరేషన్ ఆలస్యంగా చేయడం, జీతాలు అరకొరగా ఇవ్వడం, వారికి చెందాల్సిన ప్రయోజనాలు పూర్తి స్థాయిలో అందించకపోవడంతో సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం పట్ల గుర్రుగా ఉన్నారు. ప్రభుత్వంపొంతన లేని ఆదేశాలు ఇవ్వడం, వైసీపీ నేతలు అజమాయిషీ చేయడం, ఉద్యోగులపై దాడులు చేయడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొన్ని చోట్ల టార్చర్ భరించలేక ఉద్యోగాలు వదులుకుని వెళ్లిపోయినవారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులను మచ్చిక చేసుకోవాలని, వారు సహకరించకపోతే ఎన్నికల్లో వలంటీర్ల సహకారం కూడా పూర్తిగా అందకపోవచ్చని వైసీపీ నేతలు, వెంకట్రామిరెడ్డి లాంటి ఉద్యోగ సంఘాల నేతలు జగన్‌కు సూచించారు. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో వారికి ఎన్నికల విధులు అప్పగిస్తారు. జగన్ మళ్లీ గెలిచేందుకు వారిని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ కలెక్టర్ కార్యాలయాల పరిధిలో ఉండే కోర్ టీమ్‌లు వైసీపీకి అనుకూలంగా పనిచేసేలా ప్రణాళికలు తయారు చేశారు.

జగనన్న ఎన్నికల్ టీమ్‌లు!

వలంటీర్లను కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే నియమించారంటూ సాగుతున్న ప్రచారాన్ని సీఎం జగన్ నిజం చేశారు. ఇంటింటికీ వెళ్లి పెన్షన్ ఇస్తామంటూ ఊదరగొట్టి ఆ ముసుగులో పార్టీ ప్రచారం చేయించుకుంటున్నారు. ఎన్నికల సమయంలో వారిని నేరుగా వాడుకోవడానికి మాస్టర్ ప్లాన్ వేశారు. ప్రభుత్వ సేవల్లో లేకపోయినా వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం వారు సేవలందించాలి. దానికి ప్రతిఫలంగా ఇప్పుడిస్తున్న రూ.5 వేల కంటే రెట్టింపు, అంతకంటే ఎక్కువగా వైసీపీ అభ్యర్థుల నుంచి ఇప్పిస్తామని ఆశలు పెట్టారు. ఇప్పటికే పలు చోట్ల ఎమ్మెల్యేలు వలంటీర్లకు తాయిలాలు పంపిణీ చేశారు. ఆర్థికంగా ఆదుకుంటామని ఆశ పెట్టారు. వలంటీర్ల కోసం ప్రజాధనం సుమారు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసి జగన్ సొంత పార్టీ కోసం వాడుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను కూడా వాడుకోవాలని నిర్ణయించారు. వలంటీర్లను అజమాయిషీ చేస్తున్నది సచివాలయ ఉద్యోగులే. పైగా గ్రామాల్లో ప్రజలకు సచివాలయ ఉద్యోగులు కూడా టచ్‌లో ఉన్నారు. ఆయా కుటుంబాల వారితో ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని ఎన్నికల్లో వైసీపీకి ఓట్ల రూపంలో లబ్ధి చేకూర్చేలా సచివాలయ ఉద్యోగులను వాడుకోవడంపై దృష్టిపెట్టారు. దీంతో సచివాలయ ఉద్యోగులను దువ్వే పనిలో పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకటిన్నర లక్షల మంది ఉండటంతో వారిని సమన్వయం చేసుకునేందుకు కోర్ టీమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా పార్టీ సేవకు వాడుకోవాలని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. జగన్ మీద అభిమానం, వైసీపీ పట్ల సానుకూలత ఉన్న సిబ్బందిని రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటేషన్‌పై నియమిస్తున్నారు. వాళ్లంతా జగనన్న ఎన్నికల టీమ్ అంటూ ఇప్పటికే జిల్లాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటిదాకా ప్రభుత్వ ఖర్చుతో ఎన్నికల ప్రచారం చేయించిన జగన్ ఇప్పుడు వలంటీర్లతో పాటు సచివాలయ ఉద్యోగులను కూడా వాడుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అప్పగించిన బాధ్యతలు ఉండగా, మళ్లీ పార్టీ పనులు చెప్పి మరింత ఇబ్బందుల్లోకి నెట్టుతున్నారని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ పోస్టులు ఖాళీలు ఉండటంతో బదిలీల విషయంలో కూడా ప్రభుత్వం రకరకాల నిబంధనలు పెట్టిందని చెబుతున్నారు.



శనివారం సభా వేదిక వద్ద పోలీసులు

'సిద్ధం' కోసం స్టేషన్లు ఖాళీ!

- వందల సంఖ్యలో పోలీసుల తరలింపు
- నేడు సభ జరిగే బాపట్ల జిల్లా, పక్కన ప్రకాశంలో ఒకరిద్దరితోనే చాలా పోలీస్‌స్టేషన్ల నిర్వహణ
- ఈ రెండు జిల్లాల నుంచే 2వేలకుపైగా తరలింపు
- ప్రభుత్వ సిబ్బందికీ 'సిద్ధం' డ్యూటీలు
- పైకి 15 లక్షలు తమ టార్గెట్ అంటూ ఆర్భాటం
- పక్కజిల్లాల నుంచీ భారీగా బస్సులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి జగన్ ఎందుకు 'సిద్ధం' అంటున్నారో తెలియదుగానీ, రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లు మాత్రం ఖాళీ అయిపోతున్నాయి. ఆదివారం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పిచ్చుకలగుడిపాడులో సీఎం సభను తలపెట్టారు. ఈ సభ కోసం పోలీసు సిబ్బందిని భారీఎత్తున తరలిస్తున్నారు. దీంతో ఆ జిల్లాలోని చాలా పోలీస్‌స్టేషన్లలో శనివారం ఒకరిద్దరికి మించి పోలీసులు కనిపించలేదు. ప్రకాశం జిల్లాలో మొత్తం 41 పోలీసు స్టేషన్లు ఉండగా, మొత్తం 1,770 మంది పనిచేస్తున్నారు. అందులో ఏకంగా 1,250మందిని 'సిద్ధం' కోసం తరలించారు. మిగిలిన వారిలో కొందరు సెలవు, మరికొందరు ఇంటర్ పరీక్షలు, తిరునాళ్ల బందోబస్తులో ఉన్నారు దీంతో పోలీసుస్టేషన్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇక.. 'సిద్ధం' సభ జరుగుతున్న బాపట్ల జిల్లాలో మొత్తం 1300 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. వారిలో 900 మందిని సభ జరుగుతున్న వేదిక వద్ద భద్రతా ఏర్పాట్ల కోసం కేటాయించారు. వాస్తవానికి, ఈ నెల మూడోతేదీనే మేదరమెట్లలో జరగాల్సిన సభ ఇది. జనసమీకరణకు వ్యవధి చాలదనుకున్నారో, లేక ఎన్నికల షెడ్యూల్ వచ్చే ముందు నిర్వహించాలని యోచించారో తెలియదుగానీ, ఆదివారానికి దానిని వాయిదా వేశారు.

అంత సీను లేదు..

సిద్ధం సభకు తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి 15లక్షల మంది హాజరవుతారని వైసీపీ రాష్ట్ర, జిల్లా నేతలతో పాటు పలువురు మంత్రులు ఊదరగొడుతున్నారు. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే మాత్రం దీనికి భిన్నంగా కనిపిస్తోంది. సభా ప్రాంగణం మొత్తం 70 నుంచి 80 ఎకరాలకు మించి ఉండదని స్థానిక రైతులు అభిప్రాయపడుతున్నారు. ఒక్కో ఎకరాకు 5వేల మందిని లెక్కించినా.. 3.5 లక్షల నుంచి 4లక్షల మందికి మించే అవకాశం ఉండదని అంచనా. ప్రజలలో స్పందన పరిశీలిస్తే పట్టుమని 2లక్షల మంది కూడా హాజరుకావటం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్దసంఖ్యలో ఆర్టీసీ, ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలతోపాటు ఇతర ఎన్ని ప్రలోభాలు పెట్టినా హాజరయ్యేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలు పెద్దగా ఆసక్తిచూపటం లేదని తెలుస్తోంది.

వైసీపీ నేతలకు చుక్కలు..

లక్షల్లో జనాలు... అన్ని వర్గాల్లో తరగని ఆదరణ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే వైసీపీ నేతలకు 'సిద్ధం' సభ ఏర్పాట్లతో అసలు తత్వం బోధపడిందని చెబుతున్నారు. జన సమీకరణలో భాగంగా గడచిన వారం రోజులుగా వైసీపీ నేతలు, ద్వితీయశ్రేణి నేతలు గ్రామగ్రామాన విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో అధికారపార్టీ మీద జనంలో గూడుగట్టుకుని ఉన్న వ్యతిరేకత సదరు నేతలకు ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చింది. దీంతో సిద్ధం సభకు కనీస స్థాయిలో కూడా జనం హాజరు కష్టమేనన్న అభిప్రాయానికి ఇప్పటికే పార్టీ నేతలు వచ్చారు. చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలకు ప్రజల నుంచి నిలదీతలు ఎదురవుతుండడంతో జనసమీకరణ విషయంలో పూర్తిగా చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీని వీడిన వారు ధన్యులనే అభిప్రాయానికి కూడా వారు వచ్చేశారని చెబుతున్నారు. కాగా, సిద్ధం సభ తర్వాత టీడీపీలోకి వైసీపీ నేతలు క్యూ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. మెజారిటీ నేతలు ఫిరాయింపులకు సిద్ధమవుతుండగా, ఇప్పటికే అభ్యర్థిత్వం ఖరారయిన వారు కూడా పక్కకు తప్పుకొనే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. మరోవైపు మూడు రోజుల నుంచి సిద్ధం సభ కోసం ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో చీరాల, బాపట్ల, రేపల్లె డివిజన్ల పరిధిలోని ఉద్యోగులలో దాదాపు 70 శాతం మంది సభా వేదిక వద్దే విధులు నిర్వహిస్తున్నారు. సిద్ధం సభకోసం కొందరు రెవెన్యూ సిబ్బంది చూపిస్తున్న అత్యుత్సాహంపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. కాగా, సీఎం సభ కోసం పక్క జిల్లాల నుంచీ భారీఎత్తున బస్సులను సిద్ధం చేశారు.

మేం 'సిద్ధం'గా లేం!

సభకు మహీధర వర్గం దూరం

'సిద్ధం' సభకు నెల్లూరు జిల్లా కందుకూరు మండలంలోని వైసీపీ ముఖ్యనేతలంతా దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఈ మండలంలోని 19 గ్రామాల సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు శనివారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మహీధరరెడ్డి రాజకీయ నిర్ణయం ఏమిటనేది తేలేవరకు వైసీపీ సమావేశాలకు హాజరయ్యేది లేదని తీర్మానించారు. ఈ విషయం తెలుసుకున్న కందుకూరు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్.. ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కలిశారు. సిద్ధం సభకు సహకరించేలా స్థానిక నేతలకు సూచన చేయాలని విజ్ఞప్తి చేశారు. "మావి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి ఆ బిల్లులు విడుదలైతే తప్ప వైసీపీ మీటింగులకు వచ్చేది లేదు. మహీధరరెడ్డి రాజకీయం నిర్ణయం ఏమిటని తెలిసే వరకు మేం ఎక్కడకూ రాబోము" అని కొందరు సర్పంచులు బుర్రా ఎదుటే తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధరరెడ్డి తాను రాసిన ఓ లేఖను బుర్రా చేతికి అందించారు. అందులో ఏముందని బుర్రా ఆరా తీయగా.. '..చదువుకో నీకు అంతా అర్థమవుతుంది' అని మహీధరరెడ్డి అన్నారు. దీంతో ఆ లేఖలో ఏముందన్నది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇక, సిద్ధం సభ జరిగేది బాపట్ల జిల్లా పరిధిలో అయినప్పటికీ హడావుడి అంతా ఇతర జిల్లాల నేతలదే కనిపిస్తోంది. ఒంగోలు- బాపట్ల మధ్య జాతీయ రహదారి పొడవునా, సభా ప్రాంగణంలో అత్యధిక భాగం ఫ్లెక్సీలు, బెలూన్లు వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా రంగంలో ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డివే కనిపిస్తున్నాయి. మేదరమెట్ల రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి స్వగ్రామం. అయినా, వైవీ ఫొటోలతో పెద్దగా ఫ్లెక్సీలు కనిపించడం లేదు.

ఓటుంటే చీర!

- మహిళా ఓటర్లకు వైసీపీ ఎర
- ఓటరు లిస్ట్‌లో పేరు చూసి పంపిణీ
- రాజమహేంద్రవరంలో రోడ్డెక్కిన నాయకులు



రాజమహేంద్రవరం నారాయణపురంలో వైసీపీ నేతలిచ్చిన చీరను చూపుతున్న మహిళలు, రాజమహేంద్రవరం నారాయణపురంలో చీరల లోడుతో ఉన్న వ్యాన్

రాజమహేంద్రవరం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మీకు ఓటుందా?.. ఓటుంటే చీర ఇస్తాం.. మీ పేరేంటి? మీకు ఓటర్ల గుర్తింపు కార్డు ఉందా? చూపించండి' అని చెబుతూ ఓటరు జాబితాలో పేరు చూసి, గుర్తింపు కార్డు.. పరిశీలించి మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైసీపీ వైఖరి ఇది. అవును.. రాజమహేంద్రవరంలో.. వైసీపీ నాయకులు బరితెగించారు.. ఓడిపోతామనే భయంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకుండానే శనివారం బహిరంగంగా.. దర్జాగా తాయిలాల పంపిణీకి దిగారు. తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది. ప్రజావ్యతిరేకత పెరిగిపోవడం, కేడర్‌లో కూడా గొడవలు రావడంతో వైసీపీ ఏదోవిధంగా ఓటర్లను ఆకట్టుకోవాలనే ప్రయత్నాలు మొదలెట్టింది. ఐప్యాక్ బృందం సలహాలతో ఇంటింటికీ తిరిగి మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎంపీ భరత్ రాజమహేంద్రవరం సిటీ నుంచి వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. దీంతో సిటీలో ఇంటింటికీ చీరల పంపిణీ మొదలు పెట్టారు. వలంటీర్లు, తనకిష్టమైన కొందరు కార్యకర్తల సాయంతో ఓ వ్యాన్‌లో చీరలు వేసుకుని ఇంటింటా తిరుగుతూ మహిళలకు పంచుతున్నారు. జగన్ ఫొటోతో ఉన్న బ్యాగ్‌లో చీరలు పెట్టి వైసీపీకే ఓటేయాలని చెబుతూ బహిరంగంగా చీరలు పంపిణీ చేస్తున్నారు. చీరలు ఉంచిన కవర్లపై సీఎం జగన్, ఎంపీ భరత్ రామ్ చిత్రాలు కూడా ఉన్నాయి. జిల్లాలో 8,20,510 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అందరికీ చీరలు ఇస్తారో లేదో కానీ, కనీసం చీర ఖరీదు రూ.500 చేసినా జిల్లా మహిళా ఓటర్లందరికీ ఇస్తే సుమారు రూ.41 కోట్ల ఖర్చవుతుంది. జిల్లాలోని రాజమ హేంద్రవరం రూరల్‌లో మంత్రి వేణు, గోపాలపురంలో మంత్రి తానేటి వనితతో పాటు ఎమ్మెల్యేలు, కోఆర్డినేటర్లు ఇప్పటికే వలంటీర్లు, విలేకరులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు బహుమతులు అందజేశారు. చీరలు, ఫ్యాంట్, షర్టు, కొందరికి డిన్నర్‌సెట్లు పంపిణీ చేశారు.



అశేష భక్త వాహిని మధ్య మల్లన్న రథోత్సవం

పుష్కరిణిలో భ్రమరాంబ మల్లికార్జునుడి తెప్పోత్సవం

అశేష భక్తజనం నడుమ కొనసాగుతున్న రథోత్సవం, (ఇన్‌సెట్) పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

శ్రీశైలం, మార్చి 9: శ్రీగిరిపై బ్రహ్మోత్సవ రథాన్ని అధిరోహించిన మల్లికార్జునుడు భ్రమరాంబ సమేతుడై భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మరుసటి రోజైన శనివారం సాయంత్రం శ్రీశైల మల్లన్న రథోత్సవం వేలాది భక్తుల నడుమ వైభవంగా సాగింది. సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం రథోత్సవం సాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారు.

తారకరత్న వర్ధంతి సందర్భంగా అన్నదానం



అన్నదానం చేస్తున్న మోహనకృష్ణ, రూప

తిరుమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నటుడు నందమూరి తారకరత్న వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు తిరుమలలో శనివారం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. తారకరత్న మృతిచెంది ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన తండ్రి నందమూరి మోహనకృష్ణ, సతీమణి రూప తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్న ప్రసాదం భవనంలో మధ్యాహ్నం అన్నదానం పథకానికి రూ.15 లక్షలు చెల్లించి భక్తులకు అన్నప్రసాదాలను స్వయంగా వడ్డించారు. అంతకుముందు ఉదయం వీఐపీ బ్రేక్‌లో వారు శ్రీవారిని దర్శించుకున్నారు. మోహన్‌కృష్ణ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 1985లో తన తండ్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా తిరుమలలో నిత్యాన్నదాన పథకం మొదలైందన్నారు. ఈ క్రమంలో దేవుడి ఆశీస్సులతో పాటు తన తండ్రి ఆశీస్సులు తారకరత్నపై ఉండాలనే ఉద్దేశంతో అన్నదానం చేశామన్నారు.

మల్లన్నసేవలో జస్టిస్ సందీప్ మెహతా



శ్రీశైలం, మార్చి 9: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా దంపతులు శనివారం దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జస్టిస్ సందీప్ మెహతా దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

జగన్ మళ్లీ వస్తే హోదా రాదు!

- ఇప్పటికే పాతికేళ్లు వెనకబాటు
- సీఎం మద్యం వ్యాపారం చేస్తున్నారు
- ఎన్నికల్లో ఎవరు డబ్బులిచ్చినా తీసుకోండి
- అదంతా మాఫియాలతో సంపాదించినదే
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలు
- 'ఇందిరమ్మ అభయం' పథకానికి శ్రీకారం
- కొండపల్లి పేదల ఇళ్లలోకి వెళ్లి పరామర్శ



ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో కట్టెలపై వంట చేసుకుంటున్న పేదలతో మాట్లాడుతున్న షర్మిల

విజయవాడ/ఇబ్రహీంపట్నం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): "తెలంగాణ రాజధాని హైదరాబాద్. కర్ణాటక రాజధాని బెంగళూరు. తమిళనాడు రాజధాని చెన్నై. ఇవన్నీ శరవేగంగా అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం రాజధాని లేదు. అభివృద్ధి లేదు. ఈ పదేళ్లలో మన రాష్ట్రం 25 ఏళ్ల వెనక్కిపోయింది" అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ మళ్లీ సీఎం అయితే రాష్ట్రానికి ఇక ప్రత్యేక హోదా రాదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో 'ఇందిరమ్మ అభయం' పథకానికి సంబంధించిన యాప్‌ను శనివారం ఆవిష్కరించారు. పేద కుటుంబాల మహిళలతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ఏపీకి ఇచ్చిన ఏ హామీనీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రత్యేక హోదాను ఇవ్వకపోగా, రాజధాని నిర్మాణం చేయలేదని మండిపడ్డారు. హోదా వస్తే పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పారిశ్రామికవేత్తలు పరుగులు తీస్తారన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో కాంగ్రెస్‌కు మాత్రమే చిత్తశుద్ధి ఉందన్నారు. దివంగత వైఎస్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటకెక్కించారని విమర్శించారు. పిల్లలను ఉన్నత విద్యకు పంపాలంటే తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. బీజేపీ రాష్ట్రానికి ఎలాంటి సాయం చేయకపోయినా జగన్, చంద్రబాబు ఆ పార్టీకి ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఆలోచించి ఓటేయాలి!

ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ప్రజల చేతుల్లో ఉన్న ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించేటప్పుడు ఆలోచించాలని షర్మిల సూచించారు. వైసీపీ, టీడీపీ పెద్దపెద్ద మూటలు తీసుకుని వస్తాయని, ఎవరు ఎంత డబ్బులు ఇచ్చినా తీసుకోవాలన్నారు. ఆ డబ్బంతా ప్రజలదేనని, మాఫియాల ద్వారా పోగేసిందేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

అందుకే ఇందిరమ్మ అభయం

పేదలకు అండగా ఉండడానికి కాంగ్రెస్ 'ఇందిరమ్మ అభయం' కార్యక్రమాన్ని రూపొందించిందని షర్మిల పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రతి నెల 1నే రూ.5 వేలు చొప్పున అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ప్రసుతం పెట్రోలు, డీజిల్, గ్యాస్, విద్యుత్, బస్సు చార్జీలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి రాష్ట్రంలో మద్యం ధరలూ పెరిగాయని ఎద్దేవా చేశారు. అందుకోసమే పురుషుల పేరు మీద కాకుండా మహిళల పేరు మీద ఈ నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో గానీ, రాష్ట్రంలో గానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం అమల్లోకి వస్తుందన్నారు.

రాష్ట్రంలో పుట్టే ప్రతీ బిడ్డపైనా అప్పే

- శాసనాలను మార్చేయడం దారుణం
- శత్రువులందరూ నశించి పోవుదురుగాక: బ్రదర్ అనిల్



అమలాపురం రూరల్, మార్చి 9: 'ఆంధ్ర అంతకంతకు అప్పుల పాలవుతోంది. రేపు పుట్టబోయే బిడ్డలపై కూడా అప్పుల భారం పడే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడింది' అని అంతర్జాతీయ సువార్తీకుడు బ్రదర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఇందుపల్లిలో శనివారం పాస్టర్ల సదస్సును సికిలే ధనరాజు ఆధ్వర్యంలో డేనియల్ పాల్ అధ్యక్షతన నిర్వహించారు. బైబిల్‌లోని అనేక వాఖ్యాలను వివరిస్తూనే మధ్యమధ్యలో రాష్ట్ర పాలకుల తీరును ఆయన విమర్శించారు. రాష్ట్రంలో శాసనాలను మార్చేస్తూ కొత్త అర్థాలను తీసుకువస్తున్నారన్నారు. శత్రువులందరూ నశించి పోవుదురుగాక అని అనిల్ పేర్కొన్నారు. క్రైస్తవ యువ నాయకులు, సంఘ పెద్దలు మాట్లాడుతూ... 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో క్రైస్తవులకు ఎటువంటి ఇబ్బందులు రాలేదు. వైఎస్ బిడ్డగా జగన్‌కు అవకాశం ఇస్తే అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం సువార్త సభలు పెట్టుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది' అని అన్నారు.

బసవతారకం కేన్సర్ ఆసుపత్రి నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం

- తాడేపల్లిలో ప్రారంభించిన నారా బ్రాహ్మణి



శిబిరానికి వచ్చిన మహిళతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

తాడేపల్లి టౌన్, మార్చి 9: ఎన్టీఆర్ కుటుంబం మొదటి నుంచి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని నారా బ్రాహ్మణి అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి సమీపంలోని మహానాడులో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నందమూరి వసుంధరాదేవితో కలసి ఆమె ప్రారంభించారు. బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్యుల పర్యవేక్షణలో ఈ ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన మెమోగ్రామ్, అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే సదుపాయాలను బ్రాహ్మణి, వసుంధరాదేవి పరిశీలించి, అందించే వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేదలు ఖరీదైన పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో నారా లోకేశ్ కేన్సర్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు బ్రాహ్మణి తెలిపారు. బసవతారకం కేన్సర్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ మొబైల్ వాహనాల ద్వారా 1200లకు పైగా వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి 2.2 లక్షల మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి బసవతారం కేన్సర్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందించినట్టు తెలిపారు.

సప్లిమెంటరీ బిల్స్ గడువు పెంచాలి: ఏపీటీఎఫ్

అమరావతి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల జీతాల సప్లిమెంటరీ బిల్స్ సమర్పించేందుకు రెండు రోజులు గడువు పెంచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

వంచనాశిల్పం జగన్!

చంద్రబాబు పాలన అంటేనే గ్రాఫిక్స్ మాయాజాలం అని ఐదేళ్ల క్రితం ప్రజలకు నూరిపోశారు. రాజధాని అమరావతి నిర్మాణం ఎలా ఉండబోతున్నదో వివరించడానికే అప్పట్లో చంద్రబాబు గ్రాఫిక్స్‌లో చూపించారు. అయినా వైసీపీ ప్రచారాన్ని నమ్మిన ప్రజలు జగన్మోహన్ రెడ్డికి అధికారం కట్టబెట్టారు. ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో భవిష్యత్ ప్రణాళికలు అటుంచి, సినిమా సెట్టింగులతో జనాన్ని మాయ చేయడాన్ని ఇప్పుడు కళ్లారా చూస్తున్నాం. కొద్ది రోజుల క్రితం కుప్పం పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి జగన్.. కృష్ణా జలాలను కుప్పంకు తరలిస్తున్నానని గొప్పలు చెప్పుకొన్నారు. ఆర్భాటంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్టు బిల్డప్ ఇచ్చారు. కార్యక్రమం ముగిసిన వెంటనే అధికారులు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన గేట్లు తొలగించి ఎత్తుకుపోవడాన్ని చూశాం. ఈ సన్నివేశం సినిమా షూటింగ్ పూర్తికాగానే సెట్టింగ్స్ తొలగించినట్టు అనిపించింది. ఈ సెట్టింగ్ బాగోతాన్ని మరవకముందే విశాఖ

> తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఉద్దేశంతో ప్రధానమంత్రిని 'పెద్దన్న' అని సంబోధించారో గానీ జాతీయ రాజకీయాలలో ఇప్పుడు మోదీ నిజంగానే 'పెద్దన్న' పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రాలలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు కూడా మోదీ అధికారం ముందు నిలబడలేక పోతున్నాయి. తెలంగాణలో నిన్నటి వరకూ అధికారంలో ఉండి బలమైన శక్తిగా కనబడిన భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తన మనుగడ కోసం బీజేపీతో పొత్తు కోసం అర్రులు చాస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో పాటు కాంగ్రెస్ ఉనికి నామమాత్రం. అక్కడ ప్రాంతీయ పార్టీలే బలంగా ఉన్నాయి. అయినా అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం–జనసేన కూటమి కూడా బీజేపీ కటాక్షం కోసం వెంపర్లాడుతున్నాయి. దేశవ్యాప్తంగా నెలకొన్న ఈ పరిస్థితులను ఆసరా చేసుకొని లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకోవాలని మోదీ–షా ద్వయం సంకల్పం పెట్టుకుంది.

పట్నంలో అలల వంతెన ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమం పూర్తయిందో లేదో ఆ అలల వంతెన ముక్కలు ముక్కలుగా విడిపోయి సముద్రంలో తేలియాడటాన్ని చూశాం. తాజాగా అదే విశాఖపట్నంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు అంటూ హడావిడి చేశారు. ఇంకేముందీ విశాఖ దశ తిరుగుతుందని అమాయకులు నమ్మారు. తీరా చూస్తే నాటి సదస్సులో పాల్గొన్నవారిలో అత్యధికులు గ్రామ సచివాలయ సిబ్బంది కావడం విస్మయానికి గురిచేసింది. సచివాలయ సిబ్బందికి కోట్లు తగిలించి సదస్సులో కూర్చోబెట్టారు. కొంతకాలం క్రితం రాష్ట్రంలోని భూములన్నింటినీ సర్వే చేయించి సర్వే రాళ్లు పాతించబోతున్నట్టు ప్రకటించారు. సదరు సరిహద్దు రాళ్లపై జగన్మోహన్ రెడ్డి బొమ్మ ఉండాలని అధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు. పొలాల్లో పక్షుల నుంచి పంటలను కాపాడుకోవడం కోసం దిష్టిబొమ్మలను నిలబెట్టినట్టుగా సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు ఏంటి? అని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. సీన్ కట్ చేస్తే అధికారుల మాటలు నమ్మి తాము తయారు చేసిన సరిహద్దు రాళ్లలో ఒక్కటి కూడా ప్రభుత్వం కొనలేదని, ఫలితంగా తాము భారీగా నష్టపోయామని గ్రానైట్ వ్యాపారులు ఇప్పుడు ఘొల్లుమంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ ఐదేళ్లలో జగన్ ఏర్పాటు చేయించిన సినిమా సెట్లకు, ఫేక్ ప్రచారాలకు అంతే లేదు. అయినా మాకు జగనే కావాలని ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుకోవాలని జగన్ అండ్ కో భావిస్తున్నారు. చంద్రబాబు పాలన అంతా గ్రాఫిక్స్ మాయాజాలం అని విమర్శించిన వారు ఇప్పుడు ఏమంటారో? అర్ధ సత్యాలు, అసత్యాలు ప్రచారం చేయడం రాజకీయ నాయకులకు పరిపాటే. అయితే జగన్ తరహాలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో సినిమా సెట్టింగులు వేయించడాన్ని ఇప్పుడే చూస్తున్నాం. అందుకే కాబోలు, జగన్‌ను ఫేక్ ముఖ్యమంత్రి అని, జగన్ పాలనను ఫేక్ పాలన అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అసత్యాలు ప్రచారం చేసే వారిలో ఎక్కడో ఒకచోట వెరపు కనిపిస్తుంది. కానీ వేల మంది సమక్షంలో అమాయకంగా ముఖం పెట్టి అలవోకగా అసత్యాలు చెబుతున్న జగన్ వంటి వారిని ఇప్పుడే చూస్తున్నాం. రాష్ట్రంలో దిశ చట్టం అమలులో లేకపోయినా సదరు చట్టం ఉన్నట్టుగా ఐదేళ్లుగా ప్రజలను మభ్య పెడుతూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని కేంద్రం తిరస్కరించినా దిశ పోలీస్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టుగా హడావిడి చేశారు. సర్వత్రా 'మోసం గురూ' అన్నట్టుగా ఐదేళ్ల పాలన సాగింది. సంక్షేమ పథకాల అమలులో లంచాలకు తావు లేకుండా చేశామని జగన్ చెప్పుకొంటారు. సంక్షేమం పేరిట ప్రజలకు మజ్జిగ పోస్తూ మీగడ మాత్రమే తినడానికి అలవాటు పడిన జగన్ వంటి వారు ఇలాంటి పథకాల అమలులో కక్కుర్తి ఎందుకు పడతారు? తమ ఆకలి తీర్చడానికి ఇసుక, మద్యం వంటివి ఉండనే ఉంటాయి కదా! అందుకే సంక్షేమ పథకాలను పైసా లంచం లేకుండా అందిస్తున్నామని ఆయన చెప్పుకొంటారు. సంక్షేమం మాటున పాలకులు చేసే దోపిడీ గురించి తెలుసుకొనే అవసరం గానీ, తీరిక గానీ ప్రజలకు ఉండదు అని జగన్‌కు బాగా తెలుసు. వచ్చే వారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఇక చూడండి.. అప్పటి నుంచి పోలింగ్ జరిగే వరకు జగన్మోహన్ రెడ్డి తన ముఖంలో నవరసాలనూ పండిస్తారు. తల్లీ లేదు.. చెల్లీ లేదు.. చెప్పుకొందామంటే బాబాయి కూడా లేడు అని ప్రజల ముందుకు వెళ్లి బిక్క ముఖం పెట్టవచ్చు. వైసీపీతో సంబంధం లేకుండా పార్టీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తల్లి విజయమ్మను తానే తొలగించిన విషయం మాత్రం అంగీకరించరు. తండ్రి రాజశేఖర రెడ్డి కోరుకున్నట్టుగా ఆస్తిలో సమాన వాటాను చెల్లి షర్మిలకు పంచి ఇవ్వడానికి నిరాకరించి తరిమేసిన విషయాన్ని మాత్రం చెప్పరు. బాబాయిని సొంత ఇంట్లోనే కిరాతకంగా నరికి చంపించిన వారికి అండగా ఉంటూ పక్కన పెట్టుకున్న విషయాన్ని మాత్రం చెప్పరు గాక చెప్పరు. పైగా వివేకానంద రెడ్డిని ఆయన ఏకైక కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి, అల్లుడు రాజశేఖర రెడ్డి చంపించారని తన రోత మీడియాలో పుంఖానుపుంఖాలుగా రోత రాతలు రాయిస్తున్నారు. ఇంతకు మించిన నటన, వంచన ఉంటుందా? జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తిని సంపూర్ణంగా ఆవిష్కరించాలంటే కనీసం పది మందైనా పీహెచ్డీలు చేయాల్సిందే. అయినా మేక వన్నె పులులు, పయోముఖ విషకుంభాలు ఎవరో ప్రజలు తెలుసుకోలేరా?

అవును.. మోదీ పెద్దన్నే!

ఐదేళ్ల క్రితం జగన్‌కు అండగా నిలబడిన తల్లి ఇప్పుడు సైలెంటయ్యారు. తనకు ద్రోహం చేసిన అన్నకు వ్యతిరేకంగా రాజకీయ రణ క్షేత్రంలో షర్మిల మోహరించారు. తండ్రి హంతకులను కాపాడుతున్న అన్న జగన్‌కు వ్యతిరేకంగా డాక్టర్ సునీత సైతం తన వంతు ప్రచారం చేస్తున్నారు. తనలాంటి వారికి న్యాయం జరగాలంటే జగన్‌ను ఓడించాల్సిందే అని ఆమె పిలుపు కూడా ఇచ్చారు. మరోవైపు జగన్‌రెడ్డి రాజకీయ ప్రత్యర్థుల మధ్య పొత్తు పొడుస్తోంది. మిగతా విషయాలను లెక్క చేయకపోయినా, తెలుగుదేశం–జనసేనతో చేతులు కలపడానికి భారతీయ జనతా పార్టీ ముందుకు రావడం మాత్రం జగన్‌ను కలవరానికి గురిచేస్తోంది. గత రెండు రోజులుగా వైసీపీ నాయకులు చేస్తున్న ప్రకటనలు, ప్రచార మాధ్యమాల ద్వారా చేస్తున్న ప్రచారాన్ని బట్టి మూడు పార్టీల కలయిక జగన్ అండ్ కోకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నట్టు ఉంది. నిజానికి ఓట్లపరంగా బీజేపీతో కలవడం వల్ల తెలుగుదేశం–జనసేన కూటమికి కలిగే ప్రయోజనం పెద్దగా ఉండదు. అయినా వైసీపీ ఎందుకు కలవరపడుతోంది అంటే అందుకు కారణం ఉంది. జాతీయ స్థాయిలో భారతీయ జనతా పార్టీ బలీయమైన శక్తిగా ఆవిర్భవించింది. ప్రధాని మోదీని ఢీకొనే సత్తా ఉన్న నాయకుడు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ బలహీనపడిపోవడంతో ప్రాంతీయ పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ప్రధాని మోదీ రాజకీయాన్ని ఎదిరించి నిలబడలేకపోతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఉద్దేశంతో ప్రధానమంత్రిని 'పెద్దన్న' అని సంబోధించారో గానీ జాతీయ రాజకీయాలలో ఇప్పుడు మోదీ నిజంగానే 'పెద్దన్న' పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రాలలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు కూడా మోదీ అధికారం ముందు నిలబడలేక పోతున్నాయి. తెలంగాణలో నిన్నటి వరకూ అధికారంలో ఉండి బలమైన శక్తిగా కనబడిన భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తన మనుగడ కోసం బీజేపీతో పొత్తు కోసం అర్రులు చాస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో పాటు కాంగ్రెస్ ఉనికి నామమాత్రం. అక్కడ ప్రాంతీయ పార్టీలే బలంగా ఉన్నాయి. అయినా అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం–జనసేన కూటమి కూడా బీజేపీ కటాక్షం కోసం వెంపర్లాడుతున్నాయి. దేశవ్యాప్తంగా నెలకొన్న ఈ పరిస్థితులను ఆసరా చేసుకొని లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకోవాలని మోదీ–షా ద్వయం సంకల్పం పెట్టుకుంది. ఈ క్రమంలో తనతో పొత్తు పెట్టుకోవడానికి ఉత్సుకత ప్రదర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల మెడలు వంచి అధిక సంఖ్యలో సీట్లు



> వచ్చే వారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఇక చూడండి.. అప్పటి నుంచి పోలింగ్ జరిగే వరకు జగన్మోహన్ రెడ్డి తన ముఖంలో నవరసాలనూ పండిస్తారు. తల్లీ లేదు.. చెల్లీ లేదు.. చెప్పుకొందామంటే బాబాయి కూడా లేడు అని ప్రజల ముందుకు వెళ్లి బిక్క ముఖం పెట్టవచ్చు. వైసీపీతో సంబంధం లేకుండా పార్టీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తల్లి విజయమ్మను తానే తొలగించిన విషయం మాత్రం అంగీకరించరు. తండ్రి రాజశేఖర రెడ్డి కోరుకున్నట్టుగా ఆస్తిలో సమాన వాటాను చెల్లి షర్మిలకు పంచి ఇవ్వడానికి నిరాకరించి తరిమేసిన విషయాన్ని మాత్రం చెప్పరు. బాబాయిని సొంత ఇంట్లోనే కిరాతకంగా నరికి చంపించిన వారికి అండగా ఉంటూ పక్కన పెట్టుకున్న విషయాన్ని మాత్రం చెప్పరు గాక చెప్పరు. పైగా వివేకానంద రెడ్డిని ఆయన ఏకైక కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి, అల్లుడు రాజశేఖర రెడ్డి చంపించారని తన రోత మీడియాలో పుంఖానుపుంఖాలుగా రోత రాతలు రాయిస్తున్నారు. ఇంతకు మించిన నటన, వంచన ఉంటుందా?

పొందాలని బీజేపీ పెద్దలు పావులు కదుపుతున్నారు. ఒడిశాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను దారిలోకి తెచ్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం–జనసేన కూటమి కూడా అదే దారిలో ఉంది. కమలనాథులను సంతృప్తి పరచడం కోసం ఆరేడు లోక్‌సభ సీట్లు ఇవ్వడానికి కూడా చంద్రబాబు సిద్ధపడుతున్నారు. పొత్తులకు సంబంధించి ప్రాథమికంగా అవగాహన కుదిరినప్పటికీ తుది దశ చర్చల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఢిల్లీలోనే మకాం వేయాల్సిన పరిస్థితి. నిజానికి తెలుగుదేశం–జనసేన అవసరం బీజేపీకే ఉంది. అయినా బీజేపీ పిలుపు కోసం బాబు–పవన్ ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇతర రాష్ట్రాలలో సీట్ల సర్దుబాటు చర్చలతో అమిత్ షా బిజీగా ఉండవచ్చు గానీ, ఢిల్లీలో ఖాళీగా కూర్చోవాల్సి రావడం బాబు–పవన్‌కు ఒకరకంగా అవమానమే. అయినా కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యానికి తల వొంచక తప్పని నిస్సహాయత ఆ రెండు పార్టీలది. తెలుగుదేశం–జనసేనతో బీజేపీ చేతులు కలిపితే ఎన్నికల్లో తాను అనుకున్న విధంగా అక్రమాలకు పాల్పడలేనని గ్రహించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి పరుగెత్తారు. ప్రధాని మోదీని కలసి తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవద్దని ప్రాధేయపడ్డారు. తన ప్రయత్నాలు ఫలించే అవకాశం సన్నగిల్లడంతో జగన్‌రెడ్డి చివరి ప్రయత్నంగా తనకు అనుకూలమైన ఒక మీడియా సంస్థతో సర్వే నివేదికను ప్రసారం చేయించారు. అయినా మూడు పార్టీల మధ్య పొత్తు పొడుస్తున్నది. ఇందుకు కారణం లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై కమలనాథులకు తత్వం బోధపడింది. ఆరెస్సెస్ కూడా తన ఫీడ్ బ్యాక్ అందించింది. రాష్ట్రంలో హైందవ సంస్కృతిని జగన్మోహన్ రెడ్డి ధ్వంసం చేస్తున్నారని ఆరెస్సెస్ గుర్రుగా ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ కూడా పొత్తుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉంటున్న జగన్‌రెడ్డిని వదులుకోవడానికి ఇష్టం లేకపోయినా పొత్తు పెట్టుకోక తప్పని స్థితికి బీజేపీ పెద్దలు వచ్చారని చెబుతున్నారు. ఈ పొత్తుల వ్యవహారంపై తెలుగుదేశం–జనసేన పార్టీలను విమర్శిస్తున్న వైసీపీ నాయకులు బీజేపీని మాత్రం పల్లెత్తు మాట అనడం లేదు. కమలనాథులతో వైరం పెట్టుకునే సాహసం జగన్ చెయ్యలేరు. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా తనను కేసుల బారి నుంచి ఆదుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమే కనుక బీజేపీ జోలికి పోకుండా జగన్ అండ్ కో జాగ్రత్త పడుతున్నారు. జగన్ అండ్ కో భయాల విషయం అలా ఉంచితే బీజేపీతో పొత్తు మొదటికే మోసం రాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం తెలుగుదేశం–జనసేనపై ఉంది. ఏ పరిస్థితుల్లో, ఏ కారణాలతో పొత్తు పెట్టుకోవలసి వస్తున్నదో ఆ రెండు పార్టీలూ ప్రజలకు వివరించాలి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని పైకి లేపి అభివృద్ధి పథంలో నడిపించడానికి బీజేపీతో పొత్తు ఎలా ఉపకరిస్తుందో ప్రజలకు నచ్చచెప్పగలగాలి. అప్పుడే పొత్తుల వల్ల ఉపయోగం ఉంటుంది. వ్రతం చెడినా ఫలితం దక్కాలి కదా!

> పొత్తుల వ్యవహారంపై తెలుగుదేశం–జనసేన పార్టీలను విమర్శిస్తున్న వైసీపీ నాయకులు బీజేపీని మాత్రం పల్లెత్తు మాట అనడం లేదు. కమలనాథులతో వైరం పెట్టుకునే సాహసం జగన్ చెయ్యలేరు. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా తనను కేసుల బారి నుంచి ఆదుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమే కనుక బీజేపీ జోలికి పోకుండా జగన్ అండ్ కో జాగ్రత్త పడుతున్నారు.

15 మంది జంప్?

ఇప్పుడు తెలంగాణ రాజకీయాలకు వద్దాం. లోక్‌సభ ఎన్నికలు మూడు పార్టీలకూ విషమ పరీక్షగా ఉండబోతున్నాయి. దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగాలంటే ఆ పార్టీకి యాభై శాతానికి పైగా లోక్‌సభ సీట్లు లభించాలి. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని కొట్టేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీ, తన ఆకాంక్ష నెరవేరాలంటే కనీసం ఐదారు స్థానాలు గెలుచుకోవాలి. మూడు నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితిది మరీ విచిత్రమైన పరిస్థితి. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం రెండు మూడు స్థానాలైనా గెలుచుకొని సగం పైగా స్థానాలలో ద్వితీయ స్థానంలో నిలబడని పక్షంలో ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. స్థూలంగా మూడు పార్టీల పరిస్థితి ఇది. ప్రస్తుత అంచనాల ప్రకారం భారత రాష్ట్ర సమితి ఒకటి రెండు స్థానాలైనా గెలవగలదా? అన్న ప్రశ్న రాజకీయ పరిశీలకుల నుంచి వినిపిస్తోంది. దక్షిణ తెలంగాణలోని కొన్ని స్థానాలలో ఆ పార్టీ ద్వితీయ స్థానానికే పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రధాన పోటీ కాంగ్రెస్–బీజేపీ మధ్యనే కేంద్రీకృతం అయిందన్న అభిప్రాయం బలంగా వ్యాపించడం వల్ల బీఆర్ఎస్ శ్రేణుల మనోస్థైర్యం సన్నగిల్లుతోంది. ఈ దుస్థితి నుంచి బయటపడడం కోసం కేసీఆర్ ఏం చేస్తారో చూడాలి. అయితే మరికొద్ది రోజుల్లో చోటుచేసుకోబోయే పరిణామాలు బీఆర్ఎస్‌కు మనుగడ ఉంటుందా? ఉండదా? అన్నది స్పష్టంచేస్తాయి. సిట్టింగ్ ఎంపీలు కొందరితో పాటు మాజీ ఎంపీలు సైతం పార్టీని వదిలి బీజేపీలో చేరుతున్నారు. ఎన్నికల వరకు ఎమ్మెల్యేలు అందరూ ఐక్యంగా పార్టీకి అండగా ఉంటారా? ఉండరా? అన్న సందేహాలు కూడా మొదలయ్యాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ముఖ్యులతో టచ్‌లోకి వెళ్లారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే విషయంలో ఇంతకాలం విముఖంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా మనసు మార్చుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు. 2014లో కేసీఆర్‌కు కూడా 63 మంది ఎమ్మెల్యేలే ఉండేవారు. దీంతో ప్రభుత్వ సుస్థిరత కోసం తెలుగుదేశం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆయన టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ బలం కూడా 64 మందే. ఈ కారణంగా నాడు కేసీఆర్ చూపిన బాటలో ఇప్పుడు తాము కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పేమిటి అని కాంగ్రెస్ ముఖ్యులు ప్రశ్నిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం జంట నగరాలు, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వెళ్లారు. చేరికలకు తలుపులు తెరిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలకపోవచ్చునని అంటున్నారు. ప్రస్తుతానికి ఇద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖత వ్యక్తంచేస్తున్నారు. తమాషా ఏమిటంటే, గ్రేటర్‌లో గెలిచిన శాసనసభ్యులు అందరూ గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ తరఫున గెలిచి బీఆర్ఎస్‌లో చేరినవారే. ప్రస్తుత సమాచారం ప్రకారం పదిహేను మందికి పైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలలోపే ఈ చేరికలు జరిగిపోతే భారత రాష్ట్ర సమితికి కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఫిరాయింపులకు గతంలో తెర లేపింది కేసీఆరే కనుక ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే పనిచేసినా వారిని ప్రశ్నించే నైతికత ఆయనకు ఉండదు. ఈ పరిస్థితిని అనుకూలంగా మలచుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. 2014లో అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చినందున ఫిరాయింపులను ప్రోత్సహించినా కేసీఆర్‌ను ప్రజలు సమర్థించారు. 2018లో 88 స్థానాలను గెలుచుకున్నప్పటికీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని ప్రజలు ఆక్షేపించారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరడానికి ముందుకొచ్చే శాసనసభ్యులకు తలుపులు తెరవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు తాము ఆ పనిచేయకపోతే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారతీయ జనతా పార్టీలో చేరిపోతారని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీంతో చేరికలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. తన పార్టీ నుంచి వలసలను నిరోధించడానికి కేసీఆర్ ఏం చేస్తారో చూడాలి. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం పది స్థానాలను హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రేవంత్ రెడ్డి వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇక భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే, ఆ పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను మాత్రమే గెలుచుకున్నప్పటికీ ప్రస్తుతం మంచి ఊపు మీదే ఉంది. దక్షిణ తెలంగాణలో పార్టీ బలహీనంగా ఉన్న విషయాన్ని గమనించిన కమలనాథులు ఆ దిశగా ఫోకస్ పెట్టారు. ప్రజల్లో అంతో ఇంతో పట్టు ఉన్న నాయకులను గుర్తించి ఎంపీ అభ్యర్థులుగా బరిలో దించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్‌ను పార్టీలో చేర్చుకున్నారు. గత ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు అంతకంటే ఎక్కువ సీట్లు గెలుచుకోవడం కోసం పావులు కదుపుతోంది. ఐదు, అంతకు మించి సీట్లు గెలుచుకోగలిగితే రాష్ట్రంలో బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరిస్తుంది. ప్రధాని మోదీ ఇప్పటికే తెలంగాణలో రెండు రోజులు ప్రచారం చేశారు. తెలంగాణలో బలపడితే ఆ తర్వాత ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించవచ్చునన్నది కమలనాథుల మనోగతం. కర్ణాటకలో ఈసారి బీజేపీ మెజారిటీ ఎంపీ సీట్లు గెలుచుకుంటుందన్న అభిప్రాయం బలంగా ఉంది. తెలంగాణలో కూడా మరింత దూకుడు ప్రదర్శిస్తే మెజారిటీ సీట్లు గెలుచుకోవచ్చునని లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధాని మోదీ గ్లామర్ అదనపు బలం కనుక లక్ష్య సాధన అసాధ్యం కాదని బీజేపీ నాయకులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థతకు గీటురాయి కానుంది. బీజేపీ మాత్రం సేఫ్ జోన్‌లో ఉంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటు దాదాపు ఖాయంగా కనిపిస్తున్నందున ఆ పార్టీ నాయకులు సమరోత్సాహంతో ఉన్నారు. అసలు సిసలు విషమ పరీక్షను కేసీఆర్ ఎదుర్కోబోతున్నారు. ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాతా అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో అపర చాణక్యుడిగా, రాజకీయ గండరగండడుగా పేరొందిన కేసీఆర్ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీని నిలబెట్టుకోగలరా? లేదా? అన్న పరీక్షను ఎదుర్కోబోతున్నారు. గతంలో పదేళ్లపాటు, ఇప్పుడు ఐదేళ్లుగా జగన్‌రెడ్డి దాష్టీకాన్ని ఎదుర్కొంటూ పార్టీని నిలబెట్టుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు బాటలో కేసీఆర్ పయనించి నిలబడగలరా? లేదా? అన్నది త్వరలోనే తేలిపోతుంది. రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును ఈసడించుకున్న కేసీఆర్, ఇప్పుడు అదే తెలుగుదేశం పార్టీని ప్రేరణగా తీసుకొని ప్రతిపక్షంలో రాణిద్దామని చెప్పడం కాల మహిమే!

> కొంతకాలం క్రితం రాష్ట్రంలోని భూములన్నింటినీ సర్వే చేయించి సర్వే రాళ్లు పాతించబోతున్నట్టు ప్రకటించారు. సదరు సరిహద్దు రాళ్లపై జగన్మోహన్ రెడ్డి బొమ్మ ఉండాలని అధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు. పొలాల్లో పక్షుల నుంచి పంటలను కాపాడుకోవడం కోసం దిష్టిబొమ్మలను నిలబెట్టినట్టుగా సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు ఏంటి? అని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. సీన్ కట్ చేస్తే అధికారుల మాటలు నమ్మి తాము తయారు చేసిన సరిహద్దు రాళ్లలో ఒక్కటి కూడా ప్రభుత్వం కొనలేదని, ఫలితంగా తాము భారీగా నష్టపోయామని గ్రానైట్ వ్యాపారులు ఇప్పుడు ఘొల్లుమంటున్నారు. రాష్ట్రంలో దిశ చట్టం అమలులో లేకపోయినా సదరు చట్టం ఉన్నట్టుగా ఐదేళ్లుగా ప్రజలను మభ్యపెడుతూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని కేంద్రం తిరస్కరించినా దిశ పోలీస్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టుగా హడావిడి చేశారు. సర్వత్రా 'మోసం గురూ' అన్నట్టుగా ఐదేళ్ల పాలన సాగింది.

చరిత్ర అచ్చంగా శాస్త్రమే

> బ్రిటీష్ చరిత్రకారులు చేసిన వక్రీకరణలను సరిదిద్దుతూ దేశభక్తినీ, సంస్కృతిపట్ల గౌరవాన్ని పెంపొందించడానికి కృషిచేసిన భండార్కర్, రాయ్ చౌదరీ, జయస్వాల్, మజుందార్ వంటి జాతీయవాద చరిత్రకారులు ప్రాచీన పాలకుల చారిత్రకతను నిర్ధారించడానికి ప్రయత్నించకపోలేదు. అయితే వారు లేని స్వర్ణయుగాల్ని సృష్టించడానికి ప్రయత్నించిన మాట నిజమేకానీ శాస్త్రీయంగా రుజువుకాని అచారిత్రకులను చరిత్రలో ఇరికించలేదు.


'చరిత్రను ఇకనైనా చక్కదిద్దుకోవాలి!' అనే మార్చి 3 నాటి ఆంధ్రజ్యోతి వ్యాసంలో చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ 'సత్యమైన ఉదాత్తమైన దేశభక్తిని కలిగించే భారతదేశ చరిత్ర వెలువడాలని' ఆకాంక్షించారు. వారి ఆకాంక్షలో వ్యక్తమైన సత్యం ఏ దేశ చరిత్ర అయినా చేరుకోవలసిన గమ్యమే. అయితే వర్తమానంలో నిలబడి గతం తాలూకూ సత్యాన్ని ఆవిష్కరించడం కష్టసాధ్యమైన పని. కష్టమే అయినా చరిత్రకారుని కర్తవ్యమే అది. ఒక ఆంగ్ల కవిని ఉటంకిస్తూ ప్రసిద్ధ చరిత్రకారుడు ఇహెచ్ కార్ అన్నట్టు ఈ క్రమంలో తప్పులు చేయకుండా ఉండడం చరిత్రకారుని బాధ్యతే కాని సుగుణం ఎంత మాత్రమూ కాదు. భారతీయ గతానికి చెందిన అనేక అనుశ్రుతాలు, కథలు, గాథలు చరిత్రలో భాగమైపోవాలని శర్మ అభిలషించారు. ఏది వాస్తవమో ఏది కల్పనో తెలియనంత గజిబిజిగా అల్లుకుపోయిన భారతీయ గతానికి చెందిన ఈ కథనాలు చరిత్రలో స్థానం పొందడానికి అనేక పరీక్షలను ఎదుర్కొని ఉత్తీర్ణత సాధించవలసి ఉంటుంది. గతానికి చెందిన ప్రతి సమాచారమూ చరిత్ర కాదు. శాస్త్రీయంగా నిరూపితమైన వాస్తవమే చరిత్ర అవుతుంది. వాస్తవం కాని దాన్ని చేరిస్తే చరిత్ర మౌలిక లక్షణాన్ని కోల్పోతుంది. ఒకానొక గాథ చరిత్రగా నిరూపితమయ్యేవరకు శాస్త్రీయమైన ఆధారాలను అన్వేషించుకోవడమే చెయ్యవలసింది.

చరిత్ర పునర్నిర్మాణానికి ముడిసరుకు గతం విడిచి వెళ్లిన ఆనవాళ్లు. ఇవి కొన్ని లిఖితరూపంలోనూ కొన్ని వస్తురూపంలోనూ ఉంటాయి. కుండపెంకుల నుంచి మహానిర్మాణాలవరకు ఉండే వస్తురూప ఆధారాలది చరిత్ర పునర్నిర్మాణంలో శాస్త్రీయమైన పాత్ర. కానీ లిఖిత రూపంలో ఉండే వాఙ్మయం అట్లా కాదు. ఇది మాట్లాడుతుంది. మనంతట మనల్ని అర్థం చేసుకోనివ్వదు. దేన్ని ఎలా అర్థం చేసుకోవాలో చెప్పేస్తుంది. వస్తు వాఙ్మయ ఆధారాల మధ్య మరొక తేడా ఉంది. వస్తురూపంలో ఉండే ఆధారం ఏ కాలానికి చెందిందో ఆ కాలం గురించీ లేదంటే తర్వాత కాలాల గురించీ మాట్లాడుతుంది. కానీ ఒక కాలంలో సృష్టించబడిన వాఙ్మయం అంతకుముందున్న అనేక కాలాల గురించి మాట్లాడే అవకాశం ఉంది. అప్పుడది జ్ఞాపకం నుంచి మాట్లాడుతుంది. జ్ఞాపకాలున్నచోట మతిమరుపులుంటాయి. ఈ రెండు ఉన్నచోట మార్పులు చేర్పులు చోటుచేసుకుంటాయి. అంతే కాక వాఙ్మయసృష్టిలో వ్యక్తిగత అభిరుచులకు ఆస్కారం ఉంది. కాబట్టి వాఙ్మయ ఆధారం ఒక్కటే ఉన్నప్పుడు దాన్ని పరమ సత్యంగా అంగీకరించలేము.

ఈ నేపథ్యం నుంచి పరిశీలించినపుడు శివరామకృష్ణశర్మ ప్రస్తావించిన శకపురుషుడు విక్రమాదిత్యుడు ఒకరు అటూ ఇటూ కాకుండా సరిగ్గా 99,999 మంది శకుల్ని అంతమొందించడం శాస్త్రీయం కాదు. 140 కోట్ల జనాభాతో అలరారుతున్న భారతదేశాన్ని రక్షించడానికి ఇప్పుడున్న సైన్యమే 25 లక్షలకు మించనప్పుడు కలియుగం 3068 సం. నాటి విక్రమార్కుడి పదదళం మూడు కోట్లు ఎలా ఉంటుందీ? ఇన్ని అసంగతాల మధ్య కాళిదాసు అతని ఆస్థానంలో ఉన్నారని చెబుతున్న వేరు వేరు శాస్త్రాలలో దిగ్గజాల వంటి కవిపండితుల్లో ఎవరున్నట్టు? ఎవరు లేనట్టు? బ్రాహ్మీ, దేవనాగరి లిపుల సమగ్ర రూపకల్పన జరిగి మూడు వేల ఏళ్లు కూడా కానప్పుడు కాళిదాసు రచన జ్యోతిర్విద్యాభరణాన్ని క్రీ.శ.4–5 శతాబ్దాల మధ్య కాక వేరే ఎక్కడ పెట్టగలం?

రామాయణ భారతాలని చరిత్ర పాఠాలుగా చేర్చడాన్ని శివరామకృష్ణశర్మ స్వాగతించారు. ఎన్‌సిఇఆర్‌టి ఉప కమిటీ చైర్మన్ ఐజాక్ ఈ ప్రకటన చేస్తూ వాటిని ఇకనుంచి mythగా చదవడానికి వీల్లేదన్నారు. ఎప్పటినుంచో సాహిత్య పాఠాలుగా ఉన్న ఈ ఇతిహాసాలు ఇంకెంతకాలమైనా ఆ పాఠాలుగా కొనసాగడానికి అభ్యంతరం లేదు కానీ చరిత్రలో భాగం కాగల చారిత్రక ఆధారాలు వాటికి లేవు. రామసేతువులు, సముద్రంలో మునిగిన ద్వారకలూ వాటిని చరిత్రగట్టును తాకించలేవు. పౌరాణికవ్యక్తులైన శ్రీరాముడికి ధర్మరాజుకీ మధ్య, ధర్మరాజుకీ చారిత్రకవ్యక్తి అయిన చంద్రగుప్తమౌర్యునికి మధ్య పాలించిన పాలకుల వివరాలను ఆశిస్తున్నారు శర్మగారు. పదకొండు వేల సంవత్సరాలు పాలించాడని చెబుతున్న శ్రీరాముడు, వేలాది సంవత్సరాలు విస్తరించాయంటున్న కృత త్రేతా ద్వాపర యుగాలను శాస్త్రీయంగా రుజువైన పదిహేను వేల ఏండ్లు మించని రాతియుగ, లోహయుగాలలోకి ఎట్లా ఇరికిస్తారూ?

డిడి కొశాంబి, రొమిల్లా థాపర్ వంటి చరిత్రకారులు విస్తారంగా ఉన్న ప్రాచీన గాథాసంపదని కొట్టి పారవేయలేదు. వాటి వెనుక ఉన్న శాస్త్రీయమైన అర్థాలను వెలికి తీసే ప్రయత్నం చేశారు.



గోవులను గాచిన శ్రీకృష్ణుణ్ణి పశుపాలక సమాజానికీ, నాగలి ధరించి తిరుగాడిన బలరాముణ్ణి వ్యావసాయిక సమాజానికి ప్రతినిధులుగా గుర్తించారు. గోగ్రహణం జరిగితే గగ్గోలు పెట్టిన విరాటుడి సంపదంతా గోవులేనని నిర్ధారించారు. నాగేటి చాలు అనే అర్థం ఉన్న సీత, జనకుడు భూమి దున్నుతుంటే బయటపడడం గురించి విచికిత్స చేశారు. అడుగు పెట్టినంతమేర శ్రీరాముడు వనవాసం చేసిన దండకారణ్యాన్ని ఆర్యభూమిని చేశాడన్నారు. రాక్షసులెవరో దేవతలెవరో జాతి పరంగా వింగడించారు. అంటే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలను భారతీయ సాంస్కృతిక గాథా వారసత్వంలో గుర్తించడానికి ఆస్కారం ఉంది కానీ ప్రాచీన వాఙ్మయంలో అసంఖ్యాకంగా కనిపిస్తున్న రాజుల వంశావళి (genealogy)ని, సంవత్సరానుక్రమణిక (chronology)లను నిర్ధారించడం సాధ్యం కాదు. బ్రిటీష్ చరిత్రకారులు చేసిన వక్రీకరణలను సరిదిద్దుతూ దేశభక్తినీ, సంస్కృతిపట్ల గౌరవాన్ని పెంపొందించడానికి కృషిచేసిన భండార్కర్, రాయ్ చౌదరీ, జయస్వాల్, మజుందార్ వంటి జాతీయవాద చరిత్రకారులు ఈ పాలకుల చారిత్రకతను నిర్ధారించడానికి ప్రయత్నించకపోలేదు. అయితే వారు లేని స్వర్ణయుగాల్ని సృష్టించడానికి ప్రయత్నించిన మాట నిజమేకానీ శాస్త్రీయంగా రుజువుకాని అచారిత్రకులను చరిత్రలో ఇరికించలేదు.

చరిత్ర అంటే ఒకానొక గతంలో జరిగిన సంఘటనల వెనుక జరిగిన పరిణామాల మధ్య నెలకొన్న కార్యకారణ సంబంధాల వివరణ లేదా విశ్లేషణ. ఒక వర్తమానం గతంగా మారిన తర్వాత దాన్ని పునర్నిర్మించినపుడు అది చరిత్ర అవుతుంది. వర్తమానంలో నిలుచుని జరుగుతున్న సందర్భాన్ని నిక్షిప్తం చేసే వ్యక్తి నేల మీద నిలబడి సమాంతరంగా జరుగుతున్న దృశ్యాన్నిచూసే వ్యక్తిలాంటివాడు. ఈ వీక్షణలో ఆ వ్యక్తికి కొన్ని కోణాలు కనిపించకపోవచ్చు. కానీ వర్తమానం గతంగా మారినపుడు చూసే చరిత్రకారుని చూపు పర్వతంమీద నుంచి క్రిందకు చూసే దృష్టి లాంటిది. అతను వర్తులాకారంలో తిరుగుతూ చూసినపుడు అన్నీ కాకపోయినా అనేక పార్శ్వాలు కనిపిస్తాయి. వాటి వెనుక అనేక వాస్తవాలు దర్శనమిస్తాయి. ఏ వాస్తవం గతంతోనూ భవిష్యత్తుతోనూ సంబంధం కలిగి ఉంటుందో దాన్నే చారిత్రక వాస్తవం అంటారు చరిత్రకారులు. చరిత్రకారుడు భూత, వర్తమాన కాలాల్ని ఒక దాని వెలుగులో మరొకదాన్ని అర్థం చేసుకునే క్రమంలో చారిత్రక వాస్తవాన్ని గుర్తిస్తాడని కూడా అంటారు.

చరిత్ర అచ్చంగా శాస్త్రమే, అంతకంటే ఎక్కువా కాదు తక్కువా కాదు అన్నాడు జెబి బ్యూరీ. కథల్ని గాథల్నీ చరిత్రగా అంగీకరించనంత మాత్రాన భారతీయ గతం పట్ల వ్యతిరేకత ఉన్నట్లు కాదు. ఉన్నది శాస్త్రీయంగా రుజువైన దాన్నే చరిత్రగా అంగీకరించాలనే నిబద్ధత మాత్రమే. ఎక్కడో చదివినట్టు 'బతికి ఉన్నవాళ్ల గురించే మనకు సరిగ్గా తెలియదు. ఇక ఎప్పుడో చనిపోయినవాళ్ల గురించి ఎంత తెలుస్తుందీ?' అది తెలుసుకోవడానికి ఎంత జాగ్రత్త కావాలీ, శాస్త్రీయత ఉండాలీ?!

■ కొప్పర్తి వెంకటరమణమూర్తి







భవానీ ఐల్యాండ్, బెర్మ్‌పార్క్ తాకట్టు..!

గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేట్ బ్యాంక్ నుంచి రుణం

- రూ.15 కోట్ల రుణం తీసుకున్న ఏపీటీడీసీ
- కాటేజీలు, హోటళ్ల ఆధునికీకరణకు టెండర్లు
- పనులు పూర్తిచేశాక నిర్వహణ ప్రైవేటుకు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్కును ఏపీటీడీసీ ఉన్నతాధికారులు తాకట్టు పెట్టారు. ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.15 కోట్లకు తాకట్టు పెట్టిన విషయం తాజాగా వెలుగుచూసింది. తెరవెనుక తాకట్టు ప్రతిపాదనలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది.

తెరవెనుక కుట్రలు

పర్యాటకాభివృద్ధి సంస్థ ఆస్తులను తాకట్టు పెట్టడం, ప్రైవేటీకరించడం ఏకకాలంలో ప్రారంభించారు. దీనికోసం కొత్త ఎత్తుగడ వేశారు. పర్యాటక యూనిట్లను గంపగుత్తగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచారు. ఆయా పర్యాటక యూనిట్ల లోని కాటేజీలు, రెస్టారెంట్లకు సంబంధించిన పునరుద్ధరణ పనుల కోసం టెండర్లు పిలిచారు. దీనిని బట్టి చూస్తే ఏపీటీడీసీ ఉన్నతాధికారుల మైండ్‌గేమ్ ఏమిటో అర్థమవుతుంది. ఏపీటీడీసీ ఆస్తులను అభివృద్ధి చేయటానికి తాకట్టు పెట్టినపుడు ఆ పనులను ఆ సంస్థే చేపట్టాలి. మరి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించటం ఏమిటనేదే ప్రశ్న. హరిత బెర్మ్‌పార్క్, భవానీ ఐల్యాండ్‌కు ఏడాదికి రూ.10 కోట్ల ఆదాయం వస్తుంది. కానీ, ఏడాదికి రూ.4 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేలా టెండర్లు పిలిచారు. రూ.6 కోట్ల నష్టం వాటిల్లుతున్నపుడు చేసిన అప్పులు ఎలా తీరుస్తారు..? ఈ విషయం రుణం ఇచ్చిన ప్రైవేట్ బ్యాంకుకు తెలుసో లేదో తెలియదు కానీ, ఒకవేళ ఏపీటీడీసీ రుణం చెల్లించడంలో విఫలమైతే నష్టపోయేది సదరు బ్యాంకే. కాగా, ఏపీటీడీసీ తాకట్టు ప్రతిపాదనలకు జాతీయ బ్యాంకులు రుణం ఇవ్వటానికి అంగీకరించకపోవడంతో ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.15 కోట్ల రుణం తెచ్చినట్టు తెలిసింది.

ప్రైవేటుకు ఎందుకు..?

హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ఏపీటీడీసీ టెండర్లు పిలిచింది. సదరు ప్రైవేట్ సంస్థలు తమకు అప్పగించిన పర్యాటక యూనిట్లను తమ సొంత ఖర్చుతో అభివృద్ధి చేసుకోవాలి. రీ మోడలింగ్ వంటివి చూసుకోవాలి. ఇలాంటపుడు కాటేజీలను, రెస్టారెంట్లను అభివృద్ధి చేయడానికి రూ.కోట్లు అప్పు తీసుకోవడం ఎందుకో తెలియని పరిస్థితి.

ఆదాయం ఎక్కువ.. లీజు తక్కువ..

భవానీ ద్వీపం, హరిత బెర్మ్‌పార్కుకు ఏటా రూ.10 కోట్ల ఆదాయం వస్తోంది. అలాంటి యూనిట్లను రూ.4 కోట్లకే కట్టబెట్టేస్తున్నారు. దీనివెనుక ఏపీటీడీసీ ఉన్నతాధికారులకు భారీగా వాటాలు ఇచ్చేలా తెరచాటు ఒప్పందాలు జరిగాయని తెలుస్తోంది. ప్రైవేట్ సంస్థల్లో అనధికారికంగా ఉన్నతాధికారులకు వాటాలు ఉన్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

బ్రహ్మరథం

రమణీయం.. ఆది దంపతుల రథోత్సవం

భక్తుల జయజయధ్వానాలతో మార్మోగిన కెనాల్‌రోడ్డు



నందీశ్వరుడు ధ్వజమై ఎగరగా, చండీశ్వరుడు ముందుండి నడవగా, ప్రమద గణాలు పాంచజన్యాలు పూరించగా కెనాల్‌రోడ్డులో శనివారం సాయం సంధ్యవేళ ఆది దంపతుల రథోత్సవం అత్యంత రమణీయంగా సాగింది.

వన్‌టౌన్, మార్చి 9 : కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కెనాల్ రోడ్డులో రథోత్సవం కనులపండువగా జరిగింది. దుర్గగుడి నుంచి గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి, పాతశివాలయం నుంచి భ్రమరాంబ, మల్లికార్జునస్వామి, భద్రకాళి, వీరభద్రస్వామి, బుద్ధువారి గుడి నుంచి గంగ, పార్వతి, వసంత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలోని పీఠంపై అధిష్ఠింపజేశారు. అనంతరం దుర్గగుడి స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. హారతులు సమర్పించిన అనంతరం పోలీసు కమిషనర్ కాంతిరాణా కొబ్బరికాయ కొట్టగా, రథం ముందుకు కదిలింది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ఈఈ రమాదేవి, పాత శివాలయం ఈవో లోకేశ్వరి, బుద్ధువారి గుడి ఈవో ఘంటసాల శ్రీనివాస్‌తో పాటు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసీపీ సమన్వయకర్త షేక్ ఆసిఫ్, జనసేన పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ పాల్గొన్నారు. డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, శ్రీనివాసరావు, కె.చక్రవర్తి, టి.హరికృష్ణ, ఏడీసీపీలు టి.నాగరాజు, డి.ప్రసాద్, శ్రీహరిబాబు, వన్‌టౌన్ సీఐ ధనశేఖర్‌రెడ్డితో పాటు పలు స్టేషన్లకు చెందిన సీఐలు పాల్గొన్నారు. కోలాటాలు, డప్పు వాయిద్యాలు, బేతాళ వేషధారులు, సంప్రదాయ భజనలు రథానికి ముందు సందడి చేయగా, కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్దకు వెళ్లిన రథం తిరిగి మళ్లీ రథం సెంటర్‌కు చేరుకుంది.

నగరాల్లో చిచ్చు

శ్రీశైల నిత్యాన్నదాన వసతి సత్రం కమిటీలో రాజకీయాలు



శ్రీశైలంలోని నిత్యాన్నదాన వసతి సత్రం కమిటీ భవనం



వ్యతిరేకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

- ఆధిపత్య పోరు కోసం మేయర్, ఆమె భర్త ప్రయత్నాలు
- కమిటీ ప్రధాన కార్యదర్శిని తొలగించేందుకు కుట్ర
- ఓ వర్గానికి అండగా నిలిచిన మేయర్ భాగ్యలక్ష్మి
- తన నివాసంలో కమిటీ కార్యాలయం ప్రారంభం
- రెండు వర్గాలుగా విడిపోయిన వన్‌టౌన్‌లోని నగరాలు

దైవకార్యాన్ని స్వకార్యంగా మలచుకున్నారు. ఆధిపత్య పోరులో ఓ కులాన్ని రెండు వర్గాలుగా చీల్చేసి చిచ్చు రేపారు. తెరవెనుక చక్రంతిప్పి వివాదాన్ని రాజేశారు. శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి సన్నిధిలో నగరాల కులస్తుల నిత్యాన్నదాన వసతి సత్రం కమిటీలో జరుగుతున్న వివాదాల వెనుక మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆమె భర్త ఉన్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. ఓ వర్గానికి మేయర్ అండగా నిలబడటం, తన నివాసంలోనే పోటీగా కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయడంతో ఈ వివాదం మరింత రాజుకుంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : శ్రీశైలంలో కేవలం నగరాల కోసం సత్రం నిర్మించేందుకు ఆ కులస్తులంతా కలిసి ఓ కమిటీగా ఏర్పడ్డారు. ఈ కమిటీ 2020లో సత్రం నిర్మాణం కోసం ప్రభుత్వాన్ని అరెకరం స్థలం అడిగింది. ఏడాదిన్నర క్రితం అప్పటి దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నగరాల ఓటుబ్యాంకు కోసం చొరవ తీసుకుని కుల సంఘాలకు స్థలాన్ని కేటాయించారు. శ్రీశైలంలో స్థలాల కేటాయింపుపై ఆంక్షలు ఉన్నా వాటిని కాదని ఈ కేటాయింపులు చేశారు. కొద్దిరోజుల తర్వాత వంద గదులతో జీప్లస్3 భవనం నిర్మాణానికి కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. కమిటీ ప్రధాన కార్యాలయాన్ని విజయవాడ కొత్తపేటలో ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా కొరగంజి జగన్, అధ్యక్షుడిగా నల్లాన సూర్యారావు, కోశాధికారిగా బెవర సూర్యనారాయణతో పాటు 18 మందితో కమిటీ ఏర్పడింది. భవన నిర్మాణాన్ని రూ.13 కోట్లతో నిర్మించాలని, ఇందుకు దాతల నుంచి విరాళాలు సేకరించాలని బైలాలో రాసుకున్నారు. తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా నగరాల నుంచి రూ.2.02 కోట్లు వసూలయ్యాయి. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో నాలుగు గదులను నిర్మించి గత ఏడాది నవంబరులో ప్రారంభించారు. ఇందుకు సుమారు రూ.2.17 కోట్లు వ్యయమైంది. నిధులు సరిపోకపోవడంతో ప్రధాన కార్యదర్శి జగన్ సుమారు రూ.35 లక్షలు సొంతంగా వ్యయం చేశారు.

కమిటీలో లుకలుకలు

ఇటీవల కమిటీలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. కొరగంజి జగన్‌ను వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించేందుకు నల్లాన సూర్యారావుతో పాటు మరికొందరు కలిసి పావులు కదిపారు. ఈ నేపథ్యంలోనే శ్రీశైలంలో నిర్మించబోయే సత్రంపై పట్టు సాధించేందుకు వేచిచూస్తున్న మేయర్, ఆమె భర్త కమిటీ రాజకీయాల్లో జోక్యం చేసుకున్నారు. కొరగంజి జగన్ వ్యతిరేక వర్గానికి మద్దతు తెలిపారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్ జగ్గుపల్లి కుమార్ మేయర్ బంధువు కావడంతో ఆయన కూడా సూర్యారావు వర్గంలో చేరిపోయారు. ఇటీవల నల్లాన వర్గం నగరాల కులస్తుల నిత్యాన్నదాన వసతి సత్రం కమిటీ పేరుతోనే మేయర్ నివాసంలో ఒక గదిలో కార్యాలయాన్ని ప్రారంభించి, అక్కడి నుంచే కార్యకలాపాలను నిర్వహించడం మొదలుపెట్టింది. కొద్దిరోజుల క్రితం శ్రీశైలం వెళ్లి అక్కడి సత్రం వాచ్‌మెన్‌ను కొట్టి, తాళాలు తీసుకుని భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడి కార్యక్రమాలను కూడా వీరే నిర్వహిస్తున్నారు. ఈ వివాదం ఇలా నడుస్తుండగానే, కొందరు దాతల నుంచి విరాళాలు సేకరించారు. వారికి రసీదులు ఇవ్వాలంటే ప్రధాన కార్యదర్శి అయిన జగన్ సంతకం కావాల్సి వచ్చింది. దీంతో వారికి రసీదులు ఇవ్వలేదు. కాంట్రాక్టరుకు కూడా రూ.10 లక్షలు చెల్లించాల్సి రావడంతో ప్రధాన కార్యదర్శి అనుమతి లేకుండా డబ్బు ఇచ్చేశారు.

బైలా నిబంధనలు తుంగలో తొక్కి..

బైలా నిబంధనల మేరకు సత్రం భవనం పూర్తయ్యాక కొన్ని రూములను దేవస్థానానికి అప్పగించాలి. మిగిలిన వాటిని దేవస్థానం అనుమతితో అద్దెకు ఇవ్వాలి. ఈ మేరకు భవన నిర్మాణం పూర్తయ్యాక దేవస్థానం ఈవోకు లిఖితపూర్వక లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. అటువంటిదేమీ లేకుండానే భవనం పూర్తికాకుండానే రూములను మేయర్ వర్గం అద్దెలకు ఇచ్చేస్తోంది. నిబంధనల ప్రకారం జమా ఖర్చులు చెప్పి, కొత్త కమిటీని ఎన్నుకున్నాక తాజాగా నడుస్తున్న కమిటీలోని వ్యవస్థాపక కార్యదర్శి పక్కకు తప్పుకోవాలి. ఒకవేళ తప్పుకొన్నా గౌరవాధ్యక్షుడిగా కొనసాగే అవకాశముంది. అప్పటి వరకు ఆయన్ను తప్పించే అధికారం ఎవరికీ లేదు. అయితే, ఆధిపత్యం కోసం మేయర్, ఆమె భర్త నిబంధనలను తుంగలో తొక్కి అధికార బలంతో నగరాల్లో చిచ్చు పెడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



అధైర్యమొద్దు.. అండగా ఉంటా..

ఇందిరమ్మ అభయం యాప్‌ను ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో శనివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టేబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.

- 6లో..

అంతా రహస్యంపై గుంటూరులో విచారణ

కేసు వర్కర్ స్థానికతను పరిశీలించాలని నిర్ణయం

- గుంటూరులో పనిచేసే కేసు వర్కర్‌కు ఎన్టీఆర్ జిల్లాలో పోస్టింగ్
- ఎన్టీఆర్ జిల్లాకు చెందిన స్థానికులకు అన్యాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో పనిచేయటానికి కాంట్రాక్టు పద్ధతిలో చేపట్టే సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ పోస్టు భర్తీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో గుంటూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అప్రమత్తమైంది. 'అంతా రహస్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారు. స్థానికత ఆధారంగానే ఆ మహిళను గుంటూరు జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు కేసు వర్కర్‌గా ఎంపిక చేశారు. ఇదే మహిళ ఎన్టీఆర్ జిల్లాలోనూ స్థానికురాలంటూ ఏకంగా సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు ఎంపిక చేయటంపై వివాదం అలుముకుంది. బాధితులు కోర్టును ఆశ్రయించటానికి రంగం సిద్ధం చేస్తుండటంతో గుంటూరు జిల్లా అధికారులు కేసు వర్కర్ స్థానికత, ఇతర అర్హతల వివరాలు బయటకు తీస్తున్నారు. కేసు వర్కర్ స్థానికతకు సంబంధించిన ధ్రువపత్రాలు, మార్కుల మెమో, అనుభవం వంటి వివరాలను పరిశీలించాలని నిర్ణయించారు. కానీ, ఎన్టీఆర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మాత్రం ఎలాంటి విచారణా చేపట్టడం లేదు. కలెక్టర్ ఢిల్లీరావు చొరవ తీసుకుని థర్డ్‌పార్టీతో విచారణ జరిపించాలని బాధిత మహిళలు కోరుతున్నారు. కలెక్టర్‌ను కూడా తప్పుదారి పట్టించారని బాధితులు ఆరోపిస్తున్నారు. గుంటూరు జిల్లాలో అక్కడి స్థానికత ఆధారంగానే ఆ మహిళను కేసు వర్కర్‌గా తీసుకున్నారు. కానీ, ఎన్టీఆర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మాత్రం ఇక్కడి స్థానికత అన్న అంశాన్ని చర్చనీయాంశం చేస్తోంది. ఇంత వివాదం జరుగుతున్నా ఏదో ఒక రకంగా ఈ అంశం నుంచి బయటపడాలన్న ఆలోచన చేస్తుందే తప్ప, పారదర్శకంగా ఎంపిక చేశామన్నదానికి ఒక్క ఆధారం కూడా చూపించటం లేదు.

చదువుల తల్లి 'ఉజ్వల'



- ఆస్ట్రేలియాలో మృతిచెందిన తెలుగు వైద్యురాలు
- గన్నవరం చేరిన భౌతికకాయం
- విద్యానగర్‌లో విషాదఛాయలు

ఆస్ట్రేలియాలో ప్రమాదవశాత్తూ మృతిచెందిన వైద్యురాలు వేమూరు ఉజ్వల భౌతికకాయం శనివారం తన స్వస్థలం గన్నవరంలోని విద్యానగర్‌కు చేరింది. ఆమె భౌతికకాయాన్ని చూసిన బంధువుల ఆర్తనాదాలతో విద్యానగర్ కన్నీటిపర్యంతమైంది. వైద్యురాలిగా రోగులకు సేవలందించాలనే కల నెరవేరకుండానే ఉజ్వల విగతజీవిగా ఇంటికి చేరడాన్ని వారంతా జీర్ణించుకోలేకపోయారు.

- 6లో..



మంగళసూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

కల్యాణ వైభోగమే!

కమనీయం.. ఆదిదంపతుల కల్యాణం

రమణీయం.. దుర్గానాగేశ్వరుని కల్యాణం

మోపిదేవి, మార్చి 9: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో దుర్గా నాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణం శనివారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 2 గంటలకు స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో విశేష అలంకరణ చేసిన సింహవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు, దేవదాయశాఖ తరపున ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధర రావు నూతన పట్టువస్త్రాలను అర్చకులకు అందించారు. ప్రధాన అర్చకుడు బుద్దు నాగవరప్రసాద్, విజయకుమార్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని అత్యంత రమణీయంగా జరిపించారు.

కన్నులపండువగా రథోత్సవం



రథంపై ఊరేగుతున్న స్వామివారు

దుర్గానాగేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు యార్లగడ్డ సత్యజిత్ ప్రసాద్, హరీష్ వరప్రసాద్‌లు ప్రత్యేక పూజలు చేసి స్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధాన అర్చకులు బుద్దు నాగప్రసాద్, విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి తాడులాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు.

అంగరంగ వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణం

నందిగామ రూరల్: మహాశివరాత్రి సందర్భంగా దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై అర్చకుడు దాములూరు శ్రీనివాస్ శర్మ వేదమంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యాల నడుమ స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివనామ స్మరణ నడుమ వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆది దంపతుల దివ్య కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈవో వాసిరెడ్డి భూపాల్, ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం స్వామికి రుద్రహోమం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.



దాములూరు కూడలిలో సంగమేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

సంప్రదాయబద్ధంగా భవానీ ముక్తేశ్వరుడి కల్యాణం

జగ్గయ్యపేట రూరల్: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ముక్త్యాల గ్రామంలో భవానీ ముక్తేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహిచాంచారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ తరపున కవితాదత్ స్వామికి పట్టు వస్త్రాలు అందించారు. ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణం అనంతరం అమ్మ, స్వామివారు

తీసుకునేది ప్రభుత్వ జీతం.. చేసేది వైసీపీ సేవ

- గృహసారథుల మండల కన్వీనర్‌గా ఎ.కొండూరు ఐఈఆర్టీ సతీష్
- ప్రత్యేక ఉపాధ్యాయుడి తీరుపై సర్వత్రా విమర్శలు

ఎ.కొండూరు, మార్చి 9: విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు), ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడానికి ప్రభుత్వ జీతం తీసుకుంటున్న ప్రత్యేక ఉపాధ్యాయుడాయన.. కానీ, వైసీపీ ప్రభుత్వ మొచ్చినప్పటి నుంచి సీఎం జగన్, వైసీపీ సేవలో తరి స్తుంటారు..ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభం పాడుకు చెందిన ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్(ఐఈఆర్టీ) దాసరి సతీష్ తీరిది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో 50 కుటుంబాలకు ఒక గృహసారథిని నియమించింది. పార్టీకి చేస్తున్న సేవను గుర్తించి గృహసారథుల ఎ.కొండూరు మండల కన్వీనర్‌గా దాసరి సతీష్‌ను వైసీపీ ఎంపిక చేసింది. దీంతో నెల నెలా ప్రభుత్వ జీతం తీసుకుంటూ విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయుడిగా నిర్వర్తించాల్సిన తన విధులను పక్కన పెట్టి వైసీపీ కార్యక్రమాల్లో మునిగితేలుతున్నారు. ఇటీవల తిరువూరు నియోజకవర్గ స్థాయిలో ఒక కుల సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వ హించి జగన్ పార్టీకి ఓట్లు వేయాలని ఆయన కోరారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును ప్రభుత్వ జీతంగా తీసుకుని, వైసీపీ నాయకుడిగా వ్యవహరి స్తున్న ఐఈఆర్టీపై తక్షణం చర్యలు తీసుకోవా లని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను పలు రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.



కుల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి వైసీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన సతీష్

12 లేదా 13న సీఎం నగర పర్యటన

- ఏర్పాట్లు పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 9: విజయవాడ అర్బన్ పరిధిలో అర్హులైన వారికి నివాస స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ పత్రాలు అందించడం, పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఈనెల 12 లేదా 13వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నగరంలో పర్యటించనున్నారని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పోలీసు కమిషనర్ కాంతి రాణా, జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, స్థానిక ప్రజాప్రతిని ధులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో సభా వేదిక ఏర్పాటు, వివిధ ప్రాంతాల వాహనాల పార్కిం గ్, భద్రతా ఏర్పాట్లు, సభాస్థలి ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి అధికా రులకు ఆదేశాలిచ్చారు. కృష్ణా కరకట్ట రెండు, మూడో దశల రక్షణ గోడలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేయనుండడంతో ఆ ప్రాంతాన్నీ అధికారు లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్, నగర పాలక సంస్థ చేపడుతున్న సుందరీకరణ పనులు పరిశీలించారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

జగన్ ఓటమే లక్ష్యం

- 25 వాహనాలతో రాష్ట్రవ్యాప్తంగా 'కొట్టె' వారి ఎన్నికల ప్రచారం
- టీడీపీ-జనసేన అభ్యర్థుల గెలుపు కోసం స్వచ్ఛందంగా ప్రచారం: జనసేన మచిలీపట్నం నాయకుడు కొట్టె వెంకట్రావు

మచిలీపట్నం టౌన్, మార్చి 9: సీఎం జగన్ ఓటమే లక్ష్యంగా టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అట్లాంటలో నివసిస్తున్న కొట్టె ఉదయభాస్కర్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పాతిక వాహనాలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నామని మునిసి పల్ మాజీ కౌన్సిలర్, జనసేన మచిలీపట్నం నాయకుడు కొట్టె వెంకట్రావు తెలిపారు. కొట్టె ఇంటి పేరుగల వారు 25 ప్రచార రథాలతో ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారని, టీం నిర్వాహకుడిగా తాను వ్యవ హరిస్తానని ఆయన శనివారం మీడియాకు తెలిపారు. ఒక్కో వాహనంలో డ్రైవరుతో పాటు ముగ్గురు ప్రచార సారథులు ప్రచారంలో పాల్గొంటున్నారన్నారు. 25 వాహ నాలతో ఫిబ్రవరి 23న బయలుదేరామని, రోజుకు మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు పర్యటిస్తున్నామని, వందమందితో ప్రచారం సాగుతోందని ఇప్పటివరకు 30 నియోజకవర్గాల్లో ప్రచారం చేశామని, ప్రచారానికి విశేష స్పందన వస్తోందని ఆయన తెలిపారు. భోజనం, పెట్రోలు, బస ఖర్చులు తామే భరించుకుంటూ ఈ ప్రచారయాత్రలో పాల్గొంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తామన్నారు. రాష్ట్రంలో కొట్టె ఇంటి పేరు గల వారి ఓట్లు లక్ష వరకు ఉన్నాయన్నారు. లక్ష ఓటర్లతో పాటు ఇతర ఓటర్లు కూటమి అభ్యర్థులకు ఓట్లేసేలా ప్రచారం చేస్తున్నామన్నారు. జనసేన-టీడీపీ-బీజేపీ పొత్తు వల్ల వైసీపీ అరాచకాలకు అడ్డువేసేందుకు వీలవుతోందన్నారు. అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లి, జగన్ వల్ల రాష్ట్రం ఎంత నష్టపోయిందో ప్రజలకు ఈ ప్రచారంలో వివరిస్తున్నామన్నారు.



కొట్టె వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచారానికి బయల్దేరుతున్న వాహనాలు

11 సరుకులు ఏమయ్యాయి జగన్

రేషన్ వ్యానుల్లో ఇచ్చేది బియ్యం, పంచదార, కందిపప్పే

- మరి మిగతావాటి మాటేంటి?..సీఎంను ప్రశ్నించిన షర్మిల
- కొండపల్లిలో మహిళలతో ముఖాముఖి



కొండపల్లిలో ఓ ఇంట్లోకి వెళ్లి మహిళతో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

విజయవాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తాను అధికారంలోకి వస్తే 11 రకాల నిత్యావసర సరుకులు ఇస్తానన్న జగన్ ఆ హామీని ఏం చేశారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఇప్పుడు రేషన్ వ్యాన్ల ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు మినహా ఏమీ ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో ఇందిరమ్మ అభయం యాప్‌ను ఆమెను శనివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టేబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని విమర్శించారు. ఒకప్పుడు రూ.200 వచ్చే విద్యుత్ బిల్లు ఇప్పుడు రూ.1000 వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పేదలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొర్రా కిరణ్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహరావు, కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తాంతియాకుమారి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, జగ్గయ్యపేట ఇన్‌చార్జి కె.అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలు షర్మిల దృష్టికి తెచ్చారు.

పదేళ్లుగా అద్దె ఇంట్లోనే : ప్రియ

మాకు మూడు కుటుంబాలు. మేమంతా అద్దె ఇంట్లో ఉంటున్నాం. మాకు ఎవరూ ఇంటి స్థలం ఇవ్వలేదు.

తాగునీటి కోసం కొట్లాటలే : కాటా రమణ

మాకు తాగునీరు లేదు. 20 ఏళ్లుగా ఇదే సమస్య. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి పైపులైన్ వేయిస్తామని హామీలు ఇస్తారు. తర్వాత వదిలేస్తారు. రాత్రి తొమ్మిది గంటలకు కుళాయిల్లో నీటిని వదులుతారు. నీటికోసం కుళాయిల వద్ద మహిళలు నిత్యం కొట్టుకుంటున్నారు. మాకు తాగునీటి సదుపాయం కల్పించిన పార్టీకే ఓట్లేస్తాం.

లంచం ఇస్తేనే పథకాలు ఇస్తామంటున్నారు : గౌరీ

కొద్దిరోజుల క్రితం మా అమ్మ చనిపోయారు. ఆమెకు రావాల్సిన బీమా డబ్బుల కోసం లంచం ఇస్తేనే దరఖాస్తును ఆన్‌లైన్ చేస్తామంటున్నారు. ఇంటి పట్టా ఇవ్వాలన్నా లంచం అడుగుతున్నారు. డబ్బులు ఇస్తే పనులు చేస్తున్నారు. వలంటీర్ల నుంచి అధికారుల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. స్థలం కోసం రూ.50వేలు నుంచి రూ.లక్ష అడుగుతున్నారు. కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే శవాన్ని అద్దె ఇళ్లలోకి తీసుకు రానివ్వడం లేదు. మా అమ్మ శవాన్ని నడిరోడ్డుపై పెట్టాం. పథకాల్లో అర్హుల పేర్లను తొలగించి డబ్బులిచ్చిన వారి పేర్లను పెడుతున్నారు. డబ్బులడిగిన వారి పేర్లు చెప్తే ఇంటిమీదకొచ్చి గొడవచేస్తారని భయపడుతున్నాం.

ఎన్టీపీసీ సమస్య పరిష్కరించండి: ఎన్టీపీసీ ఉద్యోగులు

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఎన్టీపీసీ రాష్ట్ర పరిధిలో ఉంటుందో, సింగరేణి పరిధో, తెలంగాణ పరిధిలో ఉంటుందో బీజేపీ తేల్చడం లేదు. ఇందులో 800 మంది ఉద్యోగులు ఉండేవారు. ఇప్పుడు 100 మందికి ఆ సంఖ్య చేరింది. రాజకీయ పార్టీలు సమస్యను పరిష్కరించడం లేదు. ఈ సంస్థ విభజన చట్టంలో షెడ్యూల్ 9, 10లో ఉంది. ఎన్టీపీసీ నీరు గారిపోతోంది. ఏపీలో ఉద్యోగవిరమణ వయసు 62, తెలంగాణలో 61 ఉంటే, ఈ సంస్థలో ఉద్యోగులకు 58 ఏళ్లే. కాంగ్రెస్ మాత్రమే ఈ సమస్యను పరిష్కరించగలదు.

బూడిద తింటున్నాం: కాలుష్య నియంత్రణ ప్రజా సమితి

ఎన్టీపీసీ కాలుష్యంతో కొండపల్లి పరిధిలోని పది గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ ప్రజలు, మొక్కలు, జంతువులకు రక్షణ లేదు. బూడిదలో బతుకుతున్నాం. బూడిద తింటున్నాం. ఊపిరితిత్తులు, కిడ్నీ, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నాం. తల ఊడిపోతోంది. మహిళలకు రుతుచక్రం సమయంలో అనేక రుగ్మతలు వస్తున్నాయి. ఒక స్కూల్‌లో 40 మంది విద్యార్థులు ఉంటే 20 మందికి గొంతు సమస్యలు వస్తున్నాయి. ప్రతి నెలా మాకు వైద్య పరీక్షలు చేయాలి. ప్రతి ఇంటికి మొక్కలు నాటి, పెంచాలి. దీని కోసం కాలుష్య నియంత్రణ ప్రజాసమితి ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. ఎన్టీపీసీలో మూడేళ్లుగా ఈఎస్పీ మిషన్లు పనిచేయడం లేదు. చివరికి చిక్కుడుపాదు బతకడం లేదు. 40 ఏళ్లకే శుక్లాల ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. రాజకీయనేతలు బూడిదను వ్యాపారానికి వాడుకుంటున్నారు. ఒకప్పుడు రోజుకు 200 ట్రిపులు తిప్పితే ఇప్పుడు 2వేలు తిప్పుతున్నారు.

కరెంట్ కనెక్షన్ అడిగితే హేళనగా మాట్లాడారు : రత్నమౌనిక

టీడీపీ హయాంలో మాకు ఇంటి స్థలం వచ్చింది. దానికి ఇప్పటి వరకు కరెంటు లేదు. కలెక్టర్ వద్దకు 12సార్లు తిరిగాం. ఎలాంటి స్పందన లేదు. కరెంటు ఆఫీసుకు పిలిపించుకుని నన్ను, నా భర్తను హేళనగా మాట్లాడారు. లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. కరెంటు తీసుకునే స్తోమత ఉందా అని హేళన చేశారు. మేం ఇంట్లో లేనప్పుడు ఫొటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో పెట్టుకుంటున్నారు. హెల్ప్‌లైన్ నుంచి ఫోన్‌చేసి సమస్య పరిష్కారం అయింది కదా అని అడుగుతున్నారు.

చదువుల తల్లి ఉజ్వల

- కల నెరవేరకుండానే మృత్యు ఒడిలోకి
- ఆస్ట్రేలియాలో ప్రమాదవశాత్తు మృతి చెందిన తెలుగు వైద్యురాలు
- ఎలుకపాడులో అంత్యక్రియలు





ఉజ్వల పార్థివదేహం, రోదిస్తున్న తల్లి మైథిలి

గన్నవరం, మార్చి 9: వైద్యురాలిగా రోగులకు సేవలందించాలనే తన కల నెరవేరకుండానే ఆ చదువుల తల్లిని మృత్యువు వెంటాడింది. అప్పటి వరకూ స్నేహితులతో ఆనందంగా గడిపిన ఆమెను మృత్యువు లోయలోకి నెట్టింది. ఎన్నో ఆశలతో వేమూరు వెంకటేశ్వర రావు, మైథిలి దంపతులు రెండు దశాబ్దాల క్రితం ఆస్ట్రేలియా వెళ్లి స్థిరపడ్డారు. వారికి కొడుకు, కుమార్తె. కొడుకు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు ఉజ్వల(24) ఆస్ట్రేలియా గోల్డ్‌కోస్ట్‌లోని బాండ్ విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పీజీ చేస్తూ రాయల్ బ్రిస్బేన్ ఉమెన్స్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. ఈనెల 2న తోటి స్నేహితులతో కలసి ట్రెక్కింగ్‌కి వెళ్లిన తెలుగు వైద్యురాలు. ఉజ్వల ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో పడి ఆస్ట్రేలియాలో అశువులు బాసింది. ప్రమాదం రూపంలో ఉజ్వల మరణం కుటుంబ సభ్యుల జీవితాల్లో చీకటి నింపింది. తల్లిదండ్రులకు, బంధువులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఉజ్వల పార్థివ దేహాన్ని విమానంలో హైదరాబాద్‌కు, అక్కడ నుంచి అంబులెన్స్‌లో గన్నవరం విద్యానగర్‌లోని ఆమె పెద్దమ్మ, పెదనాన్నలు సావిత్రి, శ్రీనివాసరావు ఇంటికి శనివారం తీసుకొచ్చారు. ఇక్కడకు తీసుకురాగానే కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఎంతో భవిష్యత్ ఉన్న ఉజ్వల మరణం అందరిని ఎంతగానో కలచివేసింది. ప్రముఖ న్యాయవాది కేవీ రమణ, పోతినేని చంద్రశేఖరరావు, నెక్కలపూడి ఈశ్వరరావు, ప్రముఖులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఉంగుటూరు మండలం ఎలుకపాడులోని అమ్మమ్మ, తాతయ్య మూల్పూరు జయలక్ష్మి, రమేష్ ఇంటికి తీసుకు వెళ్లి వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఉజ్వల మృతి ఈ ప్రాంతంలోని ఆమె కుటుంబ సభ్యులందరినీ కుంగదీసింది.

రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

- సమన్వయ కమిటీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక, మార్చి 9: రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 11న రంజాన్ మాసం ప్రారంభం కానుండడంతో ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా అధికార యంత్రాంగం మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తోందని, మతపెద్దల సూచనలను పరిగణనలోనికి తీసుకున్నామని జేసీ తెలిపారు. మసీదుల వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా బారికేడింగ్, ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తాగునీరు, పారిశుద్యం, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రతి మసీదు వద్ద అవసరం మేరకు పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పెద్ద, చారిత్రక మసీదుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమైన రోజులు, జాగారం సమయాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు జేసీ తెలిపారు. సమావేశంలో మత పెద్దలు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విజయవాడ, నందిగామ ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్ర, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షంసున్నీసా బేగం, డీపీవో జయచంద్ర గాంధీ, వీఎంసీ అదనపు కమిషనర్ ఎ.మహేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఎఫ్‌వో ఏపీ శంకరరావు, మతపెద్దలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

దగాపడిన దళితుడా మేలుకో

- దళిత శంఖారావంలో కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, మార్చి 9: "వైసీపీ పాలనలో దళితులు దగా పడ్డారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందాల్సిన నిధులు అందలేదు. ఎస్సీ లకు సబ్సిడీ రుణాలు ఇస్తానని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన సీఎం జగన్ దగా చేశారు. ఎస్సీలందరూ సంఘటితమై జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలి." అని టీడీపీ-జనసేన మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మచిలీపట్నంలో నిర్వహించిన దళిత శంఖారావం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో దళితులను కిరాతకంగా హింసించారని, దళిత శక్తి ఏమిటో ప్రభుత్వానికి చూపించే తరుణం ఆసన్నమైందని ఆయన తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని దళితవాడల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించిన ఘనత టీడీపీదేనన్నారు. దళితులను చంద్రబాబు సంపద సృష్టించడంలో దళితులను భాగస్వామ్యం చేశారని, బాలయోగిని లోక్‌సభలో స్పీకర్ చేశా రని, టీడీపీ-జనసేన తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ అన్నారు. పేర్ని నాని మచిలీపట్నాన్ని తన సొంత ఆదాయపు వనరుగా మార్చుకు న్నారని, కొల్లు రవీంద్రపై హత్య కేసు పెట్టించాడని ఆరోపించారు. చంద్ర బాబు ఎస్సీల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశారని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలిచ్చేవారని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. టీడీపీ-జనసేన విజయానికి అందరూ కృషి చేయాలని జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. బురకా బాలాజీ, ఊసా వెంకటేశ్వరరావు, బొడ్డు నాగరాజు, నీలం రామకృష్ణ, చిట్టూరి యువరాజు, దేవరపల్లి అనిత, సాతులూరి నాంచారయ్య, చిన్నం సురేష్, మాచవరపు ఆదినారాయణ, చిన్నం శేఖర్, లింగం విజయ్, గుమ్మడి విద్యాసాగర్, మాదివాడ రాము, వంపుగడల చౌదరి, గడ్డం రాజు, బండి కరుణాకర్ పాల్గొన్నారు.



పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ నాయకులతో కేశినేని చిన్ని

మరో 50 రోజుల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం

- మైనార్టీల అభ్యున్నతికి పనిచేస్తాం
- టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించండి
- పశ్చిమ మైనారిటీ నాయకుల సమావేశంలో కేశినేని చిన్ని

విద్యాధరపురం, మార్చి 9: "మరో 50 రోజులలో టీడీపీ-జనసేన ప్రభుత్వం రాబోతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యతలు మీరంతా తీసుకోండి. మీకు ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైనా సిద్ధం." అని మైనార్టీ నాయకులతో టీడీపీ విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ మ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ నాయకులు, శ్రేణులతో మొగల్రాజపురంలోని తన కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం చిన్ని సమావేశమయ్యారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో షా జహూర్ ముసాఫిర్‌ఖానా, ఉర్దూ కాలేజీలను నిర్మించిందన్నారు. పొత్తుల నేవి రాష్ట్ర భవిష్యత్తు కోసమేనన్నారు. జనసేన-టీడీపీ కూటమి అధికారం లోకి వచ్చేందుకు అందరు కలిసికట్టుగా పనిచేద్దామని జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్ పిలుపునిచ్చారు. షేక్ కరీముల్లా, మహ్మద్ రజావుల్లా, మహమ్మద్ ఇమ్రాన్, షేక్ ఆషా, అబ్దుల్ సత్తార్, జాహేద్, అన్సార్, రియాజ్, కరీముల్లా, తాజుద్దీన్, బడేషా పాల్గొన్నారు.

వైసీపీ మోసాలు గమనించండి

- టీడీపీ-జనసేన కూటమికి అఖండ విజయం చేకూర్చండి: వెనిగండ్ల రాము

నందివాడ, మార్చి 9: "గ్రామాల అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి చంద్రబాబు సీఎం అయితేనే లభిస్తాయి. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి అఖండ విజయాన్ని చేకూర్చండి. ప్రతీ ఒక్కరూ వైసీపీ ప్రభుత్వ మోసాలను గమనించండి." అని ప్రజలను టీడీపీ- జనసేన గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము కోరారు. శనివారం పోలు కొండలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వర రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జీ)తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.113 ఏళ్ల పిన్నమనేని అనసూర్యవ తమ్మ ఆశీర్వాదాన్ని వెనిగండ్ల రాము తీసుకున్నారు. వెనిగండ్ల ఆధ్వ ర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సి.ఎల్. వెంకట్రావు 70 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.



పోలుకొండలో పర్యటిస్తున్న వెనిగండ్ల, రావి, పిన్నమనేని తదితరులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	117, 126, 137
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

కృష్ణలంకలో రక్షణ దళాల కవాతు



వన్‌టౌన్, మార్చి 9 : కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసులు, ప్రత్యేక దళాలు కవాతు నిర్వహించాయి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడడంతో పాటు ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు భరోసా కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ రత్న రాజు, సీఐ మురళీ కృష్ణ, పోలీసు సిబ్బంది, కేంద్ర రక్షణ దళాల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 9 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పునియోజకవర్గంలోని బ్యాంక్‌కాలనీ, భారతీనగర్‌లలో శనివారం పర్యటించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎంసీ దాస్ దంపతుల ఆశీస్సులను గద్దె తీసుకున్నారు. గద్దె రామ్మోహన్ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తెలుగుదేశం, జనసేన పార్టీల తూర్పునియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, పార్లమెంట్ స్థానానికి కేశినేని శివనాథ్(చిన్ని)ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జాస్తి సాంబశివరావు, చలసాని రమణ, పి.రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ భక్తులకు అన్నదానం చేస్తున్న బొండా ఉమా, సోలంకి, దుర్గారావు

బొండా ఉమా గెలుపునకు కృషి చేస్తాం

పాయకాపురం, మార్చి 9 : రాబోయే ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమా గెలుపునకు కృషి చేస్తామని ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చీకటి వెంకట సుబ్బయ్య అన్నారు. 62వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ తనకు పార్టీ పదవి ఇచ్చిన బొండా ఉమాకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో కస్తాల విజయ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెలిబండ్ల దంపతుల అన్నదానం

గవర్నర్‌పేట : కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, శైలజ దంపతుల వితరణతో శనివారం సూర్యారావుపేట ఆలిండియా రేడియో కేంద్రం వెనుక భాగంలో ఉన్న టీటీడీ కల్యాణ మండం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యు డు, సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు కార్యక్రమానికి హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యూయలరీ వ్యాపారి సోలంకి జైన్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చింతా దుర్గారావు, కటిక వెంకి పాల్గొన్నారు.

కలలకు రెక్కలు పథం ఎంతో ఉపయుక్తం : సుచిత్ర



వన్‌టౌన్ : చదువుకునే ఆడపిల్లలకు కలలకు రెక్కలు పథకం ఆడపిల్లలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలుగు మహిళ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా దేశంలో ఎక్కడైనా ఆడపిల్లలు చదువుకోవచ్చునన్నారు. ప్రభుత్వ గ్యారెంటీతో వడ్డీ కూడా ప్రభుత్వమే పూర్తిగా భరించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో ఏర్పడబోయే ప్రభుత్వం ఆడపిల్లలకు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. జగన్ అమ్మఒడి పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడారన్నారు. రానున్న ఎన్నికలలో విద్యార్థులు సైకో జగన్ రెడ్డిని చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు.



పోతిన మహేష్‌ను కలిసిన దాడి మురళీకృష్ణ బృందం

వన్‌టౌన్ : ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన దాడి మురళీకృష్ణ బృందం శనివారం పశ్చిమ నియోజకవర్గంలోని జనసేన కార్యాలయంలో పోతిన మహేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మహేష్ వారిని సాదరంగా ఆహ్వానించారు.

దర్గాకు రూ.10వేల విరాళం

భవానీపురంలోని హజరత్ సయ్యద్ బుర్హానుద్దీన్ ఆలీషా ఖాద్రి దర్గాకు జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్ శనివారం రూ.10 వేల విరాళమిచ్చారు. జనసేన నాయకులు మొబీనా, గంగాధర, నసీమా, సల్మాల ద్వారా సయ్యద్ ఆలీబాయ్‌కు విరాళం అందజేశారు.



నాఫ్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైన విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావును సత్కరిస్తున్న మానం ఆంజనేయులు, బ్యాంకు డైరెక్టర్లు

విలువలతోనే సహకార సంఘాల మనుగడ

గవర్నర్‌పేట, మార్చి 9 : సహకార విలువలతోనే సంఘాల మనుగడ సాధ్యమని, నిజాయితీ, నిబద్ధత, కో-ఆపరేటివ్ సూత్రాల మీద విశ్వాసం విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు అగ్రస్థానంలో నిలవడానికి ప్రధాన కారణాలని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సహకార వేత్త మానం ఆంజనేయులు అన్నారు. విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు నాఫ్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా బ్యాంకు సిబ్బంది, బ్యాంకు పాలక వర్గం శనివారం విజయ వాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. మానం ఆంజనేయులు మాట్లాడుతూ విభిన్న రాజకీయ దృక్పథాలు కలిగిన పాలకవర్గంలోని సభ్యులు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లడం బ్యాంకు పురోభివృద్ధిలో కీలకమన్నారు. తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ నుంచి వచ్చిన సిబ్బంది రాఘవేంద్రరావును ఘనంగా సత్కరించారు. విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు వైస్ చైర్మన్ ఎస్.కామరాజు, డైరెక్టర్లు ఎం.రాఘవరావు, కోటేశ్వరరావు, జి. జనార్దనరావు, పీవీ రామారావు, సీహెచ్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గంగాధర్ కుటుంబానికి న్యాయం చేయాలి

వన్‌టౌన్,మార్చి 9: సబ్‌జైలులో మృతి చెందిన ఆటో కార్మికుడు గంగాధర్ తిలక్ కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని సీఐటీయూ పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సీఐటీయూ పశ్చిమనగర కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూబొమ్మ సెంటర్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. సీఐటీయూ పశ్చిమ నగరాధ్యక్షుడు జి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్తిబాబు, ఆటో వర్కర్ల యూనియన్ సీనియర్ నేత జి.శ్రీనివాస్, ఎస్‌కే చోటే, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత వి సాములు, హాకర్ల యూనియన్ నేత కే లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే కుటుంబానికి రక్ష

గుణదల, మార్చి 9 : మహిళలు సాధికారత సాధించినప్పుడే కుటుంబానికి అన్ని విధాలుగా రక్షణ ఉంటుందని సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుణదల్లోని ఎస్ఎస్‌సీ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణమహిళల, కిశోర బాలికల సమగ్ర సాధికారత సదస్సు నిర్వహించారు. ఒకప్పుడు కుటుంబానికి పరిమితమైన స్త్రీలు నేడు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారన్నారు. మహిళ విద్యావంతులైతే కుటుంబం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. వేటపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నారాయన స్వామి మాట్లాడుతూ సూర్య చంద్రులకైనా విరామం ఉంటుంది కానీ అమ్మకు మాత్రం విరామం ఉండదన్నారు. అమలోద్భవి మహిళా సంఘానికి రూ.9 లక్షల చెక్కును ఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఫాదర్ సునీల్ రాజు అందజేశారు. అనంతరం గుణదల పురవీధుల్లో మహిళా సాధికారతపై ర్యాలీ నిర్వహించారు. యూత్ డైరెక్టర్ ఫాదర్ జోజితంబి, ఫాదర్ వినోద్, సిస్టర్ గ్రేసి, పసల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



అమలోద్భవ మహిళా గ్రూపునకు రూ.9 లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు

యుగంధరాచార్యకు గ్లోబల్ ఐకాన్ అవార్డు

వన్‌టౌన్, మార్చి 9 : కూరపాటి స్కూల్ ప్రిన్సిపాల్ గానుగుల యుగంధరాచార్యకు 2024 గ్లోబల్ ఐకాన్ అవార్డు లభించింది. ఢిల్లీలో జరిగే ఒక కార్యక్రమంలో క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ అవార్డును అంద జేయనున్నట్లు గ్లోబల్ ఐకాన్ సంస్థ ఎండీ హర్ష ఝూ తెలిపారు. మూడు దశాబ్దాలుగా లక్షకు పైగా జ్యోతిష్య గణాంకాలు వేసిన పాఠశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని కార్యదర్శి కూరపాటి నారాయరావు అన్నారు. పాఠశాల కమిటీ, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం, మార్చి 9 : కబేళా విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళానగర్, జోజినగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్స్ కాలనీ, సితార సెంటర్, లేబర్‌కాలనీ, మిథిలానగర్, ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డు, చెరువు సెంటర్, మర్రి చెట్టు సెంటర్, పెద్ద సాయిబాబాగుడి, రైతుబజార్ రోడ్డు, లలితానగర్, మానవ మందిరం రోడ్డు, టీవీ కృష్ణారావు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారి తెలిపారు.

రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో...

రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుండి 12.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయుచున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరనగర్ (1, 2, 3 రోడ్లు) సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ (1, 2, 3రోడ్లు) స్పెన్సర్ సర్వీస్ రోడ్డు, సెంటిని హాస్పిటల్ ఏరియా, శివరామకృష్ణ రాజు వీధి, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

న్యూబ్రిడ్జి, పటమటలంక ప్రాంతాల్లో...

రామలింగేశ్వరనగర్ : విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ పటమటలంక ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.వి.సుధాకర్ తెలిపారు. సీతారామనగర్, బృందావన్ అపార్ట్‌మెంట్, నేతాజీ స్ట్రీట్, కోగంటి వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి వాచ్‌మన్ మృతి

విద్యాధరపురం : ప్రమాద వశాత్తు అపార్ట్‌మెంట్ పై నుంచి పడి శనివారం వాచ్‌మన్ మృతి చెందాడు. ల్యాంకో కాలనీ సమీపంలో ఉన్న ఎస్ ఎస్ సిగ్నేచర్ అపార్ట్‌మెంట్‌లో అమ్మిశెట్టి నరసింహరావు (40) వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. అక్కడే ఒకరూమ్‌లో భార్య పిల్లలతో ఉంటున్నాడు. ఇంటర్నెట్ కనెక్షన్ కోసం మొదటి అంతస్తుకు వెళ్లి సూచనలు ఇచ్చాడు. అనంతరం కిందకు దిగివస్తుండగా కాలుజారి పక్కనే ఉన్న స్థలంలో పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో ,చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సాయి కుమారి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్ చూడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య

విద్యాధరపురం కామకోటి నగర్ సిమెంట్‌రోడ్డులో ఏపూరి విజయ తన కుమార్తె (15)తో నివాసం ఉంటున్నది. 2014లో విజయ భర్త మృతి చెందాడు. ప్రస్తుతం ఆమె ఎర్రకట్ట వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలుగా పనిచేస్తున్నది. కుమార్తె ఒక ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. సెల్‌ఫోన్‌ను ఎక్కువగా చూడొద్దని కుమార్తెను విజయ మందలించింది. మనస్తాపం చెందిన బాలిక పక్కనే అపార్ట్‌మెంట్ టెర్రస్ పై నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

చెరువుమాధవరం నుంచి కొండపల్లి వచ్చే రైలు మార్గంలో ఒక వ్యక్తి, విజయవాడ సమీపంలోని గుణదల రైల్వే ట్రాక్‌పై మరో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసులు శనివారం వేర్వేరు కేసులు నమోదు చేశారు. మృతుల వివరాలు తెలియ రాలేదు. గుర్తుతెలియని వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాదవ బంధువుల ఆత్మీయ కలయిక నేడు

పాత రాజరాజేశ్వరి పేట, మార్చి 9 : పాల ఫ్యాక్టరీ వద్ద వీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న యాదవ బంధువుల ఆత్మీయ కలయికలో పెద్ద ఎత్తున యాదవ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని గొలగాని శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. పాత రాజరాజేశ్వరిపేటలోని యాదవ భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లాది శివ యాదవ్, తురాల ప్రసాద్‌యాదవ్, కర్రి బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.



రవన్న ఆశయ సాధనకు కృషి

భారతీనగర్, మార్చి 9 : రాయల సుభాష్ చంద్ర బోస్ (రవన్న) ఆశయాల సాధనకు కృషి చేయాలని వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.పోలారి పిలుపునిచ్చారు. క్రీస్తురాజపురంలోని రామనర్సయ్య భవన్‌లో శనివారం రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతి సభ జరిగింది. రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలారి మాట్లాడుతూ ఐదు దశాబ్దాల అజ్ఞాత విప్లవ జీవితంలో పార్టీ అభివృద్ధికి రవన్న విశేష కృషి చేశారన్నారు. నగర కార్యదర్శి ఎ.రవిచంద్ర, పీవోడబ్ల్యూ నాయకులు పి.పద్మ, కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కె.మానస

మొబైల్ వ్యసనంతో చిన్నపిల్లల ఎదుగుదలకు ఆటంకం

పటమట, మార్చి 9 : మొబైల్ వ్యసనం వల్ల చిన్న పిల్లల్లో మానసిక, శారీరక, ఎదుగదల దెబ్బతింటుందని ప్రముఖ చిన్నపిల్లల మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ కె.మానస అన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో 'డిజిటల్ యుగంలో చిన్నారులు' అంశంపై ఆమె ప్రసంగించారు. ఆరు నెలలు వయస్సులోనే మొబైల్ చూడటానికి చిన్నారులు అలవాటు పడుతున్నారన్నారు. పిల్లల్లో మొబైల్ వ్యసనం ఏర్పడటానికి తల్లిదండ్రులే ప్రధాన కారణమన్నారు. పిల్లలతో తల్లిదండ్రులు అధిక సమయం ప్రేమగా మాట్లాడాలని, బయటకు తీసుకెళ్లాల ని, ప్రేమను పంచాలని, మంచి మాటలు చెప్పాలన్నారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ముగ్గురికి గాయాలు

విద్యాధరపురం : గొల్లపూడి వై జంక్షన్ వద్ద శనివారం టిప్పర్ ఢీకొని అనంతవరానికి చెందిన పాటి బండ్ల మానస, తల్లి కోటేశ్వరమ్మ, కోటేశ్వరమ్మ తోడికోడలు రజని గాయపడ్డారు. కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు నమోదు చేశారు.



ఆస్కార్ అవార్డు అందుకున్న గీత రచయిత చంద్రబోస్ శనివారం మంత్రి కొండా సురేఖతో కలసి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మంచి విజయం అందించారు



'భీమ' చిత్రాన్ని ఆదరించి ఇంత మంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇంత మంచి కథను నా దగ్గరకు తెచ్చి, సినిమాను అద్భుతంగా తీసిన దర్శకుడు హర్షకు కృతజ్ఞతలు' అన్నారు హీరో గోపీచంద్. తను నటించిన 'భీమ' ఇటీవల విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'సినిమాకు కావాల్సినదంతా సమకూర్చి ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించిన రాధామోహన్ గారికి, శ్రీధర్ గారికీ ధన్యవాదాలు. ఇంకా సినిమా చూడనివారు తప్పకుండా థియేటర్‌కు వెళ్లి చూడండి' అని కోరారు. గోపీచంద్‌తో 'పంతం' సినిమాతో ఏర్పడిన అనుబంధం అలాగే కొనసాగుతోందని నిర్మాత రాధామోహన్ చెప్పారు. ఎక్కడా రాజీపడకుండా తీశాం. సినిమా విజువల్స్, రిచ్‌నెస్ తెరపై కనిపిస్తాయి' అన్నారు రాధామోహన్. టీమ్ వర్క్‌కు నిదర్శనం ఈ విజయమని దర్శకుడు హర్ష చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ నటన ఇష్టం



గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన మహిళా దినోత్సవానికి నటి రాధిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం తరపున ఆమెకు 2024 విశిష్ట మహిళా ప్రతిభ పురస్కారాన్ని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ తెలుగులో అగ్ర హీరోలైన అక్కినేని నాగేశ్వరరావు, శోభన్‌బాబు, చిరంజీవితో ఎక్కువ సినిమాలలో నటించానని ఆమె తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను చూస్తూ ఉంటానని, ఆయన నటన చాలా బాగుంటుందని కితాబిచ్చారు.

యూత్‌ను ఆకట్టుకుంటుంది

శ్రీవిష్ణు



యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించే బెక్కెం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్, సుప్రజ్, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్ రెడ్డి దర్శకుడు. ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో శ్రీవిష్ణు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యే సినిమాలా అనిపిస్తోంది" అని అన్నారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది" అని అన్నారు. మరో నిర్మాత సృజన్ కుమార్ బొజ్జం మాట్లాడుతూ "కథను నమ్మి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా చేసిన సినిమా ఇది" అని అన్నారు. దర్శకుడు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ "కొత్త వాళ్లతో ఇలాంటి సినిమా తీయడం ఓ మిరాకిల్. మాకు ఈ టైటిల్ ఇచ్చి ఎంకరేజ్ చేస్తున్న నిర్మాత దిల్ రాజుకు రుణపడి వుంటాం" అని అన్నారు.

ఆ రెండు విషయాలపై క్లారిటీగా ఉన్నాం



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ కాంబినేషన్‌లో రూపొందిన 'వెయ్ దరువెయ్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత దేవరాజ్ పోతూరు మీడియాతో మాట్లాడుతూ 'మా బేనర్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. దర్శకుడు నవీన్ రెడ్డి చెప్పిన కథ నచ్చింది. రెండు విషయాలపై క్లారిటీగా ఉండాలని ముందే అనుకున్నాం. అవేమిటంటే 35 రోజుల్లో సినిమాను పూర్తి చేయడం, యూనిట్ అంతా అనుకున్న సమయానికి సెట్‌లో ఉండేలా చూడడం. అలా ఓ పద్ధతి ప్రకారం షూటింగ్ పూర్తి చేశాం. దీని వల్ల నిర్మాణ వ్యయం తగ్గింది.' అన్నారు.

వినోదం పంచే పెళ్లినాటి సిత్రాలు



లక్ష్మణ్, భ్రమరాంబిక, కిశోరీ దాత్రక్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'సీతారాం సిత్రాలు'. డి. నాగశశిధర్‌రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పార్థసారథి, డి. నాగేందర్‌రెడ్డి, కృష్ణ చంద్ర విజయభట్టు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్ ట్రైలర్‌ను దర్శకుడు మారుతి విడుదల చేశారు. 'సీతారాం చిత్రాలు టైటిల్, ట్రైలర్ బాగున్నాయి' అని ఆయన యూనిట్‌ను అభినందించారు. పాత రోజుల్లో పెళ్లి వీసీఆర్ క్యాసెట్ నేపథ్యంలో సాగే కథతో వినోదాత్మకంగా తెరకెక్కించినట్లు దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రుద్రకిరణ్. సినిమాటోగ్రఫీ: అరుణ్‌కుమార్.

థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో



అర్జున్ అంబటి, చైతన్యరావు హీరోలుగా నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'. కిశోరి దాత్రక్ హీరోయిన్. రవిశంకర్ ప్రధాన పాత్ర పోషించారు. సతీశ్ రాపోలు దర్శకత్వంలో నీరుకంటి మంజుల రాఘవేందర్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో అల్లరి నరేశ్ విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు నిర్మాత చెప్పారు. సంగీతం: పి. ఆర్, సినిమాటోగ్రఫీ: శేఖర్ పోచంపల్లి





దిక్సూచి
DIKSUCHI

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

టీఎస్ ఐసెట్

అర్హత: ఎంబీఏలో ప్రవేశానికి ద్వితీయశ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీబీఏ/బీబీఎం/బీసీఏ/బీఈ/బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంసీఏలో ప్రవేశానికి మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసి ఉండాలి.

టీఎస్ ఐసెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. మొత్తం మార్కులు 200. ఈ పరీక్షలో మూడు సెక్షన్‌లు ఉంటాయి. అనలిటికల్ ఎబిలిటీ సెక్షన్‌లో డేటా సఫిషియెన్సీ నుంచి 20 ప్రశ్నలు, ప్రాబ్లం సాల్వింగ్ (సిరీస్, డేటా అనాలిసిస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేట్, టైం, అరేంజ్‌మెంట్) అంశాల నుంచి 55 ప్రశ్నలు; మేథమెటిక్ ఎబిలిటీ సెక్షన్‌లో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35, ఆల్జీబ్రిక్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 30, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. కమ్యూనికేషన్ ఎబిలిటీ సెక్షన్‌లో మీనింగ్స్, సినోనిమ్స్-ఆంటోనిమ్స్, వర్బ్(టెన్స్-వాయిస్), ఫ్రేజల్ వర్బ్-ఇడియమ్స్, ఆర్టికల్స్-ప్రిపోజిషన్స్, కంప్యూటర్ టర్మినాలజీ, బిజినెస్ టర్మినాలజీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు, కాంప్రహెన్షన్ నుంచి 15 ప్రశ్నలు అడుగుతారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **టీఎస్ ఐసెట్ తేదీలు:** జూన్ 4, 5
- **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZzelUfKలో చదవండి.

నిట్ వరంగల్‌లో పీజీ, పీహెచ్‌డీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ వరంగల్)- ఎంబీఏ, ఎంటెక్(సెల్ఫ్ ఫైనాన్స్), పీహెచ్‌డీ జూలై సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఆసక్తి గల అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

- *వెబ్‌సైట్: www.nitw.ac.in*



ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 77 సీట్లు ఉన్నాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16

పీహెచ్‌డీ

ఫుల్ టైం, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. మొత్తం 13 కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు.

విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 3

ఎంటెక్(సెల్ఫ్ ఫైనాన్స్)

ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు:

- **సివిల్ ఇంజనీరింగ్:** ఇంజనీరింగ్ స్ట్రక్చర్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మాటిక్స్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, స్మార్ట్ ఎలక్ట్రిక్ గ్రిడ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ & కెమికల్ ఇంజనీరింగ్ (జాయింట్ కోర్సు):** కంట్రోల్ అండ్ ఆటోమేషన్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫాక్చరింగ్, మెషిన్ డిజైన్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** ఎంబెడెడ్ అండ్ మెషిన్ లెర్నింగ్ సిస్టమ్, వీఎల్ఎస్ఐ సిస్టమ్స్ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్
- **మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్:** మెటీరియల్స్ టెక్నాలజీ, వెల్డింగ్ టెక్నాలజీ అండ్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్
- **కెమికల్ ఇంజనీరింగ్:** కెమికల్ ఇంజనీరింగ్, సస్టయినబుల్ ఎనర్జీ జెనరేషన్ అండ్ స్టోరేజ్ టెక్నాలజీస్
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ
- బయోటెక్నాలజీ

దరఖాస్తు ఫీజు: రూ.1600


ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

యోగాలో ఫౌండేషన్ కోర్సు

భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఎండీఎన్ఐవై)- ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగా సైన్స్ ఫర్ వెల్‌నెస్(ఎఫ్‌సీవైఎస్‌డబ్ల్యూ)'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సు వ్యవధి రెండు నెలలు. ఇది వీకెండ్ కోర్సు. దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఏప్రిల్ 6 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి. వారాంతాల్లో ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. కనీసం పదిహేనేళ్లు నిండిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

- **కోర్సు ఫీజు:** రూ.2,500
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.250
- **సర్టిఫికేషన్ ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

బిట్స్ పిలానీలో హయ్యర్ డిగ్రీ



పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- హయ్యర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. హైదరాబాద్, గోవా, పిలానీ క్యాంపస్‌లలో ఎంఈ ప్రోగ్రామ్‌లు; గోవా మినహా అన్ని క్యాంపస్‌లలో ఎంఫార్మసీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌ను అనుసరించి గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. ఈ రెండు కేటగిరీలవారికి సమానంగా సీట్లు కేటాయించారు. రెంటికీ కటాఫ్ స్కోర్ వివరాలను అడ్మిషన్ కమిటీ ప్రకటిస్తుంది.

ఎంఈ విభాగాలు: బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్), కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డిజైన్ ఇంజనీరింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్

ఎంఫార్మసీ విభాగాలు: ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మకాలజీ

అర్హత వివరాలు: ఎంఈ, ఎంఫార్మసీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్/ఫార్మసీ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ఆఫ్ బిట్స్ లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంపిక: ఎంఈ(సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ మినహా), ఎంఫార్మసీ సీట్లను బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ లేదా గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా భర్తీ చేస్తారు. గేట్ 2024/2023/2022, జీప్యాట్ 2024/2023/2022 స్కోర్లను పరిగణనలోకి తీసుకొంటారు. ఎంఈ(సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్) సీట్లను పూర్తిగా బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ఆధారంగా భర్తీ చేస్తారు.

బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు టెస్ట్‌లు ఉంటాయి. మొదటి టెస్ట్‌ను అభ్యర్థులందరూ తప్పనిసరిగా రాయాలి. రెండో టెస్ట్ అభ్యర్థి ఎంచుకున్న స్ట్రీమ్ మేరకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

మొదటి టెస్ట్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో మొత్తం 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్ మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్కిల్స్ అండ్ రీజనింగ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు అడుగుతారు.

రెండో టెస్ట్: పరీక్ష సమయం 105 నిమిషాలు. ఇందులో మొత్తం 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంఈ (సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్), ఎంఈ(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లకు నిర్వహించే ఎగ్జామ్‌లో 50 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట. విభాగాలకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.13,400లు చొప్పున ట్యూషన్ ఫీజులో రాయితీ ఇస్తారు. బిట్స్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు నెలకు రూ.13,400ల స్టయిపెండ్ ఇస్తారు. అభ్యర్థులందరూ వారానికి ఎనిమిది నుంచి పది గంటలసేపు అకడమిక్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ రాసేవారికి రూ.3,400, గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 19
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.bitsadmission.com/hd





అలనాటి కథ

బాలాసింగ్.. ఓ జ్ఞాపకం

'బంగారం ఉంటే చాలదు.. దానిని రక్షించుకోవటానికి కత్తి పట్టడం కూడా రావాలి'- ఇది రాజనీతి. మా చిన్నప్పుడు - రాజవంశాలకు చెందిన పిల్లలందరికీ- ఆడమగ తేడా లేకుండా ఆత్మరక్షణ విద్యలు నేర్పించేవారు. అందమైన మా ప్యాలెస్‌లలో అనేక ప్రమాదాలు పొంచి ఉండేవి. శత్రువులు చేసే విష ప్రయోగాలు.. వ్యూహాలు.. ప్రతి వ్యూహాలు... నా చిన్నతనంలో ఇలాంటివెన్నో చూశాను. హఠాత్తుగా ఎదురయ్యే ప్రమాదాల నుంచి నన్ను రక్షించటానికి బాలాసింగ్ అనే బాడీగార్డ్ ఎప్పుడూ నా వెంటే ఉండేవాడు.



నా చిన్నతనంలో మమ్మల్ని పెంచటానికి యూరోపియన్ గవర్నెస్‌లు ఉండేవారు. ప్రతి రాజ కుటుంబంలోనూ పిల్లల పెంపకానికి వీరు తప్పనిసరిగా ఉండేవారు. పిల్లలకు యూరోపియన్ మేనర్స్ నేర్పించటం.. వారికి పాశ్చాత్య సంస్కృతి సంప్రదాయాలు తెలియచెప్పటం వీరి బాధ్యత. ఇక్కడ ఒక విషయం తప్పనిసరిగా చెప్పాలి... వీరు అందరూ అనుకొనే మాదిరి ఆయాలు కాదు. ఉన్నత బ్రిటిష్ ఉద్యోగులు, రెసిడెంట్స్, వైస్రాయ్ మొదలైనవారి దగ్గరి బంధువులే! ఇంగ్లాండ్ సమాజంలో ఉన్నతులే! అందువల్ల వీరిని కూడా అందరూ ఆదరంగా చూసేవారు. నాకు కేథరిన్ అనే గవర్నెస్ ఉండేది. ఆమే నాకు ఎవరైనా కనిపించినప్పుడు గుడ్ మార్నింగ్, గుడ్ నైట్ చెప్పటం, షేక్‌హ్యాండ్ ఇవ్వటం, ప్యాలెస్‌లోని ఫ్లవర్‌వాజ్‌లలో పూలు సర్దడం మొదలైనవి నేర్పించింది. ఇతర రాజకుటుంబీలను... బ్రిటిష్ ఉన్నతోద్యోగులను కలిసినప్పుడు... తను కూడా నా వెంటే వచ్చేది. ఖాళీ సమయాల్లో చిన్న చిన్న ఎంబ్రైడరీ పనులు చేసేది. ఈమెతో పాటుగా నన్ను ఎప్పుడూ వెంట పెట్టుకొని ఉండే- నా బాడీగార్డ్ బాలా సింగ్ గురించి కూడా తప్పనిసరిగా చెప్పాలి.

నాకు రెండు, మూడేళ్ల వయస్సు ఉన్నప్పటి నుంచే బాలాసింగ్ నాకు బాడీగార్డ్. అందుకే నా చిన్నప్పటి ఫొటోలలో కూడా తను నా వెనకే నిలబడి ఉంటాడు. ఆరున్నర అడుగుల పొడవు..తీక్షణమైన చూపులు.. బంద్‌గాలా.. తలపాగలతో బాలాసింగ్ రాజసం ఉట్టిపడుతూ ఉండేవాడు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి నిద్రపోయే దాకా నన్ను, మా చెల్లిని, ఇద్దరు తమ్ముళ్లను రక్షించటం.. మాకు యుద్ధ విద్యలు నేర్పించటం తన విధి. మేము బయటకు వెళ్తే- కారు ముందు సీటులో తను కూర్చునేవాడు. ఉదయం మాకు పాఠాలు చెప్పటానికి మాస్టార్లు వచ్చేవారు. సాయంత్రం బాలాసింగ్ మా చేత చెక్క కత్తులతో ప్రాక్టీసు చేయించేవాడు. షూటింగ్‌లో మాకు ఓనమాలు నేర్పింది బాలాసింగే! పిల్లలందరిలోనూ నాకే షూటింగ్ బాగా వచ్చేది. గురి తప్పకుండా కాల్చేదాన్ని. వీటన్నింటితో పాటుగా కనిపించని శత్రువులను ఎదుర్కొనటానికి రకరకాల శిక్షణలు ఇచ్చేవాడు. ధ్యానంలో కూర్చుని మా చుట్టు పక్కల పరిసరాలలో ఏం జరుగుతోందనే విషయాన్ని గమనించగలిగిన ఏకాగ్రతను అలవరుచుకొన్నా.

బాలాసింగ్ మరొక ప్రధానమైన బాధ్యత మమ్మల్ని విషప్రయోగాల నుంచి కాపాడటం. ఇప్పుడు చాలా మందికి తెలియదు కానీ.. ఒకప్పుడు రాజకుటుంబీకులపై విషప్రయోగాలు జరిగేవి. వీటి నుంచి రక్షించటానికి మాకు ప్రత్యేకమైన ప్లేట్లను తయారు చేయించారు. ఏ మాత్రం విషాహారం తగిలినా- ఆ ప్లేట్ల రంగు మారిపోయేది. మా నాన్నగారు ధన్‌రాజ్‌గిర్‌పై జరిగిన ఒక విష ప్రయోగం నాకు ఇప్పటికీ గుర్తుంది. నాన్నగారు తాగే నీటిలో కొందరు శత్రువులు విషం కలిపారు. హఠాత్తుగా నాన్నకు ఎగశ్వాస, విపరీతమైన చెమటలు పట్టడం మొదలయ్యాయి. వెంటనే డాక్టర్లు వచ్చారు. వారికి విషప్రయోగం జరిగిందని అర్థమయిపోయింది. ఆ విష ప్రయోగానికి విరుగుడు షాంపైన్ అని డాక్టర్లు తేల్చి చెప్పారు. వెండి గిన్నెలో షాంపైన్ పోసి దానిని పట్టిస్తే- విష ప్రభావం తగ్గిపోతుందని చెప్పారు. వెంటనే నాన్న చేత షాంపైన్ తాగించారు. ఈ లోపులో ఈ విషయం హైదరాబాద్ అంతా పాకిపోయింది. అందరూ ప్యాలెస్ దగ్గరకు రావటం మొదలుపెట్టారు. నాన్న ప్రమాదం నుంచి బయటపడ్డారని తెలిసిన వెంటనే ప్యాలెస్ అంతా దీపాలు వెలిగించారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. నాన్న గౌరవార్థం సైనికులు గాలిలోకి కాల్పులు జరిపారు.

బాలాసింగ్ నాకు బాడీగార్డ్ మాత్రమే కాదు. కొన్ని విషయాలలో మార్గదర్శి కూడా. బాలాసింగ్‌కు మా ప్యాలెస్‌లో దాగి ఉన్న రహస్యాలెన్నో తెలుసు. ధ్యాన్‌బాగ్ ఆవరణలో మా పూర్వీకులు నిర్మించిన ఒక గుడి ఉంది. దీనిని మఠ్ అనే వాళ్లం. ఆ మఠ్‌లో అనేక రహస్యాలు ఉండేవని... దాని లోపల దాగి ఉన్న అపారమైన సందపను ఒక శ్వేతనాగు కాపాడుతూ ఉంటుందని నమ్మకం. నేను ప్యాలెస్ నుంచి మఠ్‌కు వెళ్తూ ఉండేదాన్ని. ఒక రోజు మఠ్ దగ్గరకు వెళ్లినప్పుడు- "మేమ్ సాబ్.. మీరు మౌనంగా ధ్యానం చేయండి.." అన్నాడు. నేను ధ్యానం చేయటం మొదలుపెట్టా. కళ్ల ముందు ఒక శ్వేతనాగు కనిపించింది. ఆ తర్వాత అప్పుడప్పుడు నాకు కలలో ఆ శ్వేత నాగు కనిపించేది. నాన్న మరణించిన తర్వాత మళ్లీ ఆ శ్వేతనాగు ఎప్పుడూ కలలోకి రాలేదు. కానీ ఆ శ్వేతనాగు ఆకారం ఇప్పటికీ నా కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. బాలాసింగ్ కుటుంబం నాలుగు తరాల పాటు మాతోనే ఉంది. మా కుటుంబ చరిత్రలో వీరందరూ ఒక విడదీయరాని భాగం. చరిత్రలో వీరి గురించి ప్రత్యేక అధ్యాయాలు ఉండకపోవచ్చు.. కానీ మా మనస్సుల్లో మాత్రం ఎప్పటికీ ఉండిపోయారు.

(పూణే ప్యాలెస్‌లో మస్నద్ మీద నేను. నా వెనుక బాలాసింగ్)

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



గాయని సునీత గురించి తెలుగు వారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గాయనిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, టెలివిజన్ షో హోస్ట్‌గా ఆమె బహుముఖ ప్రజ్ఞ కనబరిచారు. దాదాపు ఐదు సంవత్సరాల విరామం తర్వాత ఆమె మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చి ఒక లైవ్‌షో చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'నవ్య'కు ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ విశేషాలోకి వెళ్తే...

చేతిలో ఫోన్ ఉన్నవారందరూ హీరోలే..

చాలా కాలం తర్వాత కచేరీ చేస్తున్నట్లున్నారు..!

అవునండి. 2019లో శిల్పకళావేదికలో నా కచేరీ జరిగింది. బాలుగారు మధ్యలో హఠాత్తుగా స్టేజీ మీదకు రావటం, అందరూ షోను ఆస్వాదించడం... ఇలా ఆ జ్ఞాపకాలన్నీ ఇంకా పదిలంగా ఉన్నాయి. మళ్లీ చాలా కాలం తర్వాత ప్రేక్షకుల ముందుకు రాబోతున్నా. ఈ నెల 22న అదే శిల్పకళావేదికలో షో చేస్తున్నా. దీని కోసం బాగా ప్రాక్టీసు చేస్తున్నా. టెన్షన్‌గా కూడా ఉంది.

అప్పటికీ, ఇప్పటికీ మార్పులేమైనా వచ్చాయా?

అప్పుడు పూర్తిగా పాట పాడేవాళ్లం. ఇప్పుడు షోలలో మిడ్లీ రోజులు వచ్చేశాయి. షోల దాకా ఎందుకూ... సినిమాల్లో కూడా ఒక పల్లవి, ఒక చరణం మాత్రమే ఉండే రోజులు వచ్చేశాయి.

ఇప్పుడు అందరి జీవితాల్లోనూ సోషల్ మీడియా ఒక ప్రధానమైన పాత్ర వహిస్తోంది. దీనివల్ల మన జీవితాల్లో ఏవైనా మార్పులు వచ్చాయా?

నాకు అవసరమా? అనవసరమా? అనే విషయాన్ని ఆలోచించకుండా ఒకప్పుడు నేను సోషల్ మీడియాలోకి అడుగుపెట్టా. నా అకౌంట్‌కు ఉన్న లైక్‌ల కౌంట్ నామీద ఎలాంటి ప్రభావం చూపించదు. అయితే ఏదైనా ఒక విషయానికి సంబంధించి నిజాలు చెప్పాల్సి వచ్చినా, ఏదైనా అబద్ధం ప్రచారంలోకి వస్తున్నప్పుడు అది నిజం కాదని చెప్పాల్సి వచ్చినా సోషల్ మీడియా ఒక వేదికగా మారింది.ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియా తప్పనిసరి.

> **అందరూ పాడవచ్చు. కానీ ఎక్కడ పాడుతున్నారనేది ముఖ్యం. రికార్డింగ్ స్టూడియోలో అందరూ పాడలేరు. అందుకే కొద్ది మంది మాత్రమే ప్లేబ్యాక్ సింగర్స్ అవుతారు. సోషల్ మీడియాకు సంబంధించి నేను కొన్ని పరిధులు ఏర్పరుచుకున్నాను. నేను హోం టూర్లు చేయను. నా ఫ్రిజ్‌లో ఏముందో, బ్యాగ్‌లో ఏముందో చూపించను. నాకు లక్షల మంది ఫాలోవర్స్ ఉండకపోవచ్చు. కానీ నన్ను అభిమానించేవారు మాత్రం నా గురించి తెలుసుకోవాలనుకుంటూ ఉంటారు. వారితో కమ్యూనికేట్ చేస్తూనే ఉంటా.**

యంగ్ టాలెంట్‌కు ఇదొక వేదిక అంటున్నారు..?

తమ టాలెంట్‌ను ప్రపంచానికి చూపించాలనుకొనే వారికి ఇది వేదిక అనటంలో సందేహంలేదు. ఫ్యాన్ బేస్ కూడా పెరుగుతుంది. అయితే అక్కడ ఎవరి టార్గెట్ వాళ్లది. ఉదాహరణకు నేను ఒక పాట పాడి పెట్టాననుకోండి... నేను అవకాశాల కోసం ఆ పాటను పెట్టడంలేదు. అందరూ చూసి ఆనందించాలనేది నా టార్గెట్. ఇంకొకరి టార్గెట్ వేరేగా ఉండవచ్చు.

సోషల్ మీడియాలో మంచి ఎక్కువా? చెడు ఎక్కువా?

సోషల్ మీడియా ఇంత చొచ్చుకు రాని సమయంలో- టాలెంట్ మీదే ఎక్కువగా ఫోకస్ ఉండేది. ఇప్పుడు వ్యక్తుల పట్ల ఆసక్తి బాగా పెరిగిపోయింది. నేను 2011 నుంచి సోషల్ మీడియాలో ఉన్నా. అప్పటి నుంచి వస్తున్న మార్పులన్నింటినీ గమనిస్తూనే ఉన్నా. ఈ మధ్యకాలంలో అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు వచ్చేసాయి. ఫ్రీ వైఫై చాలా చోట్ల అందుబాటులోకి వచ్చేసింది. దాంతో చేతిలో ఫోన్ ఉన్నవారందరూ హీరోలే కదా! నా ఉద్దేశంలో సోషల్ మీడియాలో మంచి ఉంది, చెడూ ఉంది. మనకు ఏదైనా చెప్పాలనిపించినప్పుడు దీనిని ఉపయోగించుకుంటే కోట్ల మందికి ఒకేసారి వెళ్లిపోతుంది. మీకో సంఘటన చెబుతాను. నేను "మా తోటలో మామిడి కాయ కాసింది" అని పెడితే- "సునీత తల్లి కాబోతోంది" అని రాసేశారు. నేను మళ్లీ అదే వేదిక మీదకు వెళ్లి "నాయనలారా.. నన్ను అర్థం చేసుకోండి" అని అడిగా.

> **నా పిల్లలు నేను పాడితే తప్ప పడుకొనేవారు కాదు. అంత అదృష్టం ఎంత మంది అమ్మలకు లభిస్తుంది? ఇప్పటికీ మా అమ్మ 'నగుమోము... ఒక్కసారిపాడవే' అంటుంది. ఆ విధంగా చూస్తే నేను ఎంతో అదృష్టవంతురాలిని.**

అయితే మీరూ సోషల్ విక్టిమే అనుకుంటా...

అవును.. కానీ ఎవరినైనా బోనులో వేసి కొడుతున్నప్పుడు- కొద్దికాలానికి ఆ దెబ్బల బాధ తెలియదు. 'నన్ను ట్రోల్ చేసేవాళ్లు, విమర్శించే వారు నా జీవితాన్ని డిసైడ్ చేసేవాళ్లు కాదు' అనే విషయాన్ని నమ్మటం మొదలుపెట్టాక ప్రశాంతత వచ్చింది. నా సొంత మనుషులకు నేను ఏం చేస్తున్నానో తెలుసు. అలాంటప్పుడు ఎవరికో నేనెందుకు సమాధానాలు ఇవ్వాలి? ఈ ఆలోచనల వల్ల చాలా మార్పు వచ్చింది. ఆ తర్వాత నా గురించి మంచిగా రాయటం మొదలు పెట్టారు.



కొందరు గాయకులు కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు హఠాత్తుగా మాయమవుతారు. కారణం?

మార్పు సహజంగానే వస్తుంది. కానీ ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. ఫీమేల్ సింగర్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. మహిళల శరీరంలో ఈస్ట్రోజిన్ అనే హార్మోన్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది. 40ల తర్వాత గాయనీమణుల శరీరంలో మార్పులు వస్తాయి. ఆ ప్రభావం గొంతుపై కూడా పడుతుంది. గొంతు డ్రై అయిపోతుంది. చిన్నప్పటి నుంచి సాధన ఉండి, ఆత్మవిశ్వాసం ఉన్న సింగర్స్ మరో పదేళ్లపాటు పాడగలుగుతారు. ఈ విషయాన్ని అంగీకరించి, ప్రతికూల ఆలోచనలను దరిచేరనివ్వకపోతే సమస్యలు ఎదురుకావు. పాడటం అనేది దేవుడు కొందరికి మాత్రమే ఇచ్చిన వరం. కొన్ని కోట్ల మందిని ప్రభావితం చేసే శక్తి పాటకు ఉంటుంది. అందువల్ల దానిని సమాజహితానికి వాడుకుంటే మంచిది.

> **రామారావుగారి చివరి రోజుల్లో లక్ష్మీపార్వతి గారు రాసిన కొన్ని పాటలను రికార్డింగ్ చేయించాలనుకున్నారు. అప్పుడు నేను ప్రాక్టీస్ కోసం వాళ్లింటికి వెళ్లేదాన్ని. ఒక రోజు ఆయన నేను పాడుతుంటే విన్నారు. నన్ను పిలిచి "నీ గొంతు సుశీలగారి గొంతులా తియ్యగా, సన్నగా ఉంది. వారు మాకు అత్యంత ముఖ్యులు" అన్నారు. అదొక మరిచిపోలేని ప్రశంస. అన్నమయ్యలో 'చాలు.. చాలు...' పాట విని ఒక రోజు ఏఎన్నార్ గారు ఫోన్ చేశారు. 'ఎంత బాగా పాడవమ్మా. స్నేహ ఆ పాటకు తగ్గట్టుగా యాక్ట్ చేస్తే చాలు. పాట విని పిక్చరైజేషన్ ఊహించుకోగలిగామంటే దాన్ని పాడిన వారు గొప్ప ప్లేబ్యాక్ సింగర్ అని అర్థం' అన్నారు. ఆ మాటలకు ఆ రోజు బాగా ఎమోషనల్ అయిపోయా!**

మీరు అలాంటి కార్యక్రమాలేవైనా చేస్తూ ఉంటారా?

నేను చేసే కార్యక్రమాల గురించి చెప్పటం నాకు ఇష్టం ఉండదు. అయినా మీరు అడిగారు కాబట్టి చెబుతున్నా.. చివరి దశలో ఉన్న క్యాన్సర్ పేషెంట్లకు మందులు పనిచేయవు. అలాంటి వారి దగ్గరకు వెళ్లి పాటలు పాడుతుంటా. దానివల్ల వారికి స్వాంతన లభిస్తుంది. నాకు మానసికంగా తృప్తిగా అనిపిస్తుంది.

ఇప్పటి తరం గాయనీ గాయకులపై మీ అభిప్రాయమేమిటి?

కొందరిలో తపన, టాలెంట్ ఉన్నాయి. కానీ ఓపిక లేదు. సరైన మార్గదర్శకత్వం అందించే వారు లేదు. ఇక్కడ ఎవరి జర్నీ వారిది. నాకు పాడటం వెనకున్న టెక్నిక్స్ తెలుసుకోవటానికి పదేళ్లు పట్టింది. 28 ఏళ్ల తర్వాత కూడా నేర్చుకుంటూనే ఉన్నా. అందువల్ల ఓపికగా ఉంటే అవకాశాలు లభిస్తాయి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

> **నా జీవితానికి ఒక పరమార్థం ఉంది. దాన్ని కోసమే నేను అన్వేషిస్తున్నా. నాకు ఆధ్యాత్మికత అంటే ఏమిటో తెలియదు. కానీ ఇప్పటికైతే నేను ఒక వ్యక్తిగా సంపూర్ణత్వాన్ని సాధించానని అనుకోవటం లేదు.**



> **నేను ప్రస్తుత తరంతో పోటీ పడటం లేదు. ఎందుకంటే నా విలువ నాకు బాగా తెలుసు. ఇప్పటిదాకా నేను ఏ ఒక్కరి దగ్గరకు వెళ్లి అవకాశం ఇవ్వమని అడగలేదు. అందరూ నన్ను పిలిపించి పాడించుకున్నవారే!**

> **మాటలో, ఉచ్చారణలో స్పష్టత తప్పనిసరిగా ఉండాలి. అలా పాడటం గాయకుల బాధ్యత. కొన్నిసార్లు తప్పు జరిగే అవకాశం ఉంటుంది. నా ఉద్దేశంలో పాటను వింటూ కాగితంపై రాసుకోగలగాలి. అంతే తప్ప గూగుల్‌కు వెళ్లి లిరిక్స్ కోసం వెతికే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయంలో మనకన్నా తమిళం, కన్నడం వాళ్లు చాలా కచ్చితంగా ఉంటారు. నేను కన్నడంలో చాలా పాటలు పాడాను. అక్కడ రికార్డింగ్ సమయంలో పక్కనే కూర్చుని ఉచ్చారణ స్పష్టంగా ఉండేలా పాడించుకుంటారు.**



> **నా ఉద్దేశంలో ఒక గాయనికి మృదుత్వం ఉండాలి. లాలన, పాలన ఆమె వ్యక్తిత్వమై ఉండాలి. భావాన్ని అనుభవించి పాడితేనే మృదుత్వం వస్తుంది. ఒక వ్యక్తి తాలూకు వ్యక్తిత్వ ప్రభావం పాట మీద కూడా ఉంటుంది.**

> **రమ్య బెహరా చాలా మంచి సింగర్. చాలా బాగా పాడుతుంది. మంచి టాలెంటెడ్. సాహితీ చాగంటి, హరిణి కూడా బాగా పాడతారు. అనురాగ్ కులకర్ణి చాలా బాగా పాడుతున్నాడు.**



సెలబ్ ఫిట్

ఖుషీ ఖుషీగా..

కరీనా... కత్రినా రోజులు పోయాయి. అనుష్కా... దీపికను దాటి సారా... సుహానా తరం మెరుపులు మొదలయ్యాయి. అలా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన మరో నటి... శ్రీదేవి వారసురాలు... ఖుషీ కపూర్. చూడచక్కని ఫిజిక్... ఇన్‌స్టా రీల్స్‌తో... సినిమాల్లోకి రాకముందే కుర్రకారు మనసు దోచుకుంది.



శ్రీదేవి, బోనీకపూర్ పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ ఇప్పటికే వరుస చిత్రాలతో బిజీ అయిపోయింది. గత ఏడాది చివర్లో రెండో కూతురు ఖుషీ కపూర్ కూడా తెర మీదకు వచ్చింది. జోయా అక్తర్ దర్శకత్వంలో విడుదలైన 'ది ఆర్చీస్'లో షారుక్ కూతురు సుహానాతో కలిసి నటించింది. ఇద్దరికీ అదే తొలి చిత్రం. ప్రస్తుతం ఒక హిందీ సినిమా చేస్తోంది ఖుషీ. బోనీ కపూర్, శ్రీదేవి, అనిల్ కపూర్, సంజయ్ కపూర్, అర్జున్ కపూర్... ఆమెకున్న సినీ నేపథ్యానికి భారీ బడ్జెట్ చిత్రాలతో కెరీర్ మొదలు పెట్టవచ్చు. కానీ నటనకు అవకాశం గల పాత్రలైతే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నది ఖుషీ ఆలోచన. అందుకే వచ్చిన అవకాశాలన్నీ ఒప్పుకోవడంలేదు.

ముంబయిలోని 'ఎకోల్ మాండియల్ వరల్డ్ స్కూల్'లో చదివిన ఖుషీ... వేరే రంగంలో కెరీర్‌ను ఎప్పుడూ ఊహించుకోలేదు. కుటుంబమంతా పరిశ్రమకు చెందినవారే కావడంతో... ఆమె అడుగులు కూడా అటువైపే పడ్డాయి. ఆ దారిలోనే అమెరికా వెళ్లి 'న్యూయార్క్ ఫిలిమ్ అకాడమీ'లో ఏడాదిపాటు నటనలో శిక్షణ తీసుకుంది. తిరిగి వచ్చాక 'స్నీక్ అప్' అనే షార్ట్ ఫిలిమ్‌లో నటించింది ఆమె. అయితే ఈ మధ్యలో ఇన్‌స్టా రీల్స్‌తో, తన లేటెస్ట్ ఫొటోషూట్స్‌తో సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులను సంపాదించుకుంది. ఇన్‌స్టాలో దాదాపు పదిహేను లక్షలమంది ఆమెను ఫాలో అవుతున్నారు. తన ఆహార నియమాలు, వ్యాయామాల చిత్రాలు, వీడియోలను పోస్ట్ చేస్తూ... అభిమానులను ఆ దిశగా ప్రోత్సహిస్తోంది. ఇవికాకుండా పలు బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తున్న ఖుషీ... పేరుకు తగ్గట్టుగానే ఎప్పుడూ సంతోషంగా, ఉత్సాహంగా కనిపిస్తుంది.

వర్కవుట్ ఇలా...

ఖుషీ కపూర్ వర్కవుట్స్‌లో పిలెట్స్ నుంచి ఫుల్‌బాడీ వర్కవుట్స్ వరకు అన్నీ ఉంటాయి.

- ఉదయం ట్రెడ్‌మిల్‌పై జాగింగ్, రన్నింగ్‌లతో కూడిన కార్డియో సెషన్.
- శరీరాన్ని అతిగా కష్టపెట్టకుండా, కావల్సిన ఫలితాలను ఇచ్చే వ్యాయామం పిలెట్స్. ఇది సులువుగా చేసుకోదగినది. కొన్నిసార్లు కార్డియోకు బదులుగా దీనిపైనే ఎక్కువ దృష్టి పెడుతుంది ఖుషీ కపూర్.
- వర్కవుట్‌కు ముందు, తరువాత మజిల్ స్ట్రెచింగ్. వ్యాయామాలకు ముందు స్ట్రెచింగ్ చేస్తే శరీరం వార్మప్ అవుతుంది. తరువాత చేస్తే శరీరం చల్లబడుతుంది. ముఖ్యంగా దీనివల్ల కండరాల పెళుసుదనం పోయి... వ్యాయామానికి అనుకూలంగా మారతాయి. పోశ్చర్ కూడా మెరుగవుతుంది.
- ఖుషీ ఫిట్‌నెస్ సెషన్స్‌లో రోజూ ఒకేరకమైన వ్యాయామాలు ఉండవు. బోర్ కొట్టకుండా బ్యాడ్మింటన్, టెన్నిస్‌లాంటి ఏదో ఒక ఆట దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలంటుంది ఖుషీ. ఆట సరదాతో పాటు మానసిక ఉల్లాసాన్నిస్తుందనేది ఆమె ట్రైనర్ మాట.
- వెయిట్స్, స్క్వాట్స్ సెషన్స్. కండరాలు దృఢంగా తయారవ్వడానికి, సామర్థ్యం పెరగడానికి ఇవి దోహదపడతాయి.
- ఫుల్ బాడీ వర్కవుట్. శరీరంలోని అన్ని భాగాలకూ వ్యాయామం లభిస్తుంది. దీనివల్ల శారీరక దృఢత్వంతో పాటు బ్యాలెన్స్, ఫ్లెక్సిబిలిటీ లాంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అన్నిటికీ మించి ఆరోగ్యకరమైన జీవనం సాగించడానికి క్రమంతప్పని వ్యాయామం సంజీవనిలా పని చేస్తుంది.

ఇదీ మెనూ...

ఖుషీ మెనూ పుష్కలంగా విటమిన్లు, పోషకాలు, పీచుపదార్థాలతో ఆరోగ్యకరమైన, సమతుల ఆహారం ఉంటుంది.

- ఉదయం తాజా పండ్లు, ఎగ్‌వైట్, ఓట్స్
- మధ్యాహ్నం భోజనంలో వెజిటబుల్ సలాడ్, చికెన్‌తో బ్రౌన్‌రైస్, పప్పు. లేదంటే శాండ్‌విచ్.
- రాత్రి డిన్నర్‌లో కూడా దాదాపు లంచ్ తరహా ఆహారమే ఉంటుంది.
- పంచదారతో తయారు చేసిన వంటలు, ద్రావకాలు, జంక్‌ఫుడ్స్‌కు దూరం
- రోజంతా శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి పుష్కలంగా నీళ్లు తాగుతుంది.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5uUzG06 లో చదవండి.

యువహో.. జయహో

ఇన్నింగ్స్ 64 రన్స్‌తో భారత్ విజయం

- 4-1తో సిరీస్ కైవసం
- అశ్విన్‌కు ఐదు వికెట్లు
- ఆఖరి టెస్టులో ఇంగ్లండ్ చిత్తు



బజ్‌బాల్ గేమ్‌తో ఇంగ్లండ్ జట్టు ప్రపంచ క్రికెట్‌లో దూసుకెళ్తుండవచ్చు గాక.. కానీ భారత గడ్డపై వారి ఆటలు సాగవని యువ ఆటగాళ్లతో కూడిన టీమిండియా నిరూపించింది. స్టార్లు లేకపోయినా, ఏకంగా ఐదుగురు అరంగేట్రం చేసి.. ఇంగ్లండ్‌కు ఈ ఐదు టెస్టుల సిరీస్‌ను ఓ పీడకలగా మార్చారు. నాణ్యమైన స్పిన్నర్లను ఎదుర్కొనే క్రమంలో స్టోక్స్ సేన పసికూనలా తడబడింది. మూడో రోజు పూర్తిగా ఆడకుండానే రెండు సెషన్లకే చాప చుట్టేసింది. వందో టెస్టు ఆడిన అశ్విన్ మొత్తంగా 9 వికెట్లతో వహ్వా.. అనిపించాడు.

ధర్మశాల: ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు భారత జట్టు అదిరే ముగింపునిచ్చింది. ఆఖరి టెస్టులో కేవలం రెండున్నర రోజుల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించి ఇన్నింగ్స్ 64 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఐదు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన అశ్విన్.. మొత్తంగా 9 వికెట్లతో కెరీర్‌లో వందో టెస్టును చిరస్మరణీయం చేసుకున్నాడు. అలాగే జట్టు వరుసగా నాలుగు విజయాలతో సిరీస్‌ను 4-1తో దక్కించుకుంది. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో మాత్రమే ఇంగ్లండ్ నెగ్గింది. వారి బజ్‌బాల్ శకంలో సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి. మరోవైపు ఇంగ్లండ్ బౌలర్ జేమ్స్ అండర్సన్ 700 వికెట్ల మైలురాయిని చేరుకుని టెస్టుల్లో మురళీధరన్, షేన్‌వార్న్ తర్వాత అత్యధిక వికెట్లు సాధించిన మూడో ఆటగాడయ్యాడు. శనివారం మూడో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 477 పరుగుల వద్ద ముగించింది. తొలి సెషన్‌లో కేవలం నాలుగు పరుగులే జత చేసి కుల్దీప్ (30), బుమ్రా (20) అవుటయ్యారు. దీంతో జట్టుకు 259 పరుగుల ఆధిక్యం లభించింది. స్పిన్నర్ బషీర్‌కు ఐదు, అండర్సన్.. హార్ట్‌లీకి రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 195 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు ఇన్నింగ్స్ విజయం దక్కింది. రూట్ (84), బెయిర్‌స్టో (39) మాత్రమే రాణించారు. బుమ్రా, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా జైస్వాల్ నిలిచారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులు చేసింది. వెన్ను నొప్పి కారణంగా కెప్టెన్ రోహిత్ మూడో రోజు ఆటలో బరిలోకి దిగలేదు. దీంతో బుమ్రా బాధ్యతలు తీసుకున్నాడు.



అశ్విన్ ఆరంభం నుంచే..: మూడో రోజు ఆట ఆరంభమైన 20 నిమిషాల్లోనే భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. ఈ సంతోషంతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లండ్ ఫ్లాట్ వికెట్‌పై చెలరేగుతుందేమో అనిపించింది. కానీ స్పిన్నర్లను ఎదుర్కోవడమే రాదన్నట్టుగా టపటపా వికెట్లను కోల్పోతూ పెవిలియన్ చేరారు. జో రూట్ మాత్రమే ఎదురొడ్డి నిలిచి ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. రెండో ఓవర్‌లోనే అశ్విన్ వికెట్ల పతనాన్ని ఆరంభించి టాపార్డర్ పనిబట్టాడు. డకెట్ (2), క్రాలే (0), పోప్ (19) వికెట్లను అశ్విన్ తీయగా.. బెయిర్‌స్టో ఉన్న కాసేపు ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. కానీ కుల్దీప్ అద్భుత బంతికి అతను ఎల్బీగా వెనుదిరిగాడు. స్టోక్స్ (2), అశ్విన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. దీంతో జట్టు తొలి సెషన్ ముగిసేసరికే 103/5తో దయనీయంగా కనిపించింది.

వికెట్లు టపటపా: భారత్ ఆధిక్యానికి 157 పరుగులు వెనుకబడిన దశలో రెండో సెషన్‌ను ఆరంభించిన ఇంగ్లండ్ వేగంగా మిగిలిన 5 వికెట్లను కోల్పోయింది. ఆరంభంలోనే ఫోక్స్(8)ను అవుట్ చేసిన అశ్విన్ తన ఐదు వికెట్లను పూర్తి చేశాడు. హార్ట్‌లీ (20), ఉడ్ (0)లను బుమ్రా వరుస ఓవర్లలో దెబ్బతీయడంతో జట్టు 141/8 స్కోరుతో నిలిచింది. ఈ దశలో రూట్‌కు బషీర్ (13) సహకారమందించగా తొమ్మిదో వికెట్‌కు 48 పరుగులు జత చేరాయి. కానీ బషీర్‌ను జడేజా, సెంచరీ దిశగా సాగుతున్న రూట్‌ను కుల్దీప్ స్వల్ప వ్యవధిలోనే అవుట్ చేయడంతో ఇంగ్లండ్ కథ ముగిసింది.

భారత్ 579 టెస్టులు ఆడగా, ఇందులో విజయాలు (178), ఓటములు (178) సమానం కావడం ఇదే తొలిసారి. 222 మ్యాచ్‌లు డ్రా కాగా, ఓ మ్యాచ్ టైగా ముగిసింది.

ఐదు టెస్టుల సిరీస్‌లోని తొలి టెస్టులో ఓడి వరుసగా నాలుగు మ్యాచ్‌లు నెగ్గడం ఏ జట్టుకైనా 112 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిగా 1911-12లో ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియాపై ఇలా గెలిచింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 218;
భారత్ తొలి ఇన్నింగ్స్: 477.
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) సర్ఫరాజ్ (బి) అశ్విన్ 0; డకెట్ (బి) అశ్విన్ 2; పోప్ (సి) జైస్వాల్ (బి) అశ్విన్ 19; రూట్ (సి) బుమ్రా (బి) కుల్దీప్ 84; బెయిర్‌స్టో (ఎల్బీ) కుల్దీప్ 39; స్టోక్స్ (బి) అశ్విన్ 2; ఫోక్స్ (బి) అశ్విన్ 8; హార్ట్‌లీ (ఎల్బీ) బుమ్రా 20; ఉడ్ (ఎల్బీ) బుమ్రా 0; బషీర్ (బి) జడేజా 13; అండర్సన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 48.1 ఓవర్లలో 195 ఆలౌట్.** వికెట్ల పతనం: 1-2, 2-21, 3-36, 4-92, 5-103, 6-113, 7-141, 8-141, 9-189, 10-195. **బౌలింగ్:** బుమ్రా 10-2-38-2; అశ్విన్ 14-0-77-5; జడేజా 9-1-25-1; కుల్దీప్ 14.1-0-40-2; సిరాజ్ 1-0-8-0.



1 టెస్టుల్లో 700 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా అండర్సన్. ఓవరాల్‌గా మురళీధరన్ (800), షేన్ వార్న్ (709) తర్వాత నిలిచాడు.

1 టెస్టుల్లో ఎక్కువ సార్లు (36) 5+ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా హ్యాడ్లీ సరసన నిలిచిన అశ్విన్. మురళీధరన్ (67), షేన్ వార్న్ (37) టాప్‌లో ఉన్నారు.

3 భారత్ తరఫున ఎక్కువ సార్లు (36) 5+ వికెట్లు తీసిన బౌలర్‌గా అశ్విన్. కుంబ్లే (35)ను దాటేశాడు. అలాగే వందో టెస్టులో ఉత్తమ గణాంకాలు (9/128) నమోదు చేసిన బౌలర్‌గా.. రెండు ఇన్నింగ్స్‌లోనూ 4+ వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గానూ నిలిచాడు. అంతేకాదు.. అరంగేట్ర టెస్టుతో పాటు వందో టెస్టులోనూ ఐదు వికెట్లు తీసిన బౌలర్ అతనొక్కడే కావడం విశేషం.

ప్లేఆఫ్స్‌కు ముంబై

- హర్మన్‌ప్రీత్ మెరుపుదాడి
- 7 వికెట్లతో గుజరాత్ చిత్తు



నేటి మ్యాచ్
ఢిల్లీ x బెంగళూరు
రాత్రి 7.30 నుంచి

న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 10 ఫోర్లు 5 సిక్స్‌లతో 95 నాటౌట్) తుపాను ఇన్నింగ్స్‌తో.. ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. డబ్ల్యూపీఎల్‌లో శనివారం జరిగిన థ్రిల్లింగ్ మ్యాచ్‌లో ముంబై 7 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. 7 మ్యాచ్‌ల నుంచి 10 పాయింట్లు సాధించిన ముంబై.. టాప్‌లో నిలిచి ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేసింది. హేమలత (74), కెప్టెన్ బెత్ మూనీ (66) అర్ధ శతకాలు చేశారు. ఛేదనలో ముంబై 19.5 ఓవర్లలో 191/3 స్కోరు చేసి నెగ్గింది. యాస్తిక (49) రాణించింది. హర్మన్, కెర్ (12 నాటౌట్) నాలుగో వికెట్‌కు అజేయంగా 93 రన్స్ జోడించి.. జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. 40 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హర్మన్ క్యాచ్‌ను లిచ్‌ఫీల్డ్ చేజార్చడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. గెలుపునకు చివరి 18 బంతుల్లో 47 పరుగులు కావాల్సి ఉండగా.. రాణా వేసిన 18వ ఓవర్‌లో హర్మన్ 24 రన్స్ రాబట్టడంతో సమీకరణం ఒక్కసారిగా మారిపోయింది.

స్వల్ప స్కోర్లు: గుజరాత్: 20 ఓవర్లలో 190/7 (హేమలత 74, బెత్ మూనీ 66; ఇషాక్ 2/31); **ముంబై:** 19.5 ఓవర్లలో 191/3 (హర్మన్‌ప్రీత్ 95 నాటౌట్, యాస్తిక 49, గార్డ్‌నర్ 1/22).

ముంబై X విదర్భ — రంజీ ఫైనల్ నేటి నుంచి

తుషార హ్యాట్రిక్



సిల్హెట్ (బంగ్లాదేశ్): ఓపెనర్ కుశాల్ మెండిస్ (55 బంతుల్లో 86) ఇన్నింగ్స్‌కు తోడు, పేసర్ నువాన్ తుషార (5/20) హ్యాట్రిక్ సహా ఐదు వికెట్లతో విజృంభించడంతో.. ఆఖరి, మూడో టీ20లో శ్రీలంక 28 పరుగుల తేడాతో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో గెలుచుకొంది. 175 పరుగుల ఛేదనలో తుషార సూపర్ స్పెల్ (4-1-20-5) ధాటికి బంగ్లా 19.4 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు లంక 20 ఓవర్లలో 174/7 స్కోరు చేసింది. టీ20ల్లో హ్యాట్రిక్ తీసిన ఐదో లంక బౌలర్‌గా నిలిచిన తుషార 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

టెస్టులు ఆడితే.. డబ్బే డబ్బు

మ్యాచ్ ఫీజుకు 300 శాతం ప్రోత్సాహకం
బీసీసీఐ సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ: టీ20 లీగ్‌ల ఒరవడిలో.. ప్రశ్నార్థకంగా మారిన టెస్టు క్రికెట్‌ను కాపాడుకొనేందుకు బీసీసీఐ విప్లవాత్మక నిర్ణయం తీసుకొంది. సుదీర్ఘ ఫార్మాట్ ఆడే ఆటగాళ్లను ప్రోత్సహించడంలో భాగంగా 'టెస్టు క్రికెట్ ఇన్సెంటివ్ స్కీమ్'ను బీసీసీఐ కార్యదర్శి జై షా శనివారం ప్రకటించాడు. ఈ పథకం కింద.. ఒక సీజన్‌లో కనీసం 75శాతం, అంతకంటే ఎక్కువ టెస్టులు ఆడిన ఆటగాడికి అతడి మ్యాచ్ ఫీజుకు అదనంగా మూడు రెట్లు ప్రోత్సాహకాన్ని అందించనున్నారు. సాధారణంగా 10 టెస్టులు ఆడితే మ్యాచ్ ఫీజు కింద (టెస్టుకు రూ. 15 లక్షల చొప్పున) 1.5 కోట్లతోపాటు ప్రోత్సాహకం కింద మూడింతలు, అంటే రూ. 4.5 కోట్లు అదనంగా సంపాదిస్తాడు. నాన్ ప్లేయింగ్ ఆటగాళ్లకు సగం లభిస్తుంది. టాప్ గ్రేడ్ వార్షిక కాంట్రాక్టులున్న ఆటగాళ్లకు కూడా ఈ స్కీమ్ వర్తిస్తుంది. 50శాతం కంటే తక్కువ మ్యాచ్‌లు ఆడిన వారికి మ్యాచ్ ఫీజు రూ. 15 లక్షలు (తుది జట్టులో ఆడితే) మాత్రమే చెల్లిస్తారు. 50-75 శాతం (6 లేదా 7 ఆడితే) లోపు మ్యాచ్‌లు ఆడిన వారికి ప్రోత్సాహకం కింద మ్యాచ్‌కు అదనంగా రూ. 30 లక్షలు లభిస్తాయి. ఉదాహరణకు ఆరు టెస్టులు ఆడిన ఆటగాడు రూ. 90 లక్షలు మ్యాచ్ ఫీజుతోపాటు ఇన్సెంటివ్స్ కింద రూ. 1.8కోట్లు.. అంటే సీజన్‌కు రూ.2.70 కోట్లు ఆర్జిస్తాడు. ఇటీవల ఇషాన్, శ్రేయాస్, దీపక్ చాహర్ లాంటి క్రికెటర్లు.. ఐపీఎల్ కోసం రంజీలు ఆడడానికి విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో బోర్డు ఈ కీలక నిర్ణయం తీసుకొంది.

ఫెడ్‌కప్‌లో సంగీత, తేజకు పతకాలు


తేజ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ ఫెడ్ కప్‌లో తెలుగు అథ్లెట్లు సాయి సంగీత, హిమతేజ పతకాలు కొల్లగొట్టారు. లఖ్‌నవూలోని సాయ్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీల్లో నాగర్‌కర్నూల్‌కు చెందిన హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ అథ్లెట్ సంగీత 400 మీటర్ల పరుగులో స్వర్ణం.. 100 మీటర్ల స్ప్రింట్‌లో నెల్లూరుకు చెందిన సాయ్ (హైదరాబాద్) అథ్లెట్ హిమతేజ కాంస్యం అందుకున్నారు.

హుస్సాముద్దీన్ పరాజయం

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌లో హుస్సాముద్దీన్‌కు నిరాశ ఎదురైంది. 57 కిలోల విభాగం రెండో రౌండ్‌లో హుస్సాం 0-4తో జూడ్ (ఐర్లాండ్) చేతిలో ఓడాడు.

పోరాడుతున్న కివీస్

క్రైస్ట్‌చర్చ్: కేన్ విలియమ్సన్ (51) అర్ధ శతకం చేయడంతో.. ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో న్యూజిలాండ్ పోరాడుతోంది. 94 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్ రెండోరోజు ఆట చివరికి 134/2 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 124/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 256 రన్స్‌కు ఆలౌటైంది. హెన్రీ 7 వికెట్లు తీశాడు. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 162 రన్స్ చేసింది.

దేశంలో 8.7 కోట్లు — స్టాక్ మార్కెట్ మదుపరులు

17.4 శాతం వాటాతో అగ్రస్థానంలో మహారాష్ట్ర

తొమ్మిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్ : ఎన్ఎస్ఈ

ముంబై: దేశంలో స్టాక్ మార్కెట్ మదుపరుల సంఖ్య ఏటికేటికి పెరిగిపోతోంది. 2015 మార్చి నాటికి 1.79 కోట్లుగా ఉన్న వీరి సంఖ్య ఈ ఏడాది జనవరి నెలాఖరుకు 389 శాతం పెరిగి 8.7 కోట్లకు చేరింది. ఇందులో దాదాపు 54 శాతం మదుపరులు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఉన్నట్టు ఎన్ఎస్ఈ విడుదల చేసిన తాజా గణాంకాలు తెలుపుతున్నాయి. మొత్తం మదుపరుల్లో 17.4 శాతం (1.53 కోట్ల) వాటాతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. అయితే 2014 మార్చి నెలాఖరుతో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలాఖరుకు దేశంలోని మొత్తం స్టాక్ మార్కెట్ మదుపరుల్లో మహారాష్ట్ర మదుపరుల వాటా 19.9 శాతం నుంచి 17.4 శాతానికి పడిపోయింది.

రెండో స్థానంలో ఉత్తర ప్రదేశ్

ఇదే సమయంలో ఉత్తర ప్రదేశ్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల కల్చర్ బాగా పెరిగింది. దీంతో 2022 నవంబరులో గుజరాత్‌ని తోసిపుచ్చి ఉత్తర ప్రదేశ్ రెండో స్థానానికి ఎదిగింది. 2014 మార్చి నాటికి దేశంలోని స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లలో ఆ రాష్ట్ర వాటా కేవలం 6.9 శాతం. ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి అది 10.7 శాతానికి చేరింది. ఇదే సమయంలో మదుపరుల సంఖ్యా 12.4 లక్షల నుంచి 93.6 లక్షలకు చేరింది.



మూడో స్థానంలో గుజరాత్

స్టాక్ మార్కెట్ కల్చర్ అధికంగా ఉండే గుజరాత్ ప్రస్తుతం మదుపరుల పరంగా చూస్తే తొమ్మిది శాతంతో మూడో స్థానంలో ఉంది. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాలు 5.6 శాతం చొప్పున వరుసగా నాలుగు, ఐదు, ఆరో స్థానాల్లో నిలిచాయి. స్టాక్ మదుపరుల పరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ 4.6 శాతం (40.05 లక్షల మంది) వాటాతో తొమ్మిదో స్థానంలో ఉంది. ఏపీ కంటే ముందు 5.5 శాతం (48.6 లక్షల మంది) వాటాతో తమిళనాడు ఏడు, 4.8 శాతం (41.8 లక్షల మంది) వాటాతో మధ్యప్రదేశ్ ఎనిమిదో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ (4.6 శాతం), బిహార్ (4.1 శాతం) వరుసగా తరువాతి స్థానాల్లో నిలిచాయి. 2015 మార్చితో పోలిస్తే బిహార్ స్థానం 1.6 శాతం (2.94 లక్షల మంది) నుంచి 4.1 శాతానికి (35.9 లక్షల మంది) పెరగడం విశేషం.

బిజినెస్

వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు

చిప్‌ల తయారీ రంగంలో నియామకాల వెల్లువ!

ఈ ఏడాదిలో 50,000 వరకు అవకాశాలు

న్యూఢిల్లీ: దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ల (చిప్) తయారీ రంగంలో నిపుణులకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ ఏడాది చిప్‌ల తయారీ ఇండస్ట్రీలో ఉద్యోగుల డిమాండ్ 40,000-50,000 స్థాయిలో ఉండవచ్చని, గత ఏడాదితో పోలిస్తే 25-30 శాతం పెరగవచ్చని ప్రముఖ స్టాఫింగ్ సేవల కంపెనీ ర్యాండ్‌స్టడ్ అంటోంది. వచ్చే ఐదేళ్లలో ఈ రంగం 8-10 లక్షలకు పైగా నియామకాలు చేపట్టవని అంచనా వేసింది. చిప్‌ల తయారీలో భారత్‌ను అంతర్జాతీయ హబ్‌గా అభివృద్ధి చేయాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా, 1,500 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1.25 లక్షల కోట్లు) విలువైన పెట్టుబడులతో కూడిన మూడు చిప్‌ల తయారీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గతనెలలోనే ఆమోదం తెలిపింది.

చిప్‌ల తయారీ రంగంలో నిపుణులకు డిమాండ్ ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకుందని, వీటి తయారీకి అవసరమైన మౌలిక వసతులు, ఇండస్ట్రియల్ పార్క్స్, టెస్టింగ్ సిస్టమ్స్, ఆర్ అండ్ డీ వసతుల అభివృద్ధికి భారీ సంఖ్యలో ఉద్యోగులు అవసరమని ర్యాండ్‌స్టడ్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వై గిరి అన్నారు. గుజరాత్, బెంగళూరు, తెలంగాణ, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లోని ఈ రంగ కంపెనీల్లో సేల్స్, ఫీల్డ్ అప్లికేషన్ ఇంజనీర్స్, ఎక్విప్‌మెంట్ సర్వీస్ ఇంజనీర్, పర్చేజ్ మేనేజర్స్ విభాగాల్లో ఎంట్రీ, మిడ్ లెవెల్ ఉద్యోగుల నియామకాలు పెరిగాయన్నారు. అలాగే, వచ్చే కొన్నేళ్లలో చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, చిప్ అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకేజింగ్ వసతుల్లో నియామకాలు జోరందుకోవచ్చని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఉన్నతోద్యోగుల విషయానికొస్తే, ఫీల్డ్ ఇంజనీరింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ స్థాయి వారికి డిమాండ్ పెరగనుందని గిరి పేర్కొన్నారు.



ప్రస్తుతం ఈ రంగంలో నిపుణుల కొరత అధికంగా ఉండటంతో కంపెనీలు ఇప్పటికే అనుభవం కలిగిన వారితోపాటు ప్రాంగణ నియామకాల ద్వారా ఫ్రెషర్లను సైతం నియమించుకునే ఆలోచనలో ఉన్నాయట. ఉద్యోగావకాశాలతోపాటు ఈ రంగంలో పనిచేసే వారికి వేతనాలూ భారీ స్థాయిలోనే లభించనున్నాయి. ఎంట్రీ లెవెల్ డిజైన్ ఇంజనీర్లకు రూ.15-20 లక్షల నుంచి ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.2.5 కోట్ల వరకు వార్షిక ప్యాకేజీ లభించవచ్చని ఏటీసీ కన్సల్టెంట్స్ ప్రతినిధి మురళీ మోహన్ అన్నారు. సెమీకాన్ మాన్యుఫాక్చరింగ్, ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓఎస్ఏటీ) విభాగాల్లో నిపుణుల కొరత అధికంగా ఉందని, 4-12 ఏళ్ల అనుభవం కలిగిన వారి నియామకాలు అధికంగా జరుగుతున్నాయని మురళీ అన్నారు.

• యాక్సిస్ క్రిసిల్ ఐబీఎక్స్ డెట్ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్ ఐబీఎక్స్ ఎస్‌డీఎల్ జూన్ 2034 డెట్ ఇండెక్స్ ఫండ్‌ను విడుదల చేసిం ది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్. ఇది క్రిసిల్ ఐబీఎక్స్ ఎస్‌డీఎల్ ఇండెక్స్-జూన్ 2034 ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ మెచ్యూరిటీ తేదీ 2034 జూన్ 30. కనీస పెట్టుబడి రూ.5,000. ఈ ఫండ్ ముగింపు తేదీ మార్చి 12.

బంధన్ లాంగ్ డ్యూరేషన్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ లాంగ్ డ్యూరేషన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్, దీర్ఘకాలిక డెట్ పథకం. ఈ ఫండ్.. డెట్, మనీ మార్కెట్ సెక్యూరిటీలకు సంబంధించిన వివిధ పోర్టుఫోలియోల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఈ నెల 18 వరకు అందుబాటులో ఉంటుంది.

బిట్‌కాయిన్ @ 70,000 డాలర్లు

ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ తొలిసారిగా 70,000 డాలర్ల మైలురాయికి చేరడం ద్వారా సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. అమెరికాలో స్పాట్ ఎక్స్ఛేంజీలో ట్రేడవుతున్న క్రిప్టో కరెన్సీలకు ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో పాటు త్వరలో ఫెడ్ రేట్లు తగ్గవచ్చన్న అంచనాలు కూడా బిట్‌కాయిన్ ర్యాలీకి కారణమని ఇండస్ట్రీ విశ్లేషకులు తెలిపారు.

ఈ ఏడాది ఆఫీస్ స్పేస్‌కు భలే గిరాకీ

- 5.5 కోట్ల చదరపు అడుగుల స్థలానికి డిమాండ్
- ఫిక్కీ-కోలియర్స్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ (ఆఫీస్) స్థలాలకు ఈ ఏడాది అద్భుతమైన డిమాండ్ ఉండనుందని ఫిక్కీ-కోలియర్స్ నివేదిక వెల్లడించింది. దేశీయ, విదేశీ సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాల విస్తరణ కోసం దాదాపు 5-5.5 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు ఇండియా ఆఫీస్: రీపర్పస్డ్ టు స్కేల్ అప్ పేరుతో రూపొందించిన నివేదికలో ఫిక్కీ-కోలియర్స్ తెలిపాయి. ప్రస్తుతం దేశంలోని ఆరు ప్రధాన నగరాలైన బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, హైదరాబాద్, ముంబై, పుణెల్లో 5.82 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయని పేర్కొంది. అయితే ఈ ఏడాది పరిస్థితులు ఆశాజనకంగా ఉండటంతో దేశీయ, బహుళ జాతి సంస్థలు ఈ నగరాల్లో సుమారు 5-5.5 కోట్ల చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకోవచ్చని భావిస్తున్నట్లు వెల్లడించింది. డిమాండ్ మరింత పెరిగితే లీజుకు తీసుకునే స్థలం 6 కోట్ల చదరపు అడుగుల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. భారత్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ 5 కోట్ల చదరపు అడుగుల కంటే ఎక్కువగా ఉండటం వరుసగా ఇది మూడో ఏడాదని కోలియర్స్ ఇండియా ఎండీ అర్పిత్ మెహరోత్రా అన్నారు. 2019లో దేశీయ, విదేశీ సంస్థలు లీజుకు తీసుకున్న గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్ 34 శాతంగా ఉండగా 2023 నాటికి ఇది 50 శాతానికి చేరుకుందని నివేదిక తెలిపింది.



హౌసింగ్ మార్కెట్‌పై ఇన్వెస్టర్ల నజర్

హౌసింగ్ మార్కెట్‌పై పెట్టుబడిదారులు మళ్లీ ఆసక్తి చూపిస్తున్నారు. పెట్టుబడుల కోసం ఇళ్లను కొనుగోలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఫిక్కీ-అనరాక్ సర్వే తెలిపింది. సుమారు 36 శాతం మంది పెట్టుబడుల ద్వారా లాభాలను ఆర్జించేందుకు ఇళ్లు కొనుగోలు చేయాలని చూస్తున్నట్లు వెల్లడించారని ఫిక్కీ-అనరాక్ కన్స్యూమర్ సెంటిమెంట్ సర్వే పేర్కొంది. ఆదాయాలు పెరగటం, కొవిడ్ అనంతరం మారిన పరిణామాలు, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి అంశాలతో మరింత విశాలమైన ఇళ్లను కొనుగోలు చేయాలని కొనుగోలుదారులు భావిస్తున్నారని తెలిపింది. కొనుగోలుదారుల అభిరుచులు మారిపోవటంతో దేశవ్యాప్తంగా పెద్ద, లగ్జరీ గృహాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని సర్వే వెల్లడించింది. అంతేకాకుండా చాలా మంది కొనుగోలుదారులు.. లాభాల కోసమే గృహాలపై పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు వెల్లడించారని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,270 ▲	60,750 ▲	79,100 ▲
ముంబై	64,955 ▲	59,499 ▲	72,265 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	430	విశాఖపట్నం	475
10వ తేదీ		వరంగల్	432
చిత్తూరు	523		
గోదావరి	433	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	గోదావరి	116
వరంగల్	112	విజయవాడ	116
కరీంనగర్	112	గుంటూరు	116
మహబూబ్‌నగర్	112	ఒంగోలు	116
కర్నూలు	112	చిత్తూరు	120
విశాఖపట్నం	113		

రూ.66,000 ఎగువకు బంగారం

మరో రూ.540 పెరుగుదలతో సరికొత్త రికార్డు గరిష్ఠానికి చేరిక

హైదరాబాద్: గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఎగబాకుతూనే ఉన్నాయి. శనివారం పసిడి ధర తొలిసారిగా రూ.66,000 మైలురాయిని అధిగమించి సరికొత్త రికార్డు స్థాయిని నమోదు చేసుకుంది. హైదరాబాద్ మార్కెట్లో పది గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం మరో రూ.540 పెరుగుదలతో రూ.66,270కి చేరుకుంది. 22 క్యారెట్ల స్వచ్ఛత లోహం రూ.500 పెరిగి రూ.60,750 ధర పలికింది. కిలో వెండి రూ.79,100 స్థాయిలో అమ్ముడుపోయింది. అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ ఒక్కసారిగా పెరగడం ఇందుకు కారణమైంది. గడిచిన ఐదు రోజుల్లో పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.2,180 పెరిగింది.

మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి 2,185 డాలర్లకు చేరుకుంది. సిల్వర్ 24.52 డాలర్ల వద్ద ట్రేడైంది. అమెరికాలో విడుదలైన తాజా నిరుద్యోగ గణాంకాలు, ఫెడ్ రేట్ల తగ్గింపు త్వరలోనే ప్రారంభం కావచ్చన్న అంచనాలను పెంచాయి. దాంతో విలువైన లోహాల్లోకి పెట్టుబడులు మరింత పెరిగాయి. ఎందుకంటే, ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గుతున్న సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి.





నెల్లూరులో పార్టీ ప్రచారం కోసం వాల్ రైటింగ్ రాస్తున్న మధ్యప్రదేశ్ మాజీ సీఎం చౌహాన్, పురందేశ్వరి తదితరులు

జగన్ పాలన అత్యంత అవినీతిమయం

- రాజ్యమేలుతున్న మాఫియాలు: ఎంపీ మాజీ సీఎం చౌహాన్
- అధిష్ఠానం ఎక్కడ సూచిస్తే అక్కడ పోటీ చేస్తా
- రాష్ట్రాభివృద్ధి కోసమే పొత్తు నిర్ణయం: పురందేశ్వరి

నెల్లూరు, మార్చి 9: ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం అత్యంత అవినీతి పాలన సాగిస్తోందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నెల్లూరులోని కస్తూర్బా గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏపీలో లిక్కర్ మాఫియా, ఇసుక మాఫియాలు రాజ్యమేలుతున్నాయని, ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు పెద్ద ఎత్తున భూములు దోచుకుంటున్నారని ఆరోపించారు. లిక్కర్ మాఫియా కారణంగా కల్తీ, నకిలీ మద్యం సేవించి ఎంతోమంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ప్రజలను తాగుబోతులుగా తయారు చేసి, అనారోగ్యాలపాలు చేసి రూ.36 వేల కోట్లు ట్యాక్సుల రూపంలో గుంజేస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ... బీజేపీ అధినాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అది రాష్ట్ర హితమే అవుతుందన్నారు. ఏపీలో ఏవిధమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నామో అందరికీ తెలుసునని, ఇలాంటి పరిస్థితుల్లో మంచి మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలన్న ఆలోచనతోనే పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. అధిష్ఠానం ఎక్కడ నుంచి పోటీ చేయమని సూచిస్తే అక్కడి నుంచే పోటీ చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

అవినీతి... ఉగ్రవాదం... దోచుకోవడం

- ఐదేళ్ల వైసీపీ పాలనపై పవన్ మండిపాటు
- ప్రధాని మోదీ నాయకత్వంలో ఆంధ్ర ప్రజల బాధలకు ముగింపు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ విధానం ఉగ్రవాదం, అవినీతి, సహజ వనరులను దోచుకోవడమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. జనసేన, టీడీపీ... ఎన్డీఏ కూటమిలో చేరిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'రాష్ట్ర విభజనతో ఆంధ్రలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభం... వైసీపీ ఐదేళ్ల పాలనలో విలువైన ఇసుక, ఖనిజాలు వంటి సహజ వనరుల దోపిడీ, మద్యం మాఫియా, దేవాలయాల ధ్వంసం, టీటీడీని ఏటీఎంగా మార్చడం... ప్రతిపక్ష నేతలకు, కేడర్‌కు బెదిరింపులు, భౌతిక దాడులు, న్యాయవ్యవస్థ దుర్వినియోగం, వ్యాపారవేత్తలను, పారిశ్రామిక వేత్తలను బెదిరించడం, వారు పారిపోయేలా చేయడం... ఎర్రచందనం అక్రమ రవాణా, 30 వేలకు పైగా మహిళల ఆచూకీ లేకపోవడం, దళితులపై అత్యధిక స్థాయిలో అఘాయిత్యాలు... ఇలా ఈ జాబితా కొనసాగుతుంది... చివరికి టీడీపీ, జనసేన కూటమి ఎన్డీఏలో చేరడంతో, ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో వైసీపీ అకృత్యాలకు తెరపడుతుంది. ఎన్డీఏలో మమ్మల్ని భాగస్వాములను చేసినందుకు మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఏపీ ప్రజల బాధలకు ముగింపు పలకడానికి మీ నాయకత్వంలో పనిచేయడానికి మేం ఎదురుచూస్తున్నాం. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు ధన్యవాదాలు' అని పవన్ పేర్కొన్నారు.

కీలక మలుపుగా చరిత్ర గుర్తుంచుకొంటుంది: లోకేశ్

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ చేతులు కలపడాన్ని ఒక కీలక మలుపుగా చరిత్ర గుర్తుంచుకొంటుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అభివృద్ధి పథంలోకి తేవడానికి ఈ మూడు పార్టీలు చేతులు కలిపాయి. ఇది మన రాష్ట్రానికి ఒక ప్రధానమైన సందర్భం. ఆంధ్రప్రదేశ్ ఈ ఐదేళ్లలో ఎంతో నష్టపోయింది. రాష్ట్రం గతిని మార్చడానికి అనివార్యమైన పరిణామంగా ఈ కలయికను చరిత్ర గుర్తుంచుకొంటుంది' అని లోకేశ్ అన్నారు.

నేటి నుంచి అనంతలో లోకేశ్ శంఖారావం

అనంతపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో మలివిడత శంఖారావం సభలను నిర్వహించేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సిద్ధమయ్యారు. జిల్లాలో ఆయన ఆదివారం నుంచి రెండు రోజుల పాటు పర్యటిస్తారు. ఐదు నియోజకవర్గాల్లో సభలను నిర్వహిస్తారు. ఉరవకొండలో ఉదయం, రాయదుర్గంలో మధ్యాహ్నం, కళ్యాణదుర్గంలో సాయంత్రం శంఖారావం సభలు ఉంటాయి.

మాది విన్నింగ్ టీం: అచ్చెన్నాయుడు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మూడు పార్టీల కూటమి విన్నింగ్ టీంగా నిలిచిపోతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యమే లేకుండా చేసిన ఈ దుర్మార్గ పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించడానికి మూడు పార్టీలు జత కట్టడం శుభ పరిణామం. అన్ని వర్గాల ప్రజలు ఈ కూటమికి మద్దతు తెలుపుతున్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం అనే ఏకైక ఎజెండాతో మూడు పార్టీలు మహా కూటమిగా ఏర్పడ్డాయి. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని మళ్లీ నిలబెట్టడానికి కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు చాలా అవసరం' అని అచ్చెన్న అన్నారు. కాగా, వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ షేక్ దస్తగిరి తండ్రి షేక్ హాజీవలిపై వైసీపీ రౌడీలు దాడి చేయడం దుర్మార్గమని అచ్చెన్న మండిపడ్డారు. బాబాయి బాత్రూం మర్డర్ కేసు మిస్టరీ వీడుతుందనే దస్తగిరి కుటుంబాన్ని వేధిస్తున్నారని అన్నారు.

చంద్రబాబు పర్యటనల్లో మార్పులు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనల్లో మార్పులు జరుగుతున్నాయి. ఈ నెల పదకొండో తేదీ నుంచి ప్రజా గళం పేరుతో ఆయన పర్యటనలు ప్రారంభం కావాల్సి ఉంది. పదకొండో తేదీన ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాల్లో నిర్ణయించారు. కాని తాజా పరిణామాల నేపథ్యంలో ఇవి వాయిదాపడ్డాయి. ఈ నెల 17న చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభను నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 11, 12 తేదీల్లో ఆయన సభలు ఉండబోవని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. మిగిలిన తేదీలకు సంబంధించి ఇంకా స్పష్టత రాలేదు.

తెలుగు భాషాభ్యున్నతికి మేధోమథనం చేయాలి

- సాహితీవేత్తలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
- కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ప్రారంభం



తెలుగు సాహితీ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 9: తెలుగు భాషాభ్యున్నతికి సాహితీవేత్తలంతా మేధోమథనం చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సును శనివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవంలో భాగంగా రెండురోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువతరంతో ముఖాముఖి, తెలుగు భాషాభివృద్ధి-సంస్కృతి, వ్యవసాయం తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. మాతృభాషలో చదివే ద్రౌపదిముర్ము రాష్ట్రపతి అయ్యారని, వీధి బడిలో చదివిన మోదీ ప్రధాని అయ్యారన్నారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ, తాను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఉన్నత స్థితికి చేరగలిగామన్నారు. సదస్సులో రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శాసనసభ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ఫౌండేషన్ చైర్మన్ వంగూరి చిట్టెన్‌రాజు పాల్గొన్నారు.

ప్రభంజనం సృష్టిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)



టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సభ నిర్వహణకు శనివారం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు.

తెలిపారు. త్వరలోనే ఉమ్మడి ప్రచారం కూడా మొదలవుతుందన్నారు. ఏపీ అభివృద్ధిని కోరుకునే ముస్లిం మైనారిటీ సోదరులంతా తమకు ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. "నా లక్ష్యం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే. గతంలో ఎలాంటి రాజకీయ నిర్ణయాలైనా రాష్ట్రాభివృద్ధి, ప్రజల ప్రయోజనాలు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే తీసుకున్నా. గత ఎన్నికల ముందు కూడా రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పోరాడాను. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాల్సిన అవసరం, బాధ్యత ఉన్నాయి. అందుకు కేంద్ర సహకారం కావాలి. అందుకే ఎన్డీయేలో భాగస్వాములమయ్యాం" అని చంద్రబాబు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అజెండా కూడా దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేయడమేనని, దేశమంతటా అభివృద్ధి జరుగుతుంటే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉండడం ఆయనకూ ఇష్టం లేదని చంద్రబాబు తెలిపారు. "కేంద్రంలో, రాష్ట్రంలో భాగస్వామ్య పార్టీల ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్‌లా పనిచేసినప్పుడే అభివృద్ధి జరుగుతుందని మోదీ ఎప్పటి నుంచో చెబుతున్నారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏపీ అభివృద్ధి గురించి ప్రపంచమంతటా ప్రచారం చేసేవాడిని. మోదీ కూడా ప్రధానిగా అంతర్జాతీయ స్థాయిలో భారత దేశం బలోపేతం కావడం గురించి మాట్లాడుతున్నారు. మా ఇద్దరి దూరదృష్టి రాష్ట్ర, దేశ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది" అని చంద్రబాబు చెప్పారు.

జగన్‌ది విపరీత మానసిక ప్రవృత్తి

వైఎస్ జగన్‌కు అభివృద్ధి అంటే అర్థం కూడా తెలియదని చంద్రబాబు విమర్శించారు. తనను విమర్శించిన వారిని, మీడియాను అణచివేస్తారని... ఆయనది ఒక విపరీతమైన మానసిక ప్రవృత్తి అని తెలిపారు. తన పార్టీ ఎంపీని కూడా పోలీసులతో కొట్టించారని తన పక్కనే ఉన్న రఘురామరాజును చూపిస్తూ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనను అక్రమంగా అరెస్టు చేసి, మానసికంగా కుంగదీసి, భౌతికంగా లేకుండా చేయాలని భావించారన్నారు. "జగన్ లాంటి రాజకీయ నాయకుడు ప్రపంచంలో ఎక్కడా ఉండరు. ఆయన చేసిన క్రైమ్‌లో అందరూ భాగస్వాములు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జగన్ ప్రభుత్వంపై జనంలో వ్యతిరేకత మాత్రమే కాదు... భయం, నిరాశానిస్పృహలు కూడా ఉన్నాయి. ఈ ప్రభుత్వాన్ని జనం ఛీదరించుకుంటున్నారు. ఏపీని అప్పుల కుప్పగా మార్చారు. రాబోయే రోజుల్లో ఇక అప్పు కూడా పుట్టని పరిస్థితి వచ్చింది" అని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన అనంతరం అమరావతిలోనూ టీడీపీ ముఖ్య నేతలు కొందరితో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అందుబాటులో ఉన్న నాయకులతోనూ సమావేశమయ్యారు. అక్రమాల్లో కూరుకుపోయిన జగన్ తమ పొత్తుతో వణికిపోతున్నారని... అందుకే పొత్తుపై దుష్ప్రచారానికి తెగబడుతున్నారని ఆయన విమర్శించారు. "మనం ఏ పరిస్థితుల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చింది... ఎన్డీయేలో చేరడం వల్ల రాష్ట్రానికి కలిగే లాభం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. మైనారిటీల్లో అభద్రతకు అవకాశం ఇవ్వకుండా వారిని కలుపుకొని వెళ్లాలి. పార్టీలోని మైనారిటీ నేతలు ఆ వర్గాల్లోకి వెళ్లి పార్టీ వైఖరిని వివరించాలి" అని సూచించారు.

రాష్ట్రం కోసం.. దేశం కోసం!

- పొత్తుపై 'ఉమ్మడి'గా ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, తెలుగుదేశం, జనసేన కలిసికట్టుగా పోటీ చేయాలని నిర్ణయించినట్లు మూడు పార్టీల అధ్యక్షులు జేపీ నడ్డా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ పొత్తుకు ప్రజలు హృదయపూర్వకంగా మద్దతిస్తారని, తమ కూటమి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని ఇందులో తెలిపారు. "దేశ ప్రగతి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం, అక్కడి ప్రజల అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తేజవంతమైన, దూరదృష్టిగల నాయకత్వంలో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసికట్టుగా పని చేస్తాయి. గత పదేళ్లుగా దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్విరామంగా పనిచేస్తున్నారు. టీడీపీ, జనసేనతో కలిసి పనిచేయడం వల్ల ఏపీ ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి. బీజేపీ, టీడీపీ మధ్య చిరకాల సంబంధాలున్నాయి. 1996లోనే తెలుగుదేశం ఎన్డీయేలో చేరింది. వాజపేయి, మోదీ ప్రభుత్వ హయాంలో కలిసి పని చేశాం. జనసేన పార్టీ 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో మద్దతు ఇచ్చింది. ఒకటి రెండు రోజుల్లో సీట్ల పంపిణీపై చర్చలు జరుగుతాయి" అని ఈ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇదే అంశంపై బీజేపీ అధ్యక్షుడు నడ్డా, అమిత్‌షా 'ఎక్స్'లో విడివిడిగా స్పందించారు. టీడీపీ, జనసేనలను ఎన్డీయేలోకి మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. 'ఏపీ ప్రజల ఆకాంక్షలు త్వరితగతిన నెరవేర్చేందుకు ఈ బంధం తోడ్పడుతుంది' అని అమిత్‌షా పేర్కొనగా, 'ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్ర ప్రగతిలో కొత్త శకాన్ని సృష్టిస్తాం' అని చంద్రబాబు ప్రతిస్పందించారు.

17 లేదా 18న కూటమి సభ

- చిలకలూరిపేటలో ప్రచార భేరీ.. మోదీ హాజరు!

టీడీపీ-జనసేన-బీజేపీతొలి ఉమ్మడి ప్రచార భేరీకి పల్నాడు జిల్లా చిలకలూరిపేట వేదిక కానుంది. ఈ నెల 17న చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని భావిస్తున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. ఈ సభకు ప్రధాని మోదీ కూడా హాజరవుతారని చెప్పారు. అయితే... ఒకవేళ ఆ రోజున ప్రధానికి సమయం కుదరకపోతే, సభను 18న నిర్వహించేందుకు చంద్రబాబు సమ్మతి తెలిపినట్లు సమాచారం. ఈ సభ కోసం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద 150 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు శనివారం ఈ స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల నుంచి ఈ సభకు హాజరవుతారని... సభ ఏర్పాట్లను సమన్వయ పరిచేందుకు మూడు పార్టీల నేతలతో కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఈసీ.. దీనికేమంటుందో..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారమే చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలంలో వైసీపీ నేతలతో కలసి ఇంటింటికి వెళ్లి మరీ ప్రచారం చేశారు. మల్లూరు గ్రామపంచాయతీలో కొత్తపేట, ఎగువ హరిజనవాడ, తొట్టికాడ హరిజనవాడ, బెల్లవాండ్లపల్లె, తిమ్మారెడ్డిగారిపల్లె, దద్దోళ్లపల్లెల్లో వైసీపీ గ్రామస్థాయి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వీరి వెంట వలంటీర్లు రమణారెడ్డి, ఈశ్వరయ్య, రాజన్న, గౌరీ, సుధాకర్, రెడ్డమ్మ, అబ్బాస్, రేష్మ, వాజిదా, రెడ్డమ్మ పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ వైసీపీకే ఓటు వేయాలని, జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రభుత్వం మారితే సంక్షేమ పథకాలు రావని చెప్పారు. జై జగన్, జై వైసీపీ అంటూ నినాదాలు చేస్తూ ప్రచారం చేశారు. ఇదే విషయమై ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్న సంగతి తన దృష్టికి వచ్చిందని, వారికి మెమోలు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వలంటీర్లకు మెమో ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ..

బీజేపీ ఎంపీ అభ్యర్థులు వీరే!

- అన్ని వర్గాలపై కమలం ఫోకస్
- రాజంపేట నుంచి కిరణ్‌కుమార్?
- రాజమండ్రి నుంచి పురందేశ్వరి?
- హిందూపూర్ నుంచి సత్యకుమార్!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీలో పొత్తులు ఖరారు కావడంతో... అభ్యర్థుల ఎంపికపై బీజేపీ దృష్టి సారించింది. వెనుక బడిన వర్గాలకు చెందిన సత్యకుమార్‌ను హిందూపురం నుంచి బరిలో దించబోతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాయల సీమలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డిని రాజంపేట నుంచి పోటీలో నిలపనున్నట్లు తెలుస్తోంది. తిరుపతి(ఎస్సీ) నుంచి కర్ణాటక మాజీ సీఎస్ రత్నప్రభ లేదా ఆమె కుమార్తె నీహారిక పేర్లు వినిపిస్తున్నాయి. కోస్తాంధ్రలో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం స్థానం నుంచి పోటీ చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2014లో బీజేపీ విజయం సాధించిన నరసాపురం నుంచి వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణ రాజుకే అవకాశం మెండుగా ఉందని తెలుస్తోంది. గిరిజన ప్రాంతాల్లో పాగా వేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న బీజేపీ గతంలో విజయం సాధించిన విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని అరకు స్థానం నుంచి మాజీ ఎంపీ కొత్తపల్లి గీతను రంగంలోకి దించనున్నట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ స్థానాలు వీరికేనా?

అసెంబ్లీ స్థానాల్లోనూ బీజేపీ బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒక్కొక్క స్థానం తీసుకుని ఆ వర్గాలను బరిలో దించబోతోందని తెలుస్తోంది. అల్లూరి జిల్లా పాడేరు(ఎస్టీ) ఉమామహేశ్వరరావు; విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం విష్ణుకుమార్ రాజు; పి. గన్నవరం(ఎస్సీ) అయ్యాజీ వేమ; కైకలూరు కామినేని శ్రీనివాస్ లేదా తపన చౌదరి; గుంటూరు పశ్చిమ వల్లూరు జయప్రకాశ్, ధర్మవరం వరదాపురం సూర్యనారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, బీసీల్లో పీవీఎన్ మాధవ్(విశాఖ), మట్టా ప్రసాద్(కృష్ణా), పాకా సత్యనారాయణ (పశ్చిమ గోదావరి) పేర్లు కూడా వినిపిస్తున్నాయి. జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. అయితే... అభ్యర్థుల ఎంపికపై కూటమిలోనూ చర్చ జరుగుతుందని, కచ్చితమైన విజయావకాశాలున్న వారికే టికెట్ ఇస్తారని తెలుస్తోంది.

అసంతృప్తులపై ఫోకస్

బుజ్జగించే ఆలోచనలో పవన్

- కృష్ణా, గుంటూరు నేతలతో భేటీ పూర్తి
- భీమవరం నేతలకు పలు సూచనలు
- రాయల సీమలోనూ అసంతృప్తి పవనాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జనసేన అసంతృప్తులపై పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. పొత్తుల్లో భాగంగా కొంత మంది కీలక నాయకులకు సీట్లు దక్కలేదు. పార్టీ పరిస్థితి, పొత్తులను పరిగణనలోకి తీసుకున్న జనసేన 24 స్థానాలకే పరిమితమైంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న అందరికి న్యాయం చేయడం కష్టంగా మారింది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అసంతృప్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇప్పటికే జగ్గంపేట, తణుకు నాయకులు తమ అసంతృప్తి జెండా ఎగురవేశారు. వీరిద్దరు మాత్రమే బహిరంగంగా తమ అసంతృప్తి వ్యక్తం చేయగా, కొంత మంది నాయకులు గుంభనంగా ఉన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై నమ్మకంతో ఎవరూ బయటపడటం లేదు. ఈ విషయాన్ని గ్రహించిన అధిష్ఠానం ఆయా నేతలతో మాట్లాడి వారి అసంతృప్తిని తగ్గించాలని భావిస్తోంది. ఇప్పటికే గత వారంలో కృష్ణా, గుంటూరు నాయకులతో పవన్ నేరుగా భేటీ అయ్యారు. అలాగే, భీమవరం నేతలతోనూ వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. భీమవరంలో అంజిబాబుకు సపోర్టు చేయాలని సూచించారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న పరిస్థితి, పొత్తుల్లో ఎలాంటి వ్యూహంతో వెళ్లాలన్న దానిపై నాయకులకు వివరించారు. అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ తర్వాత నాయకులు శాంతిస్తున్నారు. వీరితో పాటు మరి కొంత మంది నాయకులతో కూడా చర్చించాలని పార్టీ భావిస్తోంది.

ఆమంచి అవసరమే

రెండు రోజుల కిందట ఆమంచి స్వాములు చీరాల జనసేన సమన్వయకర్త బాధ్యతలకు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ కార్యాలయానికి అందించారు. ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గిద్దలూరు సీటును ఆశించారు. టీడీపీతో పొత్తులో భాగంగా తొలుత ఆ సీటు కావాలని జనసేన పార్టీ కోరినప్పటికీ, తర్వాత సమీకరణలు మారాయి. దీంతో గిద్దలూరు సీటు జనసేన జాబితా నుంచి తొలగిపోయింది. చీరాలలో పార్టీ కోసం పని చేయాలని ఆమంచి స్వాములకు పార్టీ నుంచి సంకేతాలు వెళ్లాయి. కానీ, ఆయన వ్యక్తిగత సమస్యలతో పాటు ముగ్గురు కీలకమైన నేతలు పోటీ చేస్తే చీరాలలో వైసీపీకి మేలు జరుగుతుందనే విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో తాను చీరాలలో ఉండలేనని తేల్చిచెప్పారు. దీంతో పాటు సమన్వయకర్త బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ఈ విషయాన్ని పార్టీ కార్యాలయం అధినేత దృష్టికి తీసుకువెళ్లింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న పవన్.. మంగళగిరికి చేరుకున్న తర్వాత ఆమంచి స్వాములతో చర్చించే అవకాశం ఉంది.

సీమపై ప్రత్యేక దృష్టి

రాయలసీమపై కూడా పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని అక్కడి నాయకులు పవన్ కల్యాణ్‌ను కోరుతున్నారు. సీమలో దాదాపు 9 స్థానాల్లో పార్టీ బలంగా ఉంది. అయితే, పొత్తులో భాగంగా కేవలం 3 స్థానాలతో సరిపెట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. పొత్తుల్లో తీసుకున్న స్థానాల్లోనూ కొత్త వారి వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో రాయలసీమలో పార్టీ బలోపేతం కోసం పనిచేసిన నాయకులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆళ్లగడ్డ నుంచి రాంపుల్లారెడ్డి, తిరుపతి నుంచి కిరణ్ రాయల్, ధర్మవరం నుంచి చిలకం మధుసూదన్ రెడ్డి కొన్నేళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ చేసిన పోరాటాల్లో పాల్గొని పదుల సంఖ్యలో కేసులు పెట్టించుకున్నారు. ఇప్పటికీ కేసుల పేరుతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అలాగే, మదనపల్లి నుంచి రామ్‌దాస్ చౌదరి కూడా పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ నాయకురాలు పోటీ చేయనున్నారు. ఇక, తిరుపతి, ధర్మవరం, మదనపల్లె సీట్లు పెండింగులో ఉన్నాయి. తిరుపతి సీటు అభ్యర్థి కోసం పవన్ పలువురు నాయకులతో చర్చిస్తున్నారు. ధర్మవరంలో భారీ పోటీ నెలకొంది. పొత్తుల్లో భాగంగా బీజేపీకి వెళ్తుందని ప్రచారం జరుగుతోంది. కానీ, అక్కడ సూరి, పరిటాల శ్రీరామ్ మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. మధ్యేమార్గంగా జనసేనకు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

పవన్ పోటీ ఎక్కడ!

- భీమవరం నుంచి తప్పుకొన్న సేనాని
- పిఠాపురం, గాజువాక స్థానాలపై గురి
- తిరుపతి నుంచి పోటీకి నేతల డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఉత్కంఠ నెలకొంది. ఆయన ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే దానిపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు. మరోవైపు పవన్ పోటీ చేసేందుకు 4 అసెంబ్లీ నియోజకవర్గాలపై పార్టీ నాయకులు దృష్టి సారించారు. తొలుత పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తార ని చెప్పారు. దానిలో భాగంగానే గత నెలలో భీమవరంలో పర్యటించిన ఆయన అక్కడ టీడీపీ, బీజేపీ నేతలతో నేరుగా మాట్లాడారు. ఇక్కడ పోటీ చేస్తే ఈసా రి బంపర్ మెజార్టీతో గెలిచే అవకాశం ఉంది. కానీ, అనూహ్యంగా పవన్ ప్లాన్ మార్చుకున్నారు. అక్కడ టీడీపీలో ఉన్న అంజిబాబును జనసేన పార్టీలో చేర్చుకుంటున్నారు. అంజిబాబునే జనసేన నుంచి పోటీ చేయించాలని నిర్ణయించారు. అందులో భాగంగా భీమవరం నాయకులను మంగళగిరికి పిలిపించి మరీ చర్చించారు. ఆ సమావేశాలో అంజిబాబు కూడా పాల్గొన్నారు. తర్వాత పవన్ భీమవరం నుంచి తప్పుకొన్నట్లు స్పష్టత వచ్చింది. ఇక, పిఠాపురం వైపు కూడా పవన్ చూస్తున్నట్లు తెలుస్తోంది. పిఠాపురంలో కాపు సామాజిక వర్గం ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉంది. అక్కడ తంగెళ్ల ఉదయ్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు నాయకుల సమీకరణ చేశారు. తొలుత ఉదయ్.. పిఠాపురం నుంచి పోటీ చేయాలని భావించారు. పవన్ కూడా ఆయననే పిఠాపురం ఇన్‌చార్జిగా నియమించారు. కానీ, ఉదయ్ మాత్రం అధినేత అక్కడ నుంచి పోటీ చేస్తే బాగుంటుందని సూచించారు. పవన్ కల్యాణ్ కూడా సుముఖత వ్యక్తం చేశారు. మరోవైపు కాపు సామాజిక వర్గం మొత్తం పిఠాపురం నుంచి పవన్‌ను పోటీ చేయాలని లేఖలు రాస్తోంది. ఈ నేపథ్యంలో పవన్ జాబితాలో పిఠాపురం కూడా చేరింది.

గాజువాకపై కూడా..

విశాఖలోని గాజువాక పైనా పవన్ దృష్టి పెట్టారు. 2019 ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసిన ఆయన దాదాపు 50 వేల ఓట్లు సాధించారు. ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. టీడీపీ-జనసేన కలవడంతో గాజువాక జనసేనకు కంచుకోటగా మారింది. పైగా, స్థానిక వైసీపీ ఎమ్మెల్యేపై వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉంది. గాజువాకలో జనసేనకు దాదాపు 8 వేల మంది క్రియాశీలక కార్యకర్తలున్నారు. ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు గాజువాకలో చేశారు. కాగా, గాజువాక స్థానంపై జనసేన పూర్తిస్థాయిలో దృష్టి పెట్టింది. అధినేత అక్కడ నుంచి పోటీ చేస్తే దాదాపు లక్ష మెజారిటీ వచ్చేలా చేయాలన్న సంకల్పంతో నాయకులు, కేడర్ పని చేస్తోంది. కానీ, పవన్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. మరోవైపు తిరుపతి అసెంబ్లీ నుంచి పవన్ పోటీ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి ఇక్కడ పోటీ చేసి గెలుపొందారు. కాబట్టి, మరోసారి మెగా కుటుంబం నుంచి తిరుపతిలో పోటీ చేయాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. తిరుపతి నియోజకవర్గం నాయకులు కూడా ఇదే మాట చెబుతున్నారు. కానీ, పవన్ కల్యాణ్ తిరుపతివైపు మొగ్గు చూపడం లేదు. ప్రస్తుతం పిఠాపురం లేదా గాజువాక అనేది పవన్ నిర్ణయం మేరకు ఉంటుంది. ఈ స్థానాల్లో పార్టీ సర్వే చేపడుతోంది.

కర్నూలులో భారీగా బోగస్ ఓట్లు!

- ఒక్కరికే రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు
- 6,700 పైగా డబుల్ ఎంట్రీలు గుర్తించిన టీడీపీ
- పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్ సృజనకు ఫిర్యాదు



కర్నూలు నగరంలో ఒకే ఓటరుకు రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు ఉన్నట్లుగా చూపుతున్న జాబితా

కర్నూలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో భారీగా బోగస్ ఓట్లు వెలుగు చూస్తున్నాయి. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 3,700కు పైగా బోగస్ (డబుల్ ఎంట్రీలు) ఓటర్లు ఉంటే.. ఇదే నియోజకవర్గం పరిధిలో ఓటు హక్కు కలిగి కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో రెండో ఓటు ఉన్న ఓటర్లు 2,982 మంది వరకు ఉన్నట్లు గుర్తించారు. అంటే.. ఒక్క కార్పొరేషన్ పరిధిలోనే 6,700కు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ కేంద్రం నం.71లో ఓటరు సంఖ్య 52, ఇంటి నం. 49-1-ఏ-166-ఏలో జడ్‌జీఎఫ్ 3964913 కింద అమ్రీన్ ఫాతిమా షేక్‌కు ఓటు ఉంది. ఈమె పేరు, ఇంటి పేరు, ఫొటోతో సహా పోలింగ్ కేంద్రం నం.81లో ఓటరు సంఖ్య 448, జడ్‌జీఎఫ్ 3963501 కింద, పోలింగ్ కేంద్రం నం.85లో ఓటరు సంఖ్య 123, జడ్‌జీఎఫ్ 3872728 కింద జాబితాలో ఓట్లు ఉన్నాయి. అలాగే షేక్ అమ్రీన్ అనే ఓటరు పేరుతో పోలింగ్ నం.138లోనే రెండు ఓట్లు (జడ్‌జీఎఫ్ 4114252, 3712908) నమోదయ్యాయి. ఇలా ఒకటీ, రెండు కాదు 6,700కు పైగా డబుల్ ఎంట్రీలు ఉన్నట్లు గుర్తించారు.

క్యాడర్‌ను వదిలేశాం!

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం వారు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... "క్యాడర్‌ను పట్టించుకోలేదని బాహాటంగా అంగీకరించలేం. ఇది పార్టీకి నష్టం. అందువల్ల విఎమ్మెల్ని ప్రత్యేకంగా పిలిపించుకుని వ్యక్తిగతంగా చెబుతున్నాం. ఈసారి అధికారంలోనికి వచ్చాక.. క్యాడర్‌ను ఆదుకుంటాం. వారికే ప్రాధాన్యం ఇస్తాం" అని సజ్జల, వైవీ అన్నట్లు తెలిసింది.

ఇదేమి చోద్యం...

తాతకు దగ్గులు నేర్పినట్లు, చేపకు ఈత నేర్పాలనుకున్నట్లు... ఒక్కసారి కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేయని సజ్జల, వైవీ తమకు 'రాజకీయ' పాఠాలు చెప్పడంపై ఉత్తరాంధ్ర నేతలు లోలోపలే విసుక్కున్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలతో సమావేశముందని, శనివారం ఉదయాన్నే తాడేపల్లికి రావాలని సీఎంఓ నుంచి శుక్రవారం కబురు వెళ్లింది. నేరుగా ముఖ్యమంత్రి జగన్ తమతో మాట్లాడతారేమోనని ఉత్తరాంధ్ర నేతలు ఉరుకులు పరుగుల మీద శనివారం ఉదయం 11 గంటలకల్లా తాడేపల్లి చేరుకున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి సీదిరి అప్పలరాజు, ఇతర నేతలు దువ్వాడ శ్రీనివాస్, శంబంగి చిన్న అప్పలనాయుడు, వాసుపల్లి గణేశ్, బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పల నరసయ్య, అదీప్‌రాజ్ తదితరులు హాజరయ్యారు. కానీ... సీఎంవోలో ఎమ్మెల్యేలను పట్టించుకునేవారే లేరు. అసలు తమనెందుకు పిలిచారంటూ పలువురు విసుక్కున్నారు. సజ్జల అక్కడే ఉన్నా ఎమ్మెల్యేలెవరినీ పిలిచి మాట్లాడలేదు. చివరకు.. ఒంటి గంటకు వైవీ సుబ్బారెడ్డి వచ్చాక అసలు తంతు మొదలైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... 'ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలను అమలు చేస్తున్నారు? ప్రత్యర్థి బలాబలాలను గుర్తించారా? మీ బలహీనతలు ఏవిఏటి? ఎన్నికల్లో గెలిచేందుకు చేపడుతున్న కార్యక్రమాలేమిటి?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే... టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు చూసి భయపడొద్దని సలహా ఇచ్చారు. "మన నాయకుడు జగన్ బలంగా ఉన్నందునే వాళ్లు ముగ్గురూ కలిశారు. ఆ పొత్తు వల్ల వైసీపీకే లాభం. మనమే గెలుస్తున్నాం. మీరు భయపడకండి" అని ధైర్యం నూరిపోసే ప్రయత్నం చేశారు. ఇక అభ్యర్థుల్లో మార్పులు ఉండవని సజ్జల, వైవీ సుబారెడ్డి ప్రకటించారు. ఇదంతా విన్నాక .. ఈ మాత్రం చెప్పడానికి తమను తాడేపల్లికి రప్పించడం ఎందుకు, సజ్జల, వైవీ విశాఖకు వచ్చి అక్కడే చెప్పొచ్చుకదా అని ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

తమిళ సినీ నిర్మాత జాఫర్ అరెస్టు

» రూ.2 వేల కోట్ల డ్రగ్స్ స్మగ్లింగ్ ఆరోపణలు



చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నిర్మాత జాఫర్ సాధిక్‌ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అరెస్టు చేసింది. ఈ విషయాన్ని ఎన్‌సీబీ జాయింట్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేశ్వర్ సింగ్ శనివారం ఢిల్లీలో మీడియాకు వెల్లడించారు. భారత్ నుంచి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు రూ.2 వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్మగ్లింగ్ చేసినట్టు జాఫర్‌పై ఆరోపణలున్నాయి. డీఎంకే మాజీ నాయకుడైన జాఫర్ గతనెల 15వ తేదీ నుంచి పరారీలో ఉన్నాడని జ్ఞానేశ్వర్ సింగ్ చెప్పారు. తిరువనంతపురం, ముంబై, పుణె, హైదరాబాద్‌ల మీదుగా జైపూర్‌కు పారిపోయాడన్నారు. భారత్-ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మాదకద్రవ్యాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో అతనే కీలక సూత్రధారి అని చెప్పారు. కొబ్బరికాయలు, డ్రైఫ్రూట్స్ ముసుగులో 45 పార్శిళ్లలో మొత్తం 3,500 కిలోల సూడోపెడ్రిన్‌ను ఆస్ట్రేలియాకు పంపించాడన్నారు. ఇదే కేసులో గత నెల 25వ తేదీన ముగ్గురిని అరెస్టు చేసినట్టు చెప్పారు. కాగా, అధికార పార్టీ డీఎంకే తమిళనాడును భారతదేశ మాదకద్రవ్యాల రాజధానిగా మార్చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మండిపడ్డారు. డీఎంకే నేతల ఇళ్లు, ఆఫీసుల్లో ఎన్‌సీబీ సోదాలు చేస్తోందని చెప్పారు.

రామేశ్వరం కేఫ్ నిందితుడి ఫొటోలు విడుదల



బెంగళూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కేఫ్ బాంబుపేలుళ్ల కేసులో నిందితుడి ఫొటోలను ఎన్ఐఏ శనివారం విడుదల చేసింది. అతని ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరింది. అతని కోసం ఎన్ఐఏ బృందాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. బళ్లారిలో తిరిగినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించిన అధికారులు మూడు రోజులుగా బళ్లారి ప్రాంతంలో మకాం వేసి గాలిస్తున్నారు. బళ్లారి జైలులో ఉన్న అనుమానిత ఉగ్రవాదులను వారెంట్ ద్వారా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడు బళ్లారిలో సంచరించిన ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా సేకరించిన ఫొటోలను విడుదల చేశారు. నిందితుడి సమాచారం తెలిస్తే 080 29510900, 8904241100 లేదా info.blr.nia@gov.in కు మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఎన్ఐఏ అధికారులు కోరారు.

ఈసీలో కలకలం

(మొదటి పేజీ తరువాయి)



అరుణ్ గోయల్

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రమే మిగిలారు. ఇద్దరు కమిషనర్లలో ఒకరైన అనూప్‌చంద్ర పాండే గత నెలలో రిటైరయ్యారు. అరుణ్ గోయల్ పదవీ కాలం 2027 డిసెంబరు 5వ తేదీ వరకు ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సీఈసీ రాజీవ్ కుమార్ పదవీ విరమణ చేసిన తర్వాత ఆ పదవిని అరుణ్ గోయల్ చేపట్టే అవకాశం కూడా ఉంది. కానీ, ఆయన హఠాత్తుగా రాజీనామా చేయటం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఆయన రాజీనామాకు గల కారణాలేమిటో వెల్లడి కాలేదు. 2022 నవంబరులో ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్ నియామకం కూడా వివాదాస్పదమైంది. 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన అరుణ్ గోయల్ కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. రిటైర్మెంట్‌కు కేవలం ఆరు వారాల వ్యవధి మిగిలి ఉండగా.. 2022 నవంబరు 18న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆ మరుసటి రోజే ఆయనను కేంద్రప్రభుత్వం ఎన్నికల కమిషనర్‌గా నియమించింది. దీనిని వ్యతిరేకిస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ.. ప్రభుత్వం మెరుపువేగంతో గోయల్ నియామకానికి ఆమోదం తెలపటాన్ని విచారణ సందర్భంగా ప్రశ్నించింది. ఈ విధంగా అరుణ్ గోయల్ నియామకం పెద్ద వివాదమే సృష్టించింది. ఇప్పుడు ఆయన హఠాత్ రాజీనామా కూడా పలు ప్రశ్నలు రేకెత్తిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈసీలో ఖాళీల నేపథ్యంలో కొత్త కమిషనర్ల నియామకానికి కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 2020 ఆగస్టులోనూ అప్పటి ఎన్నికల సంఘం కమిషనర్లలో ఒకరైన అశోక్ లావాసా తన పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన పలు కేసుల్లో ఈసీ తీసుకున్న నిర్ణయాలను ఆయన వ్యతిరేకించారు. ముఖ్యంగా, మోదీ, అమిత్‌షాల కోడ్ ఉల్లంఘనలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం.

తొలుత ఈసీలో సీఈసీ ఒక్కరే!

చాలాకాలంపాటు ఎన్నికల సంఘంలో ప్రధాన కమిషనర్ (సీఈసీ) ఒక్కరే ఉండేవారు. 1989 అక్టోబరు 16న తొలిసారిగా ఇద్దరు అదనపు కమిషనర్లను తొలిసారిగా నియమించారు. వారు మరుసటి ఏడాది జనవరి 1వ తేదీ వరకే పదవిలో ఉన్నారు. ఆ తర్వాత 1993 అక్టోబరు 1న ఇద్దరు అదనపు కమిషనర్లను నియమించారు. అప్పటి నుంచీ సీఈసీతోపాటు ఇద్దరు కమిషనర్లు నియమితులవుతున్నారు. ఏకాభిప్రాయం సాధ్యం కానప్పుడు మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు ఈసీలో తీసుకుంటున్నారు.

తీవ్ర ఆందోళన కలిగిస్తోంది..: టీఎంసీ

లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ రాజీనామా చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై కచ్చితంగా వివరణ ఇవ్వాల్సిందేనని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత లేదని స్పష్టమవుతోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ప్రభుత్వ ఒత్తిడులతో రాజ్యాంగ బద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘం (ఈసీఐ) పని తీరు ప్రశ్నార్థకమవుతోందన్నారు. '2019 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడినా క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని అశోక్ లావాసా వ్యతిరేకించారు. దీంతో ఆయన ఎన్నో విచారణలను ఎదుర్కోవాల్సి వచ్చింది' అని వేణుగోపాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. అరుణ్ గోయెల్ రాజీనామాతో ఎదురయ్యే పరిస్థితులు చాలా ఆందోళన కలిగిస్తున్నాయని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ సాకేత్ గోఖలే అన్నారు.

కమిషనర్ల నియామకం ఎలా జరుగుతుంది?

భారత రాజ్యాంగంలోని 324 నుంచి 329 అధికరణలు ఎన్నికల సంఘం సభ్యుల నియామకం, జీతభత్యాలు, కాలపరిమితి, విధులను తెలియజేస్తున్నాయి. ఆర్టికల్ 324(2) అధికరణలో సభ్యుల నియామకాన్ని రాష్ట్రపతి చేపడతారని పేర్కొంటూనే.. పార్లమెంటు ఏదైనా చట్టాన్ని చేస్తే.. దాని ప్రకారం నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. అయితే.. రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి గత ఏడాది వరకు కేంద్ర ప్రభుత్వం విచక్షణ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలు జరిగేవి. సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం గతేడాది 'ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ అపాయింట్‌మెంట్ యాక్ట్-2023' చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం.. తొలుత కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు కేంద్ర కార్యదర్శులతో సెర్చ్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ ఐదుగురి పేర్లను సెలక్షన్ కమిటీకి పంపాలి. సెలక్షన్ కమిటీకి ప్రధాని చైర్మన్‌గా ఉంటారు. లోక్‌సభలో విపక్ష నేత, ప్రధాని సూచించే కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. సెలక్షన్ కమిటీకి కొన్ని విచక్షణాధికారాలుంటాయి. సెర్చ్ కమిటీ పరిగణనలోకి తీసుకోని పేర్లను సైతం అవసరమనుకుంటే సెలక్షన్ కమిటీ పరిశీలించవచ్చు. సెలక్షన్ కమిటీ పంపే పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తారు. సీఈసీ, కమిషనర్లు ఆరేళ్లపాటు లేదా 65 ఏళ్ల వరకూ పదవిలో ఉంటారు.

14-16 తేదీల మధ్య లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్!

న్యూఢిల్లీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 14-16 తేదీల మధ్యన ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. అదే సమయంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలను కూడా ప్రకటించనున్నారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) సోమవారం నుంచి బుధవారం వరకు జమ్మూ కశ్మీర్‌లో పర్యటించనుంది. అక్కడ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించగలమనేది మూడు రోజుల పర్యటనలో అంచనా వేయనుంది. తర్వాత ఒకటి రెండు రోజుల్లో లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటించవచ్చని తెలిసింది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాది సెప్టెంబరు లోపు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అలాగే అక్కడ అసెంబ్లీ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో పాటు నిర్వహించగలిగే అవకాశం ఉందేమో అంచనా వేయాలని కేంద్ర ప్రభుత్వం ఈసీని కోరింది. మరోపక్క, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో పోలింగ్ జరిగే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, లోక్‌సభ ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే కోడ్ అమలులోకి వస్తుంది.



చెక్ రిపబ్లిక్ దేశానికి చెందిన క్రిస్టినా పిస్కోవా ఈ ఏడాదికి గాను ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకున్నారు. ముంబైలో జరిగిన 71వ ప్రపంచ సుందరి పోటీల్లో ఆమె విజేతగా నిలిచారు. కాగా, టాప్10 లో భారత దేశం నుంచి సినీ శెట్టి చోటు సాధించారు.

ఏపీటీడీసీ ఆస్తుల తాకట్టు!

రూ.150 కోట్లకు ప్రైవేటు బ్యాంకుల్లో తనఖా

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆస్తులను గుట్టుచప్పుడు కాకుండా తాకట్టు పెట్టేశారు. జాతీయ బ్యాంకులు కాకుండా ప్రైవేటు బ్యాంకుల్లో వీటిని తనఖా పెట్టినట్టు తెలిసింది. పర్యాటక యూనిట్లను తాకట్టు పెట్టడానికి జగన్ ప్రభుత్వం సిద్ధమైన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందుగానే వెలుగులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన విజయవాడ డివిజన్ పరిధిలో భవానీ ఐల్యాండ్‌తో పాటు, హరిత బెర్మ్‌పార్క్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు పర్యాటక యూనిట్లను తనఖా పెట్టిన సంస్థ ఉన్నతాధికారులు రూ.150 కోట్ల రుణం తీసుకున్నారు. మంజూరైన రుణం ఏపీటీడీసీ ఖాతాలో జమ అయినట్లు తెలుస్తోంది. అప్పుగా తీసుకున్న నిధుల్లో కొంత మొత్తాన్ని పర్యాటక యూనిట్లలోని కాటేజీలు, రెస్టారెంట్లు తదితరాలను ఆధునీకరించటానికి ఏపీటీడీసీ టెండర్లు పిలిచింది. విచిత్రమేమిటంటే.. ఈ యూనిట్లన్నింటినీ ప్రైవేటు పరం చేయటానికి ఇప్పటికే టెండర్లు పిలిచారు. పర్యాటక యూనిట్లకు వస్తున్న ఆదాయంలో కేవలం పావు వంతుకే ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడానికి సిద్ధపడటం తీవ్ర వివాదానికి దారితీసింది. ముందుగానే ప్రైవేటు సంస్థలను ఎంపిక చేసుకోవటం చూస్తే వాటిలో ఉన్నతాధికారులకు వాటాలు ఇచ్చేలా చీకటి ఒప్పందాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. పర్యాటక యూనిట్లను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టినపుడు ఆధునీకరణ, నిర్వహణ కార్యకలాపాలను ఆ సంస్థలే చేపట్టాల్సి ఉంటుంది. అయితే వాటికోసం ఏపీటీడీసీ అప్పులు చేసి మరీ ఖర్చు చేయడమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పర్యాటక యూనిట్ల కోసం పైసా ఖర్చు పెట్టకుండా వాటి ఆదాయాన్ని దెబ్బతీయటంలోనూ ప్రైవేటు కుట్ర కోణం ఉందని తెలుస్తోంది. ఈ అంశాలన్నింటినీ అడ్డంపెట్టుకుని ప్రైవేటీకరణకు టెండర్లు పిలిచిన ఏపీటీడీసీ ఉన్నతాధికారులు.. ఆయా సంస్థల్లో ఆధునీకరించిన ఆస్తులను ప్రైవేటు చేతిలో పెట్టేందుకు రూ.150కోట్ల అప్పులకు కూడా సిద్ధపడ్డారు.

ఎన్నికల వేళ.. అడ్డగోలు పదోన్నతులు

» సహకారశాఖలో 30మందికి అడ్‌హాక్ ప్రమోషన్లు

అమరావతి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకారశాఖలో అనేక మందికి అడ్డగోలుగా పదోన్నతులిచ్చారు. ఉన్నతాధికారులు సైతం నిబంధనల్ని పక్కనబెట్టి పదోన్నతులు, పోస్టింగ్‌లు ఇచ్చేశారు. తాజాగా 30మంది డిప్యూటీ రిజిస్ట్రార్లను స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్లుగా అడ్‌హాక్ ప్రమోషన్లు కల్పించారు. ఈ స్టేట్ క్యాడర్ పోస్టులకు రోస్టర్ పాయింట్లు, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, గ్రీవెన్స్, కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకోకుండా, కేవలం డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారం పదోన్నతులిచ్చేశారు. ఎన్నికల వేళ అడ్డగోలుగా పదోన్నతులివ్వడంలో ఓ ఉన్నతాధికారి, ఓ మంత్రి చేతులు తడిచాయన్న ప్రచారం జరుగుతోంది. అక్రమ పదోన్నతులకు రంగం సిద్ధమైందని గతనెల 27న 'సహకార శాఖలో పదోన్నతుల రగడ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం వచ్చినా.. ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించి, పదోన్నతులకు పచ్చజెండా ఊపారు. ఈ శాఖలో 114 డిప్యూటీ రిజిస్ట్రార్లు ఉండగా, 30మందికి మాత్రమే స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్లుగా అడ్‌హాక్ ప్రమోషన్లు ఇచ్చారు. ఈ నెల 6న విడివిడిగా ఇచ్చిన జీవోల్ని రహస్యంగా ఉంచి, 7న వ్యక్తిగతంగా అందజేశారు. దీంతో వారంతా 8న కేటాయించిన పోస్టుల్లో జాయిన్ అయ్యారు. ఇందులో 22 మందిని జిల్లా సహకార అధికారులుగా నియమించగా, మిగతా వారిని హెడ్‌వోడీ, ట్రిబ్యునల్, సీఎంవో, గిరిజన కోపరేటివ్ సొసైటీ, ఐసీడీఎస్‌లలో నియమించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ల పదోన్నతుల సీనియారిటీ జాబితా లోపభూయిష్ఠంగా ఉందని ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అర్హతలున్నా.. పదోన్నతుల జాబితాలోకి రాని కొందరు ఉద్యోగులు ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారు.

జగన్ జమానాలో జీతాలేవీ?

» పవర్ సెక్టార్ ఉద్యోగుల హాహాకారాలు

అమరావతి, మార్చి 9(అమరావతి): ప్రతినెలా 1న జీతాలు అందుకునే పవర్ సెక్టార్ ఉద్యోగులు ఇప్పుడు 10వ తేదీ వచ్చినా ఖాళీ బ్యాంకు ఖాతాలను చూస్తూ గడిపేయాల్సి వస్తోంది. ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్‌కో డిస్కమ్‌లలో 50వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వారికి జగన్ సర్కారు హయంలో సకాలంలో జీతాలు రావడంలేదు. ఈ నెలలో ఇంతవరకూ జీతభత్యాలు జమచేయకపోవడంతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్తు సంస్థల ఆదాయాలు పెరుగుతున్నాయని సర్కారు చెబుతోంది కానీ సిబ్బందికి జీతాలు మాత్రం సకాలంలో అందడం లేదు. గత ఐదేళ్లుగా విద్యుత్తు సంస్థల ఉద్యోగులకు జీతాల చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనిని నివారించేందుకు జగన్ సర్కారు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జీత భత్యాలు వెంటనే చెల్లించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మోదీ గ్యారంటీకి ఈశాన్యమే సాక్షి

» అరుణాచల్, అసోం పర్యటనలో మోదీ

» అరుణాచల్‌లో బృహత్తర సెలా టన్నెల్, రూ. 55వేల కోట్ల ప్రాజెక్టుల ప్రారంభం

ఈటానగర్, మార్చి 9: ఈశాన్య భారతంలో తాము ఐదేళ్లలో సాధించిన అభివృద్ధిని, కాంగ్రెస్‌కు చేయడానికి ఇరవై ఏళ్లు పట్టేదని ప్రధాని మోదీ అన్నారు. ఈశాన్యంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో శనివారం మోదీ పాల్గొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో రూ. 55,600 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. బృహత్తర సెలా టన్నెల్‌ను ఈటానగర్‌లో జరిగిన కార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. వికసిత్ భారత్- వికసిత్ ఈశాన్యం' పేరిట ఈ కార్యక్రమాలు చేపట్టారు. అసోంలోని గోలాఘాట్‌లోని కజిరంగ జాతీయ పార్కును సందర్శించారు. జోర్హాట్‌లో జరిగిన కార్యక్రమంలో అసోం జాతి యుద్ధవీరుడు కమాండర్ లచిత్ బర్ఫుకాన్ 125 అడుగుల విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. వాణిజ్య పర్యాటకంలో భారత్‌కూ, దక్షిణాసియా, మధ్య అసియాలకూ మధ్య ఈశాన్యం గొప్ప అనుసంధానకర్తగా అవతరించనున్నదని మోదీ అన్నారు. మోదీ గ్యారంటీల అమలు ఏ స్థాయిలో ఉంటుందనేది అరుణాచల్ ప్రదేశ్ సహా ఈశాన్యంలోని ఏ రాష్ట్రాన్నయినా సందర్శించి తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈశాన్యంలో కనిపిస్తున్న ప్రగతి ఎన్డీయే ప్రభుత్వాల్లో జరిగిందేనన్నారు. "సెలా టన్నెల్ కోసం నేను 2019లో శంకుస్థాపన చేసినప్పుడు, చాలామంది దానిని ఒక ఎన్నికల గిమ్మిక్కుగా భావించారు. కానీ, ఐదేళ్లలో ఆ టన్నెల్‌ను పూర్తి చేసి మోదీ గ్యారంటీల అమలు ఎలా ఉంటుందో చూపించాం" అని మోదీ అన్నారు. కాగా, అసోం యుద్ధవీరుడు లచిత్ స్మృత్యర్థం జోర్హాట్‌లో తలపెట్టిన లచిత్ బర్ఫుకాన్ మైదాన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు 2022లో అప్పటి రాష్ట్రపతి కోవింద్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే 125 అడుగుల లచిత్ విగ్రహాన్ని మోదీ శనివారం ఆవిష్కరించారు.

'కజీరంగా'లో మోదీ సఫారీ



అసోం రాష్ట్రంలోని కజిరంగా నేషనల్ పార్క్, టైగర్ రిజర్వులను ప్రధాని మోదీ శనివారం సందర్శించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన ప్రాంతాన్ని ఆయన సందర్శించడం ఇదే తొలి సారి. రెండు గంటల సుదీర్ఘ పర్యటనలో ఏనుగు, జీపు సఫారీలను మోదీ ఆస్వాదించారు. ఇక్కడి కొహోరా రేంజ్‌లో ఉన్న మిహిముఖ్ ప్రాంతంలో ఆయన మొదట ఏనుగు సఫారీ చేశారు. అటవీ ప్రాంతంలో సంచరించడానికి అనువైన దుస్తులు (జాకెట్, టోపీ) ధరించిన ప్రధాని..నిపుణుడైన మావటి పర్యవేక్షణలో ప్రద్యుమ్న అనే ఏనుగుపై విహరించారు. మరో 16 ఏనుగుల పరివారం ఆయన్ను అనుసరించింది. ఈ సందర్భంగా లఖిమై, ప్రద్యుమ్న, ఫూల్‌మై ఏనుగులకు ఆయన స్వయంగా చెరుకు గడలు తినిపించారు. అనంతరం జీపు సఫారీ చేసిన మోదీ.. దఫ్లాంగ్ వాచ్‌టవర్ వద్ద కాసేపు ఆగి, అభయారణ్యంలోని దృశ్యాలను వీక్షించారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ మహిళా ఫారెస్టు గార్డుల బృందం 'వన దుర్గా' సభ్యులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. వన దుర్గా బృందం అంకితభావాన్ని ఆయన కొనియాడారు.

హిమాచల్ సంక్షోభంలో మరో మలుపు!

రిషికేశ్, మార్చి 9: కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం మరో మలుపు తిరిగింది. ఆ రాష్ట్రానికి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు శనివారం బీజేపీ పాలిత ఉత్తరాఖండ్ చేరుకున్నారు. వీరిలో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా ఓ ప్రత్యేక విమానంలో హరియాణాలోని పంచ్‌కుల నుంచి బయల్దేరి శుక్రవారం రాత్రి రిషికేశ్ చేరుకున్నారు. స్థానికంగా ఉన్న హోటల్ తాజ్‌లో బస చేశారు. ఎదరు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. గత నెలలో రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీకి కాకుండా బీజేపీకి ఓటు వేశారు. కాంగ్రెస్‌కు తగినంత సంఖ్యాబలం ఉన్నప్పటికీ క్రాస్ ఓటింగ్ ఫలితంగా సింఘ్వీ ఆ ఎన్నికలో ఓటమి పాలయ్యారు. పార్టీ విప్‌ను ధిక్కరించినందుకు ఆ ఆరుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. స్పీకర్ నిర్ణయాన్ని వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. కాగా, ఎమ్మెల్యేలు ఉత్తరాఖండ్‌కు తరలి వెళ్లటంపై హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ నేత శాంతిప్రసాద్ భట్ స్పందిస్తూ.. బీజేపీ రాజ్యాంగపరమైన తప్పిదాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఉన్న కేంద్ర సహాయమంత్రి బీఎల్ వర్మ మీడియాతో మాట్లాడుతూ, సుఖు ప్రభుత్వం త్వరలోనే కూలుతుందని వ్యాఖ్యానించారు. 68 సీట్ల హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు(ఆరుగురు అనర్హులను పక్కనపెడితే) 34 మంది ఎమ్మెల్యేలు ఉండగా బీజేపీ బలం 25 మంది ఎమ్మెల్యేలు.

13వేల అడుగుల ఎత్తులో... 2 వరుసల్లో!



న్యూఢిల్లీ, మార్చి 9: అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్మించిన సెలా టన్నెల్‌ను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపొడవైన 2 వరుసల టన్నెల్‌గా ఇది. సముద్రమట్టానికి దాదాపు 13వేల అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ టన్నెల్.. చైనా సరిహద్దుల్లోని తవాంగ్ ప్రాంతానికి ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా అనుసంధానం కల్పించడమే లక్ష్యంగా నిర్మించారు. రూ.825 కోట్ల అంచనా వ్యయంతో 2019 ఫిబ్రవరిలో మోదీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కొవిడ్-19తోపాటు వివిధ కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన సెలా టన్నెల్‌లో రెండు సొరంగాలు, 8.780 కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డు ఉన్నాయి. సొరంగాలు, అప్రోచ్ రోడ్లు, లింక్ రోడ్లతో సహా ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు సుమారు 12 కిలోమీటర్లు. రెండు సొరంగాల్లో మొదటిది 980 మీటర్ల పొడవైన సింగిల్ ట్యూబ్ సొరంగం కాగా, రెండోది అత్యవసర సర్వీసుల కోసం ఎస్కేప్ ట్యూబ్‌తో 1.5 కిలోమీటర్ల పొడవుతో ఉంటుంది. అసోంలోని తేజ్‌పూర్ నుంచి తవాంగ్‌ను కలిపే రహదారిపై ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఈ టన్నెల్ అందుబాటులోకి రావడంతో ఇకపై ఏడాది పొడవునా చైనా సరిహద్దులకు భారత బలగాలను, ఆయుధ సామగ్రిని తరలించడానికి వీలవుతుంది. తవాంగ్ ప్రాంతానికి సామాజిక, ఆర్థిక శ్రేయస్సు కల్పించే కొత్త శకానికి సెలా టన్నెల్ నాంది పలుకుతుందని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) సీనియర్ అధికారి ఒకరు ఆశాభావం వ్యక్తం చేశారు. వాణిజ్యం, పర్యాటక రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచుతుందన్నారు. గతంలో సెలా పాస్‌కు వెళ్లే మార్గం సింగిల్ లేన్ కనెక్టివిటీతో ప్రమాదకరమైన మలుపులు ఉండటంతో భారీ వాహనాలు, కంటైనర్ ట్రక్కులు తవాంగ్ వరకూ చేరుకోవడం కష్టమయ్యేదన్నారు. కాగా ఈ బృహత్తర ప్రాజెక్టును పూర్తి చేయడానికి 90లక్షలకు పైగా పని గంటలు పట్టింది. రోజూ సగటున 650 మంది సిబ్బంది, కార్మికులు ఐదేళ్లు పని చేశారు. దీని నిర్మాణంలో 71వేల టన్నుల సిమెంట్, 5 వేల టన్నుల స్టీల్, 800 టన్నుల పేలుడు పదార్థాలు వాడారు. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో రోజుకు 3వేల కార్లు, 2వేల ట్రక్కులు ప్రయాణించడానికి వీలుగా ఈ సొరంగాన్ని సిద్ధం చేశారు. కాగా చైనా, భారత్ మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో సెలా పాస్‌ను ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గనులపై డ్రోన్ నజర్!

» నిగ్గు తేల్చనున్న కేంద్ర కమిటీ.. ఇరు రాష్ట్రాలకూ సీఈసీ లేఖలు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం అటవీ ప్రాంతంలోని గనుల హద్దులను వెంటనే తేల్చాలని కేంద్ర సాధికారిక కమిటీ(సీఈసీ) నిర్ణయించింది. ఈ మేరకు సరిహద్దు ప్రాంతంలోని గనుల వాస్తవిక విస్తీర్ణం, తాజా పరిస్థితి, ఇతర అంశాలపై ఏపీ, కర్ణాటకతోపాటు కేంద్ర ఏజెన్సీలతో జాయింట్ సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. తొలుత సరిహద్దులో ఉన్న ఏడు బీ1 కేటగిరీ గనులపై రెండు రాష్ట్రాల అధికారుల సమక్షంలో డ్రోన్‌సర్వే చేయించాలని నిర్ణయించారు. ఇదే విషయంపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు సాధికారిక కమిటీ సభ్యకార్యదర్శి జి. భానుమతి తాజాగా లేఖ రాశారు. దీని వల్ల రెండు కీలకమైన అంశాలు బయటకొస్తాయని సీఈసీ భావిస్తోంది. ఓబుళాపురం గనుల కేసు తెరమీదికి వచ్చేనాటికి ఉన్న గనుల పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ఇందుకోసం రెండు రాష్ట్రాలు తమ సరిహద్దుల్లోని గనుల స్కెచ్‌లు, డాక్యుమెంట్లు వెంటనే సాధికారిక కమిటీకి అందించాలని ఆదేశించారు. జాయింట్ సర్వేకు సీనియర్ జియాలజిస్టులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాదు, ఈ సర్వేకు 2011లో రూపొందించిన విధివిధానాలనే పాటించాలని కమిటీ నిర్ణయించినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ సర్వే ఫలితాలను సుప్రీంకోర్టుకు నివేదించనున్నారు. అయితే, జాయింట్ సర్వేకు సంబంధించి తేదీని ఖరారు చేయాల్సి ఉంది.

ట్రెక్కింగ్‌కు వెళ్లి ఆస్ట్రేలియాలో ఆంధ్రా డాక్టర్ మృతి

» మృతురాలు కృష్ణాజిల్లా వాసి

బ్రిస్బేన్, మార్చి 9: ఏపీకి చెందిన యువ డాక్టర్ వేమూరు ఉజ్వల(23) ఆస్ట్రేలియాలో ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆమె కృష్ణాజిల్లా వాసి. ఉజ్వల తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, మైథిలి ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. ఉజ్వల ప్రస్తుతం బ్రిస్బేన్‌లోని రాయల్ బ్రిస్బేన్ అండ్ ఉమెన్స్ ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె స్నేహితులతో కలిసి గోల్డ్ కోస్ట్ హింటర్లాండ్‌లోని లామింగ్టన్ పార్కులో యంబకూచి జలపాతం వద్ద ట్రెక్కింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు చేతిలోని కెమెరా జారి పడిపోయింది. దాన్నితీసే క్రమంలో 20 మీటర్ల లోతైన లోయలో ఆమె పడిపోయారు. అధికారులు 6 గంటలపాటు శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఎలుకపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అక్రమం.. సక్రమమైందా..?

● రాత్రికి రాత్రి షట్టర్‌లు ఏర్పాటు చేసిన వివాదాస్పద స్థలంలో అక్రమ నిర్మాణం

● ఆరోపణలు రావడంతో ఆగస్టులో నిలుపుదల ● ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన పనులు ● వెలంపల్లి, మేయర్ పాత్రపై అనుమానాలు

సామాన్యుడు ఇంటిపై చిన్నపాటి రేకులు వేసుకుంటే నానా హడావుడి చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులకు మధురానగర్ ఫ్లై ఓవర్ పక్కన పట్టపగలే భారీ నిర్మాణం జరుగుతుంటే పట్టించుకోకపోవడం వెనుక రాజకీయ కోణం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అక్రమ నిర్మాణం వెనుక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనువాసరావు, మేయర్ పాత్ర ఉన్నట్టు పలువురు చెబుతున్నారు.



ఇరిగేషన్ స్థలంలో నిర్మితమవుతున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్

విజయవాడ, మార్చి 9: గత ఏడాది ఆగస్టులో అక్రమ నిర్మాణమని అధికారులు ఆపేసిన చోట మళ్లీ అదే నిర్మాణం యుద్ధ ప్రాతిపాదికన జరుగుతున్నా కనీసం కన్నెత్తి చూడటం లేదు. మధురానగర్ ఫ్లై ఓవర్ పక్కన 31వ డివిజన్ పరిధిలోకి వచ్చే ప్రాంతంలో సర్వీస్ రోడ్డుకు అనుకుని ఈ స్థలం ఉంది. దీనికి డాక్యుమెంట్లు కూడా లేవని సమాచారం. అయితే ఈ స్థలం గతంలో అధీనంలో ఉన్నవారి నుంచి పాత తుక్కు వ్యాపారం చేసేవారు తీసుకుని మొదట్లో వాటర్ ప్లాంట్ అని తరువాత కూరగాయల కొట్లు అన్నారు. చివరకు 6 షట్టర్లతో షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నారు.

రూ.కోట్ల విలువైన స్థలంలో అన్నీ ఆక్రమణలే

వాస్తవానికి మధురానగర్‌లో కాల్వ ఒడ్డున ఇరిగేషన్ స్థలం ఉంది. ఇందులో కొందరు పేదలు ఇళ్లు వేసుకుని ఉండేవారు. వారికి వేరేచోట ఇళ్లు ఇచ్చి ఖాళీ చేయించారు. ఆ స్థలంలో ప్రజా ప్రయోజనాలకు వాడే నిమిత్తం విద్యుత్ సబ్ స్టేషన్, మంచినీటి రిజర్వాయర్లు, ఇరిగేషన్ గెస్టుహౌస్ నిర్మించారు. మిగిలిన స్థలంలో పైపులు తయారీ కంపెనీ ఉండేది. దాదాపు 2 దశాబ్దాల క్రితం వరకు ఉన్న ఆ కంపెనీ మూతపడింది. దీంతో ఈ స్థలంపై కొందరు నేతల కళ్లు పడ్డాయి. వంతుల వారీగా పంచుకుని లీజుకిచ్చేశారు. అలా ఇచ్చిన స్థలాల్లో ఇదొకటి. ఇరిగేషన్, కార్పొరేషన్ అధికారులు సర్వే చేయిస్తే అసలు విషయం తెలుస్తుంది.

లీజుదారుల కుటుంబంలో ఒకరు విదేశాల్లో ఉంటారు. వారి కుటుంబ సభ్యులు ఇక్కడ పర్యవేక్షిస్తుంటారు. ఇలా పర్యవేక్షించే వారి నుంచి స్థలం దక్కించుకున్నవారు ఈ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారు. ఇంత పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుంటే డాక్యుమెంట్లు లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారన్నదే ప్రశ్న. గత ఏడాది ఆగస్టులో మీడియాలో వార్తా కథనాలు రావడంతో అధికారులు వచ్చి నిర్మాణం ఆపేశారు. ఇపుడు అదే నిర్మాణం తిరిగి ప్రారంభమైంది. నిర్మాణం చేస్తున్న వ్యక్తులు తమ సామాజికవర్గ ఓట్లున్నాయని చూపించి ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ నుంచి అభయం పొందారని గుసగుసలు వినిపిస్తున్నాయి.





వైసీపీ నేతలు వలంటీర్లకు పంపిణీ చేసిన వాచ్‌లు

వలంటీర్లకు వాచ్‌లు

ఇళ్ల పట్టాల మాటున సమావేశం.. ఓట్లు వేయించాలంటూ నజరానాలు

వన్‌టౌన్, మార్చి 9: వచ్చే ఎన్నికల్లో అధికార వైసీపీని మరోసారి గెలిపించాలని కోరుతూ వలంటీర్లకు వైసీపీ నేతలు నజరానాలు ఇస్తున్నారు. పట్టాల రిజిస్ట్రేషన్ పేరిట భవానీపురంలో శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో పశ్చిమకు చెందిన కొన్ని డివిజన్ల వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. 45, 46, 47, 51, 52వ డివిజన్ల వలంటీర్లు పాల్గొన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త షేక్ ఆ సిఫ్ సహా పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. వచ్చేఎన్నికల్లో మళ్లీ పార్టీని అధికారంలోకి తేవాలని నేతలు కోరారు. ఈ సందర్భంగా ఓటర్లతో ఓటు వేయించే బాధ్యత వలంటీర్లదేనన్న రీతిలో ప్రసంగాలు కొనసాగాయి. అనంతరం వారికి వాచీలు నజరానాగా ఇచ్చారు.

ఆదివాసీల హక్కులపై ప్రభుత్వాల కుట్ర

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ధర్నాచౌక్, మార్చి 9: ఆదివాసీల హక్కులు కాపాడటంలో, జీవో 3పై ఆర్డినెన్స్ తెచ్చి స్పెషల్ డీఎస్సీ నిర్వహించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, ఆదివాసీ హక్కులు కాపాడాలని వారికి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివాసీ జనరక్షణ దీక్ష స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, భూమిని అదానీకి కట్టబెడుతూ ఆదివాసీలను షెడ్యూల్ ప్రాంతాల నుంచి తరిమివేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తాము చేస్తున్న దీక్ష ఆదివాసీ ప్రజలు చేస్తున్న పోరాటానికి సంఘీభావమన్నారు. ఇప్పటికే తమ పార్టీ ఆధ్వర్యంలో మన్యం, ఏజెన్సీలో రెండు రోజుల పాటు దీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. అరకు పార్లమెంట్ అంతా 5వ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ అక్కడ అదివాసీల హక్కులను కేంద్రం హరిస్తోందన్నారు. వారిని బలవంతంగా తరిమివేసి సహజ వనరులు, మైనింగ్, అటవీ సంపదను అదానీకి అప్పగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ డీఎస్సీ పెట్టాలని కోరుతున్నా చేయడం లేదన్నారు. నా ఎస్సీ, ఎస్టీలంటూ దీర్ఘాలు తీసే సీఎం జగన్ వారు దీర్ఘకాలం బాగుపడే చర్యలు తీసుకోవాలన్నారు. 2006 అటవీ సంరక్షణ చట్టం ప్రకారం ఐదేళ్లలో ఎన్ని పోడు భూములకు పట్టాలిచ్చారని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, వై. వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీఐటీయూ నేత దయా రమాదేవి, వ్యవసాయ సంఘం నేత వై.కేశవ రావు, విద్యార్థి యువజన సంఘాల నేతలు జి.రామన్న, కె.ప్రసన్నకుమార్ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

పౌర హక్కులను కాపాడాలి

● ప్రొఫెసర్ ఖాసిం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసిం

గవర్నరుపేట, మార్చి 9: దేశపౌరులపై ఉప చట్టాన్ని ప్రయోగించడం దారుణమని ప్రొఫెసర్ ఖాసిం ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శనివారం ఆలిండియా లాయర్స్ యూనియన్ అధ్వర్యంలో పౌర హక్కులపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖాసిం మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబాను అకారణంగా అరెస్టు చేయడం, గత పదేళ్ల జైలు జీవితాన్ని గడిపేలా చేస్తున్న ప్రభుత్వాలు కోర్టుతీర్పుతో ఆయనకు రాబోవు జీవితకాలం నష్టపరిహారాన్ని ఇవ్వగలవా అని ప్రశ్నించారు. ఆయన్ను అరెస్టు చేయించిన ప్రభుత్వాలు దీనికి సమాధానం చెప్పాలని మండిపడ్డారు. తాను కూడా బాధితుడేనని గుర్తుచేశారు. ఈనాడు ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని అనుసరించి పరిపాలిస్తున్నాయా లేదా అని జనం ఆలోచించాలన్నారు. శరీరం పూర్తిగా కోల్పోయి పోలియోతో బాధపడుతున్న సాయిబాబాను ఈ రాజ్యాంగాన్ని కూల్చివేస్తున్నాడనే నెపంతో జైలులో పెట్టిన తర్వాత న్యాయవ్యవస్థ ఎంత తొందరగా స్పందించి సుప్రీంకోర్టులో స్టే ఇచ్చిందో ప్రజలందరూ గమనించారని గుర్తు చేశారు. దీనివల్ల న్యాయవ్యవస్థ సామాన్యుడికి న్యాయం చేయగలుగుతుందా లేదా అనే సందేహం తలెత్తుతుందన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సాయిబాబా కేసు మనకి క్రిమినల్ జస్టిస్‌లో చాలా సవాళ్లను మన ముందు ఉంచుతుందన్నారు. తిరుమల జస్టిస్ సిస్టం ప్రమాదంలో ఉండడానికి ప్రత్యక్ష నిదర్శనం సాయిబాబా కేసన్నారు. ఆయన విడుదల వరకు జరిగిన న్యాయస్థానాల తీర్పుల తీరుతెన్నులు చూస్తే క్రిమినల్ జస్టిస్ ఎంత ప్రమాదంలో ఉందో అర్థమవుతోందన్నారు. దేశంలో పౌరులకు ఇవ్వాల్సిన కనీస హక్కులను ఉల్లంఘించి వాళ్లను శిక్షించడానికి చట్టాలను మరింత పదును చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలిండియా లాయర్స్ యూనియన్ సభ్యులు నర్రా శ్రీనివాసరావు, కేవీవీ పరమేశ్వరరావు, ప్రభాకర్, ఎఎస్ఎస్ రాం ప్రసాద్, ఆలూరి సుధాకరరావు, సంపర శ్రీనివాసరావు, ఎడవల్లి రమేష్, వి.రాజారత్నం, సుబ్రహ్మణ్యం, ఆవుల వెంకట్రావు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి పాల్గొన్నారు.



దుర్గమ్మ దర్శనానికి వచ్చిన నందమూరి వసుంధరతో టీడీపీ నేతలు

దుర్గమ్మ సన్నిధిలో బాలకృష్ణ సతీమణి

వన్‌టౌన్,మార్చి 9: హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. ఆమెకు బుద్దా వెంకన్న అల్లుడు కాండ్రేగుల రవీంద్ర, జగదీశ్వరి సాదర స్వాగతం పలికారు. కాండ్రేగుల అప్పారావు, దంగేటి శివరాం ప్రసాద్, బోకం సత్తిబాబు, పాయల్ రాజు, నక్కుర్తి మహేష్, రాజేష్, దేవాసి జితేంద్ర,బొమ్మిడి రాము, ఎస్ భాస్కర్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.



పతకాలను సాధించిన పవర్‌లిఫ్టర్లతో కళాశాల యాజమాన్యం

పవర్‌లిఫ్టింగ్‌లో సిద్ధార్థ విద్యార్థుల సత్తా

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 9: మైలవరం లక్కిరెడ్డి హనిమరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా పవర్‌లిఫ్టింగ్‌లో మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పతకాలతో సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. మహిళా కేటగిరి 84ప్లస్ కిలోల్లో ఎన్.మణి శ్రావణి (స్వర్ణం), జె.శిరీష (రజతం)ను, పురుషుల విభాగంలో 93కిలోల సబ్ జూనియర్‌లో ఎం.సూర్య జనార్థన (కాంస్యం), 103 కిలోల విభాగంలో జె.జయవర్థన్ (కాంస్యం), 74కిలోల విభాగంలో జి.భాను భరత్ (స్వర్ణం), 83 కిలోల విభాగంలో జి.నాగేశ్వరరావు (స్వర్ణం) వశం చేసుకున్నారు. కళాశాలలో శనివారం జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ సహా కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ ఎ.చినబాబు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని పవర్ లిఫ్టర్లను అభినందించారు.



బాలికా విద్యకు

కోరమాండల్ ప్రోత్సాహం

గవర్నర్‌పేట, మార్చి 9 : బాలికా విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ స్కాలర్షిప్ అందజేస్తున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఎంబీవీకేలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 126 మందికి రూ.5.28 లక్షల స్కాలర్‌షిప్ అందజేశారు. సంస్థ డీజీఎం సచ్చిదానందరెడ్డి, మేనేజర్లు హరి, మురళీ, శ్రీను, హెచ్.కె. సుధాకర్, గాయత్రి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

● రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు



పంచకర్మ గదిని ప్రారంభిస్తున్న కృష్ణబాబు

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 9: భారతీయ పురాతన వైద్య విధానాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని, గ్రామీణ ప్రాంతంలోని ఆయుర్వేద అసుపత్రి అభివృద్ధికి దాతలు సహకారం అందించడం అభినందనీయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. కానుమోలు ఆయుర్వేద ఆసుపత్రిలో నేషనల్ ఆయుష్ మిషన్ నిధులతో పాటు స్థానిక దాతల సహకారంతో చేసిన అభివృద్ధి పనులు, నూతనంగా నిర్మించిన పంచకర్మ గది, యోగాసెంటర్‌ను ఆయన శనివారం ప్రారంభించి ధన్వంతరి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులు (నేషనల్ ఆయుష్‌మిషన్) రూ.3.5లక్షలతో పాటు దాతలు రూ.5లక్షలు అందజేయడంతో దేశంలోనే మొదటిగా సోలార్‌పవర్‌ను ఏర్పాటు, పంచకర్మ వైద్యం, యోగాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. నేషనల్ ఆయుష్‌మిషన్ కమిషనర్ డాక్టర్ ఎల్.ఎస్.బి. రాజేంద్రకుమార్, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ ఆర్.వెంకటకృష్ణ, ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ వాహిని, సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ, తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్, కానుమోలు పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నాల గణేష్‌బాబు, జన ఆరోగ్య సమితి సభ్యులు శ్రీపతి నరసింహారావు, కొండపల్లి హరిబాబు, వడ్డి సుబ్రహ్మణ్యం, నందూరి శర్మ, నక్కా గాంధీ, నరహరిశెట్టి బాబూరావు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామ టీడీపీ నేతలు

యార్లగడ్డ ఆర్థిక సహాయం

విజయవాడ రూరల్, మార్చి 9: వివిధ కారణాలతో ఆరోగ్య ఇబ్బందులు పడుతున్న పలువురికి టీడీపీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. యార్లగడ్డ ప్రతినిధులుగా అయా కుటుంబాల వద్దకు వెళ్లిన తెలుగుదేశం నేతలు మండల ఉపాధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, సత్యనారాయణ మూడు కుటుంబాలకు సహాయం అందజేసి పరామర్శించారు. అంబాపురం గ్రామానికి చెందిన ఏలూరి నాగరాజు ఇటీవల గుండెపోటుతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న యార్లగడ్డ ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం పంపించారు. గ్రామంలోని సిద్దిల జోతిర్మయి క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందగా ఆమె కుటుంబానికి మరో రూ.10వేలు అందించారు. అలాగే గ్రామంలో ఫించన్ ఆగిపోయి అనారోగ్యంతో బాధడుతున్న కుందేటి చిట్టిబాబుకు రూ.10వేలు అందజేశారు. రాజశేఖర్, కవిలిరాజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారమిస్తే ప్రజారంజక పాలన

● జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ

పటమట, మార్చి 9: టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే చెత్త పన్ను రద్దుతో పాటు ఆస్తిపన్నును, విద్యుత్ చార్జీలను పెంచేది లేదని జడ్పీ మాజీ చైర్మన్ గద్దె అనురాధ అన్నారు. 12వ డివిజన్‌లోని అశోక్‌నగర్, మౌలానా స్ట్రీట్, రఘుగార్డెన్స్ మెయిన్‌రోడ్డులో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శివనాథ్ (చిన్ని), గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజార్టీలతో గెలిపించాని కోరారు. చంద్రబాబు హయాంలో 90శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను, మిగిలిన నిర్మాణపనులను పూర్తి చేసి ఇంతవరకు లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు కలలకు రెక్కలు పేరుతో చంద్రబాబు కొత్తగా ప్రకటించిన పథకం యువతలో పూర్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు బ్యాంకులకు ప్రభుత్వమే ష్యూరిటీగా ఉండి రుణాలను మంజూరు చేయిస్తుందన్నారు. వడ్డీ కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబా, శాయన సత్యనారాయణ, అబ్దుల్ ఖలీల్, నల్లూరి ఉషారాణి, అబూ నయామ్, మాదల చిన్నతల్లి పాల్గొన్నారు.



12వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె అనురాధ

దుర్గగుడి వైదిక కమిటీలో సమన్వయలోపం

● దేవస్థాన ప్రతిష్టకు భంగం కలుగుతుందని వ్యాఖ్య ● పూజలు, ఉత్సవాలు సక్రమంగా జరిగేందుకు అదనంగా శ్రీనివాసశాస్త్రి, ప్రసాద్ నియామకం

వన్‌టౌన్, మార్చి 9: దుర్గగుడిలో ప్రస్తుత వైదిక కమిటీలో సమన్వయ లోపం కారణంగా నిత్య వైదిక కార్యక్రమాలు, ప్రత్యేక పర్వదినాల్లో నిర్వహించే విశిష్ట కార్యక్రమాలు లోపభూయిష్టంగా జరుగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో వైదిక కమిటీకి అదనంగా ఉప ప్రధాన అర్చకుడు కేఎస్‌వీడీఎం ప్రసాద్, ముఖ్య అర్చకుడు రంగావఝ్జుల శ్రీనివాసశాస్త్రిని నియమిస్తూ ఈవో కేఎస్ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన తన ఉత్తర్వుల్లో వైదిక కమిటీ సమన్వయ లోపంతో పనిచేస్తున్నట్టు గమనించానని, దీంతో దేవస్థానం ప్రతిష్టకు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు. దీన్ని సరిచేయాల్సిన అవసరముందన్నారు. దేవాలయంలో పనిచేసే అర్చక, వేదపండితులు, వైదిక కమిటీ సభ్యులు సిబ్బంది అందరూ వైదిక కార్యక్రమాల్లో తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు. మరోవైపు ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. వైదిక కమిటీ సభ్యులు తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కొనసాగుతారని ఈవో స్పష్టం చేశారు. గతంలో శ్రీనివాసశాస్త్రి వైదిక కమిటీలో కొనసాగారు. తరువాత జరిగిన పరిణామాలతో ఆయన్ను తప్పించడంతోపాటు కొత్త వైదిక కమిటీని ఏర్పాటు చేశారు. తాజాగా ఆయన్ను కమిటీలో పునరుద్ధరించారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పటమట పోలీసులు

పటమటలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

పటమట, మార్చి 9: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు ప్రజలకు మేమున్నామని అనే భరోసా కల్పించేందుకు నగర పోలీస్ కమిషన్ కాంతి రాణా ఆదేశాలతో సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు ఆధ్వర్యంలో పటమట పరిసర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ను శనివారం నిర్వహించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని సివిల్, ఏఆర్, పారామిలటరీ బలగాలు, ఏపీఎస్పీ పోలీసులు ఎన్టీఆర్ సర్కిల్ కృష్ణవేణి రోడ్డు నుంచి రామలింగేశ్వర్‌నగర్ కట్ట వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకొనేందుకు నిర్భయంగా, పక్షపాతాలు లేకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందన్నారు. ప్రజలు ఎటువంటి పోహలకు గురికావద్దని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీస్‌శాఖదేనన్నారు. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు దుర్గాప్రసాద్, పల్లి పద్మ, శాతకర్ణి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థల

సేవలు ప్రశంసనీయం

జిల్లా స్పోర్ట్సు మీట్‌ను ప్రారంభించిన సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాస్



రిబ్బన్ కట్ చేస్తున్న హెచ్‌సీఎల్ ప్రతినిధి రాజేష్

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 9: క్రీడాకారుల అభ్యున్నతికి తన వంతు సాయంగా ముందుకొచ్చి సామాజిక సేవలను హీల్ చారిటీ, హెచ్‌సీఎల్ ఫౌండేషన్లు చేయడం ముదావహమని రాష్ట్ర సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ బోయి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆంధ్ర లయోలా కళాశాలలో హెచ్‌సీఎల్ పౌండేషన్, హీల్ చారిటీ సంయుక్తంగా స్పోర్ట్సు ఫర్ చేంజ్ 6వ ఎడిషన్ కింద జిల్లాస్థాయి స్పోర్ట్సుమీట్ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. పోటీలను ప్రారంభించిన శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఏడాది 45 వేల పాఠశాలలకు స్పోర్ట్సు కిట్‌లను అందించామన్నారు. అంధ్రా లయోలా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీపీపీ కిషోర్ మాట్లాడుతూ క్రిస్మస్ సెలవుల్లో పోటీలను నిర్వహిస్తే తాము గ్రౌండ్స్‌ను విరివిగా అందిస్తామన్నారు. హీల్ సీఈవో కె. అజయ్‌కుమార్, హెచ్‌సీఎల్ విజయవాడ హెచ్ఆర్ ఎస్.రాజేష్, విజయవాడ ఇన్‌చార్జి బి.శ్రీనివాస్, హెచ్‌సీఎల్ ఎస్ఎఫ్‌సీ ఇన్‌చార్జి నందగోపాల్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో క్రీడాకారులను తయారు చేయడానికి సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 13 క్రీడా ఈవెంట్లలో 500 మందికిపైగా వివిధ ప్రభుత్వ, జెడ్పీ, కార్పొరేషన్ల స్కూల్స్ విద్యార్థులు తలపడ్డారు. రిటైర్డు డీఎస్‌డీవోలు బి. సుధాకర్, కోటంరాజు, కోచ్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బుచ్చిరాజు

మెదడు, వెన్నెముక లోపాలకు చెక్!

- ఫోలిక్ యాసిడ్ ఫోర్టిఫైడ్ అయోడైజ్డ్ ఉప్పు వాడాలి
- ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు సూచన

విశాఖపట్నం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చడానికి ముందు నుంచి మహిళలు ఫోలిక్ యాసిడ్ ఫోర్టిఫైడ్ అయోడైజ్డ్ ఉప్పు వినియోగించినట్టయితే పుట్టుకతో చిన్నారుల్లో కనిపించే మెదడు, వెన్నెముక లోపాలను నివారించవచ్చునని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు చెప్పారు. ఈ విషయం తమ వైద్య బృందం చేసిన పరిశోధనలో తేలిందన్నారు. పరిశోధన వివరాలను ఆయన శనివారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మెడికల్ కళాశాల పరిధిలోని న్యూరో సర్జరీ విభాగానికి చెందిన బృందం, జాతీయ, అంతర్జాతీయ వైద్యులతో కలిసి పుట్టుకతో వచ్చే మెదడు, వెన్ను అవకరాలపై పరిశోధన సాగించిందన్నారు. గర్భం దాల్చడానికి కొద్దిరోజుల ముందే మహిళలకు ఫోలిక్ యాసిడ్ కలిపిన ఫోర్టిఫైడ్ ఉప్పు ఇవ్వడం ద్వారా ఆ తరహా సమస్యలకు చెక్ పెట్టొచ్చని తేలిందని చెప్పారు. ఈ విషయాన్ని జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ నెట్‌వర్క్ ఓపెన్ అనే పబ్లికేషన్ ప్రచురించిందన్నారు. ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల శిశువుల్లో నాడీ సంబంధమైన సమస్యలు ఉత్పన్నం కావడంతోపాటు మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు గ్రామాల్లో 1,200 మంది మహిళలపై ఈ పరిశోధనను సాగించినట్టు తెలిపారు. నాలుగు నెలలపాటు ఫోలిక్ యాసిడ్ ఫోర్టిఫైడ్ అయోడైజ్డ్ ఉప్పును వారికి అందించామని, వారిలో ఫోలిక్ యాసిడ్ స్థాయిలు రక్తంలో గణనీయంగా పెరిగాయని, దీనివల్ల ఆయా వ్యాధుల ప్రమాదం తగ్గిందని చెప్పారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణుల బృందం డాక్టర్ ఎంవీ విజయశేఖర్, డాక్టర్ బి.హయగ్రీవరావు, డాక్టర్ ఫణి మాధవి, డాక్టర్ అనిల్‌కుమార్, యూఎస్ఏ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ జోగి వి పట్టిసాపు, ఎమోరీ విశ్వవిద్యాలయం డాక్టర్ గాడ్ పీవోకే, డాక్టర్ విజయ కంచర్ల ఆధ్వర్యంలో ఈ అధ్యయనం సాగిందన్నారు. సమావేశంలో డాక్టర్ విజయశేఖర్, ప్రాజెక్ట్ సమన్వయకర్త కె.మధునారాయణరావు(అనిల్) తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు: అయ్యన్న

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం తిరిగి కోలుకోవాలంటే.. కేంద్ర సహకారం తప్పనిసరి అని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఒక్క చాన్స్ అన్న జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాడని ధ్వజమెత్తారు.

పాత మేనిఫెస్టో ఎంత అమలు చేశారు?: ఆలపాటి

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి మరోసారి రాష్ట్రప్రజల్ని మోసం చేయడానికి సిద్ధమయ్యారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. మేదరమెట్ల 'సిద్ధం' సభలో కొత్త మేనిఫెస్టో విడుదల చేసే ముందు పాత మేనిఫెస్టోను ఎంత వరకు అమలు చేశారో చెప్పాలని నిలదీశారు. 17% కన్నా ఎక్కువ హామీలు అమలు చేసి ఉంటే, మేదరమెట్ల సభలో రుజువు చేయాలని సవాల్ చేశారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సామాజిక న్యాయం చేసి ఉంటే.. రాష్ట్రంలో ఏ వర్గం సంతృప్తిగా ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. టీచర్లను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టిన జగన్ సర్కార్‌కు విశ్వసనీయత లేదనటానికి ఎన్నో ఉదాహరణలున్నాయని వ్యాఖ్యానించారు.

సీపీఐ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ఏర్పాటైంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు కన్వీనర్‌గా, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పార్టీ నేతలు కేవీవీ ప్రసాద్, పెనుమత్స దుర్గాభవానీ, ఎస్ లెనిన్‌బాబు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీ తొలి సమావేశాన్ని శనివారం విజయవాడలో నిర్వహించారు. 'జనం కోసం... జనం మధ్యకు... జన ప్రణాళిక' పేరుతో తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించనున్నట్లు కమిటీ కన్వీనర్ ఓబులేసు తెలిపారు. వివిధ వర్గాల ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలే ప్రస్తావనాంశాలుగా సీపీఐ ఎన్నికల ప్రణాళికను తయారు చేసేందుకు నిర్ణయించామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, దానికి వంత పాడుతున్న రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఓడించి ఇండియా కూటమిని గెలిపించేందుకు సీపీఐ కంకణం కట్టుకుందని ఓబులేసు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి

- ఓపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు

విజయవాడ (వన్‌టౌన్), మార్చి 9:సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకువస్తామని నమ్మించి మోసం చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని ఓపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, కోరుకొండ సతీష్, సీఎం దాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 2000 మంది సీపీఎస్ ఉద్యోగులపై కేసులు బనాయించి ఉద్యమాన్ని అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ-జనసేన రాష్ట్రంలోని నాలుగు లక్షల ఉద్యోగులకు సీపీఎస్‌కు రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ అంశాన్ని మానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు.

మహారాష్ట్రలో 30సీట్లలో బీజేపీ పోటీ?

న్యూఢిల్లీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కీలక రాష్ట్రాల్లో తమ భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటుపై బీజేపీ చర్చలు ముమ్మరం చేస్తోంది. పొత్తులను వేగంగా ఖరారు చేస్తోంది. శుక్రవారం రాత్రి ఢిల్లీలోని అమిత్ షా నివాసంలో మహారాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్, ప్రస్తుత సీఎం-శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ సమావేశమయ్యారు. ఏ పార్టీ ఎక్కడెక్కడ పోటీ చేయాలన్నదానిపై చర్చించారు. నాలుగైదు సీట్లు మినహా మిగిలిన అన్ని సీట్లపై మూడు పార్టీలూ స్పష్టతకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే, ఈసారి బీజేపీ మహారాష్ట్రలో కనీసం 30 సీట్లలో పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్రలో మొత్తం 48 ఎంపీ స్థానాలు ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 25 చోట్ల పోటీ చేసి 23 చోట్ల గెలిచింది. శివసేన 23 స్థానాల్లో పోటీ చేసి 18 చోట్ల గెలిచింది. అప్పుడు యూపీఏ కూటమిలో ఉన్న ఎన్సీపీ 19 చోట్ల పోటీ చేసి కేవలం 4 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. అయితే, మహారాష్ట్రలో అప్పటి రాజకీయ పరిస్థితులు ఇప్పుడు లేవు. శివసేన, ఎన్సీపీ చీలిపోయాయి. ప్రస్తుత శిందే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ మునుపటిలా ప్రభావం చూపిస్తాయా అన్నది అనుమానమే. ఈ నేపథ్యంలో- మహారాష్ట్రలో 30కి తగ్గకుండా సీట్లలో పోటీ చేయాలని బీజేపీ భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ

- భాజపాలో చేరిన కేంద్ర మాజీమంత్రి సురేశ్ పచౌరీ

భోపాల్, మార్చి 9 : లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండగా కాంగ్రెస్ పార్టీకి మధ్యప్రదేశ్‌లో ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్య నేత, కేంద్ర మాజీమంత్రి సురేశ్ పచౌరీ(71) మరో 10 మంది కాంగ్రెస్ నేతలతో కలిసి శనివారం ఉదయం బీజేపీలో చేరారు. ఆయన సుదీర్ఘంగా 52 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌ను వీడిన వారిలో మాజీ ఎంపీ ఒకరు, ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీలో చేరే ముందు పచౌరీ తన రాజీనామా లేఖను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు పంపారు. కాంగ్రెస్ తన మూల సిద్ధాంతాలకు దూరం అవుతోందని అందులో ధ్వజమెత్తారు. బీజేపీలో చేరిన సందర్భంగా భోపాల్‌లో మాట్లాడుతూ... మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 1989లో అయోధ్యలో రామాలయం తాళాలు తీయడానికి అంగీకరించారని, దీనికి తానే సాక్షి అని చెప్పారు. రాముడికి వ్యతిరేకంగా ఉంటే వారు తనకు ఎంత ఇష్టమైనవారైనా.. వదలక తప్పదన్నారు. ఇదిలా ఉండగా, అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆ రాష్ట్ర మాజీ సీఎం నబమ్ టుకి రాజీనామా చేశారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో ఝార్గ్రామ్ ఎంపీ కునార్ హెంబ్రమ్ శనివారం బీజేపీని వీడారు. వ్యక్తిగత కారణాలతో తాను పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు.

ఉద్యోగాల్లో 40 కోట్లు ఊదేశారు!

- 'నా ఎస్సీ.. ఎస్టీ.. బీసీ..'లకే జగన్ వెన్నుపోటు
- అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల్లో చేతివాటం
- నియామకాల్లో బడుగుల రిజర్వేషన్లకు పాతర
- అందినకాడికి దోచేసిన అధికారులు, నేతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వైసీపీ సర్కారు ఉద్యోగాలిచ్చిన సంగతేమోగాని ఆ పేరు చెప్పి ఆ పార్టీ నేతలు నొక్కేసిందే ఎక్కువగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీ సూపర్‌వైజర్ల నియామకాల్లో సుమారు రూ.40 కోట్లు చేతులు మారాయని రాష్ట్ర వ్యాప్తంగా గగ్గోలు మొదలైంది. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ...' అంటూ ఊదరగొట్టే జగన్, ఈ పోస్టుల్లో ఆ వర్గాలకు అందాల్సిన రిజర్వేషన్ ఫలాలు పూర్తిగా అందకుండా చేశారు. దీనివల్ల ఒక్క ఒంగోలు జోన్‌లోనే సుమారు 25మందికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని చెబుతున్నారు. గోదావరి జిల్లాకు చెందిన ఓ ఉద్యోగ సంఘం నేత చక్రం తిప్పి ఈ అడ్డగోలు వ్యవహారం నడిపారని ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 2 వేల మంది నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు చొప్పున వసూలు చేశారని తెలుస్తోంది. ఈ కుంభకోణం జరిగి రెండేళ్లవుతున్నా... ఫిర్యాదు చేసేందుకు ఇప్పటికీ అంగన్వాడీ కార్యకర్తలు భయపడుతున్నారు. ఉన్నతాధికారులకు టార్గెట్ అవుతామని భయపడి అప్పట్లో ఫిర్యాదు చేయలేదు. అయితే, వైసీపీ పాలనా గడువు దాదాపుగా ముగింపునకు వచ్చిన నేపథ్యంలో ధైర్యం చేసి కొంత మంది అభ్యర్థులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ల నియామకాల సమయంలో అడ్డగోలు వ్యవహారానికి అడ్డు పడుతున్నారన్న ఆగ్రహంతో అప్పట్లో మహిళా శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారినే బదిలీ చేశారు. ఎన్నికల తర్వాత వచ్చే కొత్త ప్రభుత్వమైనా ఈ స్కాంపై విచారణ జరిపిస్తే భారీ అవినీతి వెలుగులోకి వస్తుందని అంగన్వాడీ వర్గాలే అంటున్నాయి. ఈ అడ్డగోలు నియామకాలు చేపట్టిన అధికారులు జైలుకు వెళ్లక తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అసలేం జరిగిందంటే..

మహిళా శిశు సంక్షేమశాఖ 2022 సెప్టెంబరు 5న 560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ నెల 18న రాతపరీక్ష నిర్వహించారు. పదేళ్ల సర్వీసు నిండిన అంగన్వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు విధానంలో అప్పటికే పనిచేస్తున్న సూపర్‌వైజర్లు ఈ రాతపరీక్షలు రాసేందుకు అర్హులు. జోన్ల వారీగా వైజాగ్ జోన్ కింద 76 పోస్టులు, ఏలూరు జోన్ పరిధిలో 126, ఒంగోలు జోన్ పరిధిలో 142 పోస్టులు, కర్నూలు జోన్ పరిధిలో 216 పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. వివాదంలో ఉండటంతో నియామకం అయిన తర్వాత కోర్టు ఆదేశాలతో 164 పోస్టులు నిలిచిపోగా మిగిలిన 396 పోస్టులను నింపారు. రాతపరీక్ష 45 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నాపత్రం, మరో 5 మార్కులు కోసం ఇంగ్లీషు ఎఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించారు. మెరిట్ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేశారు. మహిళా సంక్షేమశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కన్వీనర్‌గా, ప్రాంతీయ కార్యాలయం ఉండే జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ వేసి ఈ పోస్టులు భర్తీ చేశారు. ఈ రాత పరీక్షలకు సుమారు 20 వేల మంది హాజరయ్యారు. అయితే, రాతపరీక్షతో పాటు నిర్వహించిన ఇంగ్లీషు ఎఫిషియెన్సీ పరీక్షల తీరుపై విమర్శలు వచ్చాయి. నోటిఫికేషన్ ప్రకారం... ఇంగ్లీషులో నైపుణ్యం కలిగినవారి పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహించాలి. కానీ, దీనికి భిన్నంగా అడ్డగోలుగా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఇంగ్లీషు సంభాషణను (స్పీకింగు) వీడియో తీసి పంపాలని అభ్యర్థులకు చెప్పారు. అలా వచ్చిన వీడియోలను పరిశీలించి మార్కులు వేసి ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ టెస్ట్‌లో అధిక మార్కులు వచ్చిన వాళ్లకే ఉద్యోగం వస్తుందని రూల్ పెట్టారు. ఆ మార్కులు ఇచ్చేది తామేనంటూ అమ్యామ్యాలకు తెగబడ్డారు. ఈ వ్యవహారంలో గోదావరి జిల్లాలకు చెందిన ఓ ఉద్యోగ సంఘం నేత డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఒక్కో అంగన్వాడీ కార్యకర్త నుంచి ఇతడు రూ. లక్షల్లో గుంజినట్టు చెబుతున్నారు. దీంతో చాలాచోట్ల మెరిట్ పొందిన వారికి కాకుండా డబ్బులిచ్చిన వాళ్లకే పోస్టులు దక్కాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని చోట్ల వైసీపీ స్థానిక నేతలు, ఎమ్మెల్యేలు, కొన్ని చోట్ల మంత్రులు సైతం డబ్బులు తీసుకుని ఈ పోస్టులకు సిఫారసులు చేసినట్లు సమాచారం.

రిజర్వేషన్ అమల్లో అన్యాయం..

అధికారులు పోస్టుల నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయడంలో తప్పులు చేశారు. మెరిట్ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు సైతం రిజర్వేషన్ల కేటగిరీనే వర్తింపజేశారు. ఉదాహరణకు రాత పరీక్ష, ఇంగ్లీషు ఎఫిషియెన్సీ టెస్టు కలిపి మొత్తం 50 మార్కులకు పరీక్ష జరిగితే చెన్ను అనూరాధ 44.75 మార్కులు, యడ్లపల్లి ఉమాదేవి 44.50 మార్కులు తెచ్చుకున్నారు. అయినా, వారిని ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కిందే పరిగణించారు. అదే విధంగా 44.75 మార్కులు పొందిన పందుల సలోమి, 44.50 మార్కులు పొందిన కాటూరి ప్రసన్నకుమారి ఎస్సీ కేటగిరిలో ఉన్నారు. వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేయకుండా రిజర్వేషన్ల కేటగిరీ కింద భర్తీ చేశారు. అదేగనుక రిజర్వేషన్ ప్రక్రియను కచ్చితంగా అమలు చేసి ఉంటే మరికొన్ని పోస్టులు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు దక్కేవని, ఈ నియామక ప్రక్రియ అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు, ఓపెన్ కేటగిరీలో మంచి మెరిట్ సాధించిన అభ్యర్థులకు కూడా చాలా చోట్ల అన్యాయం జరిగినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెరిట్ అభ్యర్థులకు ముందువరుసలో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ఉద్యోగ సంఘం నేతకు డబ్బులు కట్టినవారికీ, స్థానిక వైసీపీ నేతలతో చెప్పించుకున్నవారికీ పెద్దపీట వేసినట్టు కొందరు బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. వారంతా న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

దివ్యాంగులకు 6వేల పెన్షన్ ఇవ్వాలి

చలో అమరావతి సభలో మందకృష్ణ



సభలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

పెదకాకాని, మార్చి 9: రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం లేదని, వారి సమస్యలు పరిష్కారమయ్యేవరకు, వారి హక్కులు వారికి దక్కేవరకు వారి పోరాటాన్ని తాము భుజాన వేసుకుంటామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. చలో అమరావతి -వికలాంగుల మహాగర్జన పిలుపులో భాగంగా శనివారం ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగాగల గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్ నెలకు రూ. 6వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి అవసరమైన వాహనాలను సమకూర్చాలన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. జగన్ ఒక మానసిక వికలాంగుడని, అతడు దివ్యాంగుల హక్కులను హరించి వేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత దివ్యాంగుల కష్టాలన్నీ తీరుస్తామని, అందుకోసం ప్రత్యేక ప్యాకేజీ కూడా ప్రకటించేందుకు చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు మాట్లాడారు.

టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 21% ఫిట్‌మెంట్

- జూన్ 1 నుంచి అమలు

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్సీ సమస్య కొలిక్కి వచ్చింది. వారికి 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెంచిన వేతనాలు జూన్ 1 నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించారు. సంస్థలో ఒక్కో ఉద్యోగికి రూ.8 వేల నుంచి రూ.11 వేల వరకు వేతనం పెరుగుతుందన్నారు. 53,071 మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఫిట్‌మెంట్ పెంపుతో ప్రభుత్వంపై ఏడాదికి రూ.418.11 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. శనివారం బస్ భవన్‌లో మంత్రి పొన్నం విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఆర్థిక సమస్యలున్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం గురించి, సంస్థ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని పీఆర్సీ ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి 16 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇచ్చిందని.. ఆ తర్వాత ఇవ్వలేదని మంత్రి పొన్నం తెలిపారు. 2017 నుంచి 21 శాతం ఫిట్‌మెంట్‌తో పే స్కేల్ అమలు చేస్తామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా 25 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని చెప్పారు. త్వరలో 2,500 కొత్త బస్సులు కొననున్నట్లు చెప్పారు.

కొత్త నియామకాలు చేపడతాం..

ఆర్టీసీలో కొత్త నియామకాలు చేపడతామని, ఉద్యోగులకు బోనస్‌తో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందించే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని పొన్నం తెలిపారు. గత బీఆర్ఎస్.. ప్రభుత్వంలో ఉద్యోగుల పీఎఫ్‌నూ వాడుకున్నారని ఆరోపించారు. పే స్కేల్ 2017 బకాయిలు ఉద్యోగుల విరమణ సమయంలో వడ్డీ లేకుండా చెల్లించనున్నట్టు తెలిపారు. పేస్కేల్ 2017 సర్వీస్‌లో ఉన్న 42,057 మందికి, ఆ ఏడాది ఏప్రిల్‌లో విరమణ చేసిన 11,014 మందికి కలిపి 53,071 మందికి కొత్త ఫిట్‌మెంట్ వల్ల ప్రయోజనం చేకూరుతుందని పొన్నం పేర్కొన్నారు.

గ్యారెంటీలపై కాంగ్రెస్ దృష్టి

15న విశాఖలో బహిరంగ సభ

- హాజరుకానున్న టీ సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలోనే ప్రజల్లోకి పార్టీ నేతలు
- మొదటి గ్యారెంటీపై విస్తృత ప్రచారం
- పార్లమెంటుకు పీసీసీ చీఫ్ షర్మిల పోటీ?
- అసెంబ్లీకి పోటీ చేయాలన్న ఏపీసీసీ నేతలు
- పులివెందుల నుంచి బరిలోకి దిగాలని సూచన
- తెలంగాణలో ఉన్న ఓటు.. ఏపీకి మార్పు!

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వస్తే తాము అమలు చేయబోయే గ్యారెంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనంతపురం జిల్లాలో ఇచ్చిన మొదటి గ్యారెంటీ.. ప్రతి ఇంటికీ మహిళ పేరిట నెలకు రూ.5 వేలను అందిస్తామన్న హామీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యాచరణను రాష్ట్ర కాంగ్రెస్ సిద్ధం చేసింది. శనివారం విజయవాడ ఇబ్రహీంపట్నంలోని పుట్లమ్మ గట్టు క్యాంపులో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తొలి గ్యారెంటీపై పార్టీ నేతలకు వివరించారు. అదేవిధంగా.. ఈ నెల 15న విశాఖపట్నంలో నిర్వహించనున్న భారీ సభలో ఇతర గ్యారెంటీలను ప్రకటించాలని నిర్ణయించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోపే అమలు చేస్తున్న గ్యారెంటీలతో పాటు.. ఉద్యోగ నియామకాల ద్వారా యువతకు కల్పిస్తున్న భరోసా గురించి విశాఖ సభలో ఆయన వివరించనున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దక్కించుకుని ఏపీలోనూ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే పథకాలతో పాటు అమరావతిని రాజధానిగా కొనసాగించడం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ నిర్మాణం, దుగరాజపట్నం, రామాయపట్నం ఓడరేవు, విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిలుపుదల వంటి వాటిని కూడా ఈ సభలో ప్రస్తావించనున్నారని తెలిసింది. ఒకవైపు గ్యారెంటీలపై ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రాధాన్యం ఇస్తూనే.. ఎన్నికల బరిలోకిదిగే అభ్యర్థుల ఎంపికనూ పూర్తి చేసేందుకు ఏపీసీసీ చీఫ్ షర్మిల సిద్ధమయ్యారు. ప్రస్తుతం షర్మిల ఓటు హైదరాబాద్‌లో ఉంది. దానిని ఏపీకి మార్చుకోవాలని ఏపీసీసీ నాయకులు సూచిస్తున్నారు. తెలంగాణలో ఓటు ఉన్నందున షర్మిల తన ఓటును ఏపీకి మార్చుకుని ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఏపీసీసీ నేతలు సూచిస్తున్నారు. కార్యకర్తలు కూడా షర్మిలను ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని కోరుకుంటున్నారు. ప్రధానంగా పులివెందుల నుంచి షర్మిల పోటీ చేస్తే.. ఈసారి ఎన్నిక నువ్వా-నేనా అన్నట్లుగా ఉంటుందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. అయితే ఆమె ఆలోచన పార్లమెంటు దిశగా ఉన్నట్టు నేతలు భావిస్తున్నారు. కొన్నాళ్ల కిందట మంగళగిరిలో షర్మిల నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా నేతలు హాజరయ్యారు. వీరి వాహనాలతో ప్రైవేటు ఫంక్షన్‌హాల్ ప్రాంగణం నిండిపోయింది. వందల సంఖ్యలతో వచ్చిన వాహనాల శ్రేణిని చూశాక.. కాంగ్రెస్‌లోకి షర్మిల ముందుగా వచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయం క్యాడర్‌లో కనిపించింది. మొత్తానికి 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార పగ్గాలను చేపడతామన్న విశ్వాసం కాంగ్రెస్ పార్టీ నేతల్లో లేకపోయినప్పటికీ, 2014, 2019 తరహాలో కాకుండా ఈసారి గౌరవ ప్రదమైన పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

నకిలీ ఎస్ఐకు రిమాండ్

- అతడికి సహకరించిన యువతికి కూడా..
- రైల్వేలో ఉద్యోగాల పేరిట మోసం కేసు
- పోలీస్ యూనిఫాం, డమ్మీ పిస్టల్ స్వాధీనం
- నిందితుడి పేరుతో విశాఖలో రెండు ఫ్లాట్లు





నిందితుడు రమేష్‌కుమార్, అతడి స్నేహితురాలు శ్రావణి

విశాఖపట్నం/మర్రిపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసగించి డబ్బులు వసూలు చేసిన కేసులో నకిలీ ఎస్ఐ అవతారమెత్తిన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం శేఖరపురానికి చెందిన హనుమంతు రమేష్‌కుమార్ (37)తోపాటు, అతడికి సహకరించిన యువతిని పెందుర్తి పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను మాధవధారలోని వెస్ట్ ఏసీపీ కార్యాలయంలో శనివారం డీసీపీ-2 ఎం.సత్తిబాబు వెల్లడించారు. పెందుర్తిలో భార్యా పిల్లలతో కాపురం పెట్టిన రమేష్‌కుమార్‌కు శ్రీకాకుళం జిల్లా పలాసలోని శివాజీ నగర్‌కు చెందిన లుకలాపు సాయిప్రవీణ అలియాస్ శ్రావణి (24)తో 2018లో పరిచయమైంది. ఆమెను విశాలాక్షి నగర్‌లోని ఒక అపార్టుమెంట్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకుని అందులో ఉంచాడు. సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తూ.. పెందుర్తిలోని ఇంటికి అప్పుడప్పుడూ వెళ్తుండేవాడు. అయితే, విధి నిర్వహణలో తప్పిదాల కారణంగా 2022లో అతడి ఉద్యోగం పోయింది. కానీ, ఆ తర్వాత టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తున్నట్లు అందరినీ నమ్మించాడు. రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పెందుర్తిలో ఉంటున్న దుంపల కృష్ణారావుతోపాటు మరో 12 మంది నుంచి రూ.85 లక్షలకు వసూలు చేశాడు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పలువురి నుంచి భారీగా డబ్బులు గుంజాడు. అందరికీ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, మెయిల్స్ పంపించాడు. ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు నేరుగా సికింద్రాబాద్‌లోని డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లి తమ అపాయింట్‌మెంట్ లెటర్లు చూపించడంతో అవన్నీ నకిలీవని తేలింది. బాధితుల ఫిర్యాదుతో రమేష్‌కుమార్‌తో పాటు, మొత్తం వ్యవహారంలో అతడికి సహకరించిన శ్రావణిని పోలీసులు అరెస్టు చేశారు. రమేష్‌కుమార్ వసూలు చేసిన డబ్బును ఎక్కువగా విలాసాలకు ఖర్చు చేసినట్లు తేలగా, అతడి పేరిట విశాఖలో రెండు చోట్ల ఫ్లాట్‌లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి కారు, బుల్లెట్ (ద్విచక్ర వాహనం)తోపాటు పోలీస్ యూనిఫారం, డమ్మీ పిస్తోలు, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, దక్షిణ మధ్య రైల్వే అధికారి, సికింద్రాబాద్ పేరుతో ఉన్న రబ్బరు స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

భారత్‌కు మాల్దీవుల మాజీ అధ్యక్షుడి క్షమాపణ

మాలె, మార్చి 9: భారత్‌తో దౌత్య వివాదం, తదనంతర పరిణామాలపై మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో పర్యటిస్తున్న ఆయన మాల్దీవుల ప్రజల తరఫున క్షమాపణలు చెప్పారు. భారత పర్యాటకులు సెలవుల్లో తమ దేశానికి రావాలని కోరారు. భారత దళాలు తమ దేశం విడిచి వెళ్లాలని మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కోరినపుడు.. భారత్ సంయమనంతో వ్యవహరించిందని పేర్కొన్నారు. మాల్దీవులతో దౌత్య విభేదాల తర్వాత ఆ దేశానికి వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య గతేడాదితో పోలిస్తే 33% తగ్గింది. 2023లో మార్చి 4 నాటికి 41,054 మంది భారత పర్యాటకులు మాల్దీవులను సందర్శించగా, ఈ యేడు మార్చి 2 వరకు 27,224 మంది మాత్రమే వెళ్లారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ: మాయావతి

న్యూఢిల్లీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ పూర్తి సన్నద్ధతతో ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆ పార్టీ అధినేత్రి మాయావతి తెలిపారు. పొత్తులు, మూడో కూటమి ఏర్పాటుపై జరుగుతున్న ప్రచారలన్నీ వదంతులేనని శనివారం ఆమె 'ఎక్స్' వేదికగా కొట్టిపారేశారు. ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ ఒంటరిగా పోటీచేస్తుండంతో కొందరూ అసహనానికి గురవుతూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజనుల ప్రయోజనాల రీత్యా ఒంటరిగానే పోటీ చేయాలని బీఎస్పీ దృఢ నిర్ణయం తీసుకుందని మాయావతి ప్రకటించారు.

అణు పరీక్షల దిశగా ప్రపంచం

ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఉత్తర కొరియా.. పాకిస్థాన్, ఇండియా కూడా అదేవైపు...

ముంబై, మార్చి 9: 'ప్రపంచంలో అణ్వాయుధాలు కలిగిన దేశాలు వాటిని మరింత ఆధునీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయి. దానితో పాటు అణు విస్ఫోటన పరీక్షకు సిద్ధమవుతున్నాయి. పాకిస్థాన్, భారత్ దేశాలు కూడా ఆ దిశగా ప్రయాణించే అవకాశాలు ఉన్నాయి' అని 'బులెటిన్ ఆఫ్ ది అటామిక్ సైంటిస్ట్స్' తాజా సంచిక పేర్కొంది. అల్బర్ట్ ఐన్‌స్టీన్, మొదటి ఆటంబాంబుకు రూపకల్పన చేసి, తయారు చేసిన మాన్‌హట్టన్ ప్రాజెక్టులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు కలసి 1945లో ఈ జర్నల్‌ను ప్రారంభించారు. అణుభద్రతా నిపుణుడు, అణు వ్యవహారాలపై యూరోపియన్ పార్లమెంటు శాస్త్రీయ సలహాదారు ఫ్రాంకోయిస్ డియాజ్ మౌరిన్ ఈ సంచికలో ఒక నివేదికను ప్రచురించారు. 'అణ్వస్త్ర ప్రయోగాలను నిషేధిస్తూ అంతర్జాతీయ ఒప్పందం ఉన్నప్పటికీ అణ్వాయుధాల పరీక్ష అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అణు సాయుధ సంపత్తిని కలిగిన మూడు అతిపెద్ద దేశాలైన అమెరికా, రష్యా, చైనాలలోని అణ్వాయుధ పరీక్షా కేంద్రాల్లో 2021 తరువాత నిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. సమగ్ర పరీక్ష నిషేధ ఒప్పందం(సీటీబీటీ)పై సంతకాలు చేయని పాకిస్థాన్, ఇండియా దేశాలు కూడా ఆదిశగా చూపు సారించాయి. ఈ రెండు దేశాలూ 1998 మేలో చివరిసారిగా అణు పరీక్షలను నిర్వహించాయి. ఆ తరువాత భారత దేశం అణు పరీక్షలపై మారటోరియం ప్రకటించింది. ఇది అనవసరపు, తొందరపాటు చర్యగా దేశంలోని పలువురు శాస్త్రవేత్తలు భావించారు. దీనిపై శాస్త్రవేత్తలు మీడియాతో మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితి తలెత్తితే, అవసరానికి అనుగుణంగా మారటోరియాన్ని ఏ క్షణంలోనైనా ఎత్తివేయవచ్చని పేర్కొన్నారు. మరోవైపు రష్యా, చైనా దేశాలు తమ అణుపరీక్ష కేంద్రాలు నోవాయా జెమ్లియా, లోప్ నూర్‌లలో భూగర్భ సొరంగాలను నిర్మిస్తున్నాయని నిపుణులు అనుమానిస్తున్నారు. రష్యా గత ఏడాది నవంబరులో సీటీబీటీ నుంచి వైదొలగింది. మరోవైపు అమెరికా తన అణు నిల్వల నిర్వహణ, పనితీరు నిర్ధారణ సామర్థ్యాలను మెరుగు పరచడానికి భూగర్భ అణు పరీక్షలను నిర్వహించాల్సిన అవసరం లేని దిశగా 'ది నేషనల్ న్యూక్లియర్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్' తన నెవాడా పరీక్షా కేంద్రాన్ని విస్తరిస్తోంది. అదే సమయంలో అమెరికా తన సంసిద్ధతా విధానాన్ని కొనసాగిస్తోంది. ప్రత్యర్థులు ఎవరైనా అణు పరీక్షలను నిర్వహిస్తే ఆరు నెలల్లో అణు పరీక్షలను నిర్వహించడానికి సిద్ధంగా ఉంది' అని జర్నల్‌లోని నివేదిక స్పష్టం చేసింది. మరోవైపు 21వ శతాబ్దంలో ఉత్తర కొరియా మాత్రమే అణ్వాయుధ పరీక్షలను నిర్వహించిన ఏకైక దేశంగా నిలిచింది. తమ నాయకుడు కిమ్ రాజకీయ నిర్ణయం తీసుకుంటే మరోసారి అణుపరీక్షలను నిర్వహించడానికి ఆ దేశం సిద్ధంగా ఉంది. కాగా, అదే జర్నల్‌లో వచ్చిన మరో నివేదిక మేరకు ఇరాన్ న్యూక్లియర్ క్లబ్‌లో చేరడానికి తనకు తగిన సాంకేతిక సామర్థ్యం ఉందని చాటిచెప్పిందని పేర్కొంది. మరోవైపు దక్షిణ కొరియా, సౌదీ అరేబియా దేశాలు అణు బెదిరింపులను ఎదుర్కోవడానికి అణ్వాయుధాలను తయారు చేయగల సత్తా తమకు ఉందని ప్రకటించిన విషయాన్ని ఆ నివేదిక గుర్తు చేసింది.

అమ్మ ఎప్పటికీ నాతోనే ఉండాలి

- సాయిధరమ్ తేజ్

"హీరోగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి మా అమ్మపేరు మీద ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించాలని ఉండేది. అందుకే అమ్మ పేరు మీద విజయదుర్గ ప్రొడక్షన్స్ ప్రారంభించాను. మా అమ్మ ఎప్పుడూ నాతోనే ఉండాలి. ఇక నుంచి నా పేరును సాయి దుర్గ తేజ్‌గా మార్చుకుంటున్నాను" అని చెప్పారు సాయిధరమ్ తేజ్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన మ్యూజికల్ షార్ట్ ఫీచర్ ఫిల్మ్ 'సత్య'. కలర్స్ స్వాతి ఇందులో సాయి దుర్గ తేజ్ భార్యగా నటించారు. ఈ మ్యూజికల్ షార్ట్ ఫీచర్‌ను దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంతో కలిసి సాయి దుర్గ తేజ్ సొంత సంస్థ విజయ దుర్గ ప్రొడక్షన్స్ సంస్థ



నిర్మించింది. హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మాతలు. కాగా, శుక్రవారం మహిళా దినోత్సం సందర్భంగా ఈ చిత్రం ప్రత్యేక షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ" ఈ సొసైటీకి తన వంతుగా ఏమైనా చేయాలని నిత్యం తపన పడతారు సాయిదుర్గ తేజ్. ఆయనతో పాటు ఈ సినిమా టీమ్ అంతా సమాజానికి తమ వంతు ఏమైనా చేయాలని చేసిన సినిమా ఇది" అని అన్నారు. దర్శకుడు నవీన్ విజయకృష్ణ మాట్లాడుతూ "సోల్జర్ పాయింట్ ఆఫ్ వ్యూలో ఈ షార్ట్ ఫీచర్ ను చెప్పాలనేది హర్షిత్ ఐడియా. ఆ ఐడియా నచ్చి నేను, సాయి జాయిన్ అయ్యాం. ఇండియాలో ఎంతో గొప్ప మహిళలు వున్నారు. అలాంటి వాళ్ల గురించి అందరికీ తెలియాలి" అని అన్నారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ "శ్రుతిరంజని అందించిన సాంగ్, ఈ షార్ట్ ఫీచర్‌కు ప్రేరణగా నిలిచింది" అని అన్నారు. సింగర్ శ్రుతిరంజని ఈ చిత్రంలోని 'సోల్ ఆఫ్ సత్య' పాటకు మ్యూజిక్, లిరిక్స్ అందించి పాడారు. ఇప్పటి వరకు దాదాపు 25 ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఈ చిత్రం ప్రదర్శితమై, ఎన్నో అవార్డుల్ని గెలుచుకుంది.

లాల్ సలామ్
వైఫల్యానికి కారణం అదే!



సూపర్ స్టార్ రజనీకాంత్ అతిథి పాత్రలో మెరిసిన చిత్రం 'లాల్ సలామ్'. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటించారు. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దీనిని తెరకెక్కించారు. ఫిబ్రవరి 9న విడుదలైన ఈ చిత్రం అంచనాలను అందుకోవటంలో విఫలమై, బాక్సాఫీస్ దగ్గర చతికిలపడింది. ఈ చిత్రంపై వస్తోన్న విమర్శలపై డైరెక్టర్ ఐశ్వర్య స్పందించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఆకట్టులేకపోవడానికి గల కారణాలను ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "మొదట రజనీకాంత్ పోషించిన మొయినుద్దీన్ భాయ్ పాత్ర నిడివి పది నిమిషాలు మాత్రమే. కానీ అభిమానులు ఆయన పాత్ర నుంచి మరింత ఆశిస్తారని, ఆ పాత్రను మరింత పొడిగించాం. దీంతో సినిమా కథాంశం అదుపు తప్పింది. సినిమా రిలీజ్‌కు రెండు రోజుల ముందు ఎడిటింగ్‌లో ఎన్నో మార్పు చేర్పులు చేశాం. అది సత్ఫలితాన్ని ఇవ్వలేదు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత ఇందులో జత చేసిన కమర్షియల్ ఎలిమెంట్స్, సినిమా కంటెంట్‌ను డామినేట్ చేశాయి. ఈ చిత్రం విఫలమైనా, ఓ ఫిల్మ్ మేకర్‌గా ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ చిత్రం ద్వారా కెరీర్‌కు ఉపయోగపడే ఎన్నో అంశాలు నేర్చుకున్నాను. వాస్తవ సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలోని స్క్రీన్‌ప్లే మొదటి భాగం నాన్ లీనియర్‌గా , రెండవ భాగం లీనియర్‌గా సాగడం కూడా ప్రేక్షకులను గందరగోళానికి గురిచేసింది" అని పేర్కొంది.

బాలీవుడ్‌లో సీక్వెల్స్‌దే జోరు

సీక్వెల్స్‌తో బాలీవుడ్ సక్సెస్ రుచి చూస్తోంది అగ్రహీరోల సినిమాలు సైతం బాక్సాఫీసు దగ్గర బోల్తా పడుతున్న తరుణంలో కొనసాగింపు చిత్రాలు మాత్రం జోరు చూపిస్తున్నాయి. హిట్ చిత్రాలకు సీక్వెల్స్ తెరకెక్కించేందుకు దర్శక నిర్మాతలు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో ప్రస్తుతం బాలీవుడ్‌లో పెద్ద సంఖ్యలో సీక్వెల్స్ తయారవుతున్నాయి.








» సీక్వెల్‌తో అక్షయ్‌కు సక్సెస్

వరుస పరాజయాలతో సతమతమవుతున్న అక్షయ్ కుమార్ సీక్వెల్ చిత్రంతో సక్సెస్ బాటపట్టారు. గతేడాది వచ్చిన 'ఓ మై గాడ్ 2' చిత్రం తొలి వారం ప్రపంచ వ్యాప్తంగా రూ. 100 కోట్ల వసూళ్లను సాధించింది. 2012లో వచ్చిన 'ఓ మై గాడ్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ సక్సెస్‌తో ఆయన మరికొన్ని సీక్వెల్ చిత్రాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అక్షయ్‌కుమార్, రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రధారులుగా వచ్చిన 'హౌస్‌ఫుల్' సిరీస్ చిత్రాలు బాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ ఫ్రాంచైజీలో ఐదో సినిమాగా 'హౌస్‌ఫుల్ 5' రాబోతోంది. ఐదు భాగాలుగా తెరకెక్కుతోన్న తొలి భారతీయ చిత్రం ఇదే. దీపావళికి ఈ చిత్రం విడుదలవనుంది. తరుణ్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. 'బచ్చన్‌పాండే' చిత్రంలో అక్షయ్‌కుమార్, అర్షద్ వార్సీ కలసి వినోదం పంచారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబినేషన్ సెట్టయింది. 'జాలీ ఎల్ఎల్‌బీ' తర్వాత ఈ ఫ్రాంచైజీలో మూడో చిత్రం తెరకెక్కబోతోంది. ఇది వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది. సుభాష్ కపూర్ దర్శకత్వంలో స్టార్ స్టూడియోస్ నిర్మిస్తోంది. అక్షయ్‌కుమార్, సునీల్‌శెట్టి హీరోలుగా నటించిన 'ధడ్‌కన్' చిత్రానికి 23 ఏళ్ల తర్వాత సీక్వెల్ రాబోతోంది. దర్శకుడు ధర్మేష్ దర్శన్ ఈ విషయాన్ని తెలిపారు. ఇందులో నటీనటులు ఎవరనేది ప్రకటించాల్సి ఉంది. వెల్‌కమ్ ఫ్రాంచైజీలో మూడో చిత్రం తెరకెక్కుతోంది. దీనికి 'వెల్‌కమ్ టూ ది జంగిల్' అనే టైటిల్ ఖరారైంది. ఈ ఏడాది క్రిస్మస్‌కు విడుదలవుతోంది. అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, అర్షద్‌వార్సి, జాక్వెలిన్ ఫెర్నాండేజ్, దిశా పటానీ, సునీల్ శెట్టి ప్రధాన తారాగణం.



» ఖల్‌నాయక్ ఎవరు?

సంజయ్‌దత్‌కు హీరోగా ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రం 'ఖల్‌నాయక్'. ఈ సినిమా విడుదలై 30 ఏళ్లు దాటింది. 'ఖల్‌నాయక్' సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సీక్వెల్‌లో హీరోగా పలువురు బాలీవుడ్ యాక్టర్ల పేర్లు మీడియాలో వినిపిస్తుండడంపై దర్శకుడు సుభాష్ ఘాయ్ స్పందించారు. మూడేళ్లుగా 'ఖల్‌నాయక్ 2' స్క్రిప్ట్ మీద పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. కథ ఓ కొలిక్కి వచ్చాక హీరో ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పారు.



» సెట్స్‌పైకి భులయ్యా

కార్తిక్ ఆర్యన్ అభిమానులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'భూల్ భులయ్యా 3'. ఇంతకు ముందు వచ్చిన 'భూల్ భులయ్యా 2' బాక్సాఫీసు దగ్గర రూ. 200 కోట్లకు పైబడి వసూళ్లను సాధించింది. కరోనా తర్వాత సరైన వసూళ్లు లేక నీరసించిన బాలీవుడ్ చిత్ర పరిశ్రమకు ఈ విజయం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. చిత్ర దర్శకుడు అనీజ్ బజ్మీ ఈ చిత్రానికి మూడో భాగం ప్రకటించారు. ఈ వారంలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ కథానాయకుడిగా 'ఆషికి 3' చిత్రం కూడా సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. అయితే టీ సిరీస్ సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను ప్రస్తుతానికి పక్కనపెట్టినట్లు తెలిపింది.



» వార్ 2, వార్ 3

హృతిక్‌రోషన్, టైగర్‌ష్రాఫ్ కథానాయకులుగా తెరకెక్కిన 'వార్' చిత్రం మంచి వసూళ్లను రాబట్టింది. హృతిక్, ఎన్టీఆర్ హీరోలుగా ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతోంది. అయాన్ ముఖర్జీ దర్శకుడు. 2025లో ప్రేక్షకుల ముందుకురానుంది. అలాగే ఎన్టీఆర్ హీరోగా ఈ ఫ్రాంచైజీలో మరిన్ని సినిమాలు చేసే అవకాశం ఉన్నట్లు యశ్‌రాజ్ ఫిల్మ్స్ ప్రకటించింది. అలాగే హృతిక్‌రోషన్ హీరోగా 'క్రిష్' ఫ్రాంచైజీలో వచ్చిన చిత్రాలు అన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. త్వరలోనే ఈ ఫ్రాంచైజీలో నాలుగో చిత్రం రాబోతోంది. 'క్రిష్ 4' ప్రీ ప్రొడక్షన్ పనులు ఈ ఏడాది ప్రారంభం కానున్నాయి.

» భయపెట్టే తుంబాద్

విమర్శకులను సైతం మెప్పించిన మైథలాజికల్ హారర్ చిత్రం 'తుంబాడ్'. 2018లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఆ తర్వాత పలు భాషల్లో డబ్ అయ్యి మంచి వసూళ్లను సాధించింది. త్వరలోనే ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కిస్తామని హీరో, నిర్మాత సాహమ్ షా ప్రకటించారు.



» మరోసారి స్త్రీ రాక

చందేరి గ్రామస్తులను భయపెట్టడానికి 'స్త్రీ' మరోసారి వస్తోంది. శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావు జంటగా ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతోంది. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌కు అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు. దినేశ్ విజన్ నిర్మాత. ఆగస్టులో 'స్త్రీ 2' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

» కిక్ 2తో హిట్ దక్కేనా

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ నటించిన 'కిక్' చిత్రం ఎంత పెద్ద హిట్టో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం వరుస ఫ్లాప్‌లతో సతమతమవుతున్న సల్మాన్ దృష్టి ఈ చిత్రం సీక్వెల్‌పై పడింది. 'కిక్ 2' చిత్రం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని ఇటీవలే దర్శకుడు సాజిద్ నడియాడ్‌వాలా చెప్పారు. సెట్స్‌పైకి వెళ్లేందుకు ఇంకొంచెం సమయం పడుతుందని అన్నారు.

» 'ఇష్క్ విష్క్'కు కొనసాగింపు

షాహిద్‌కపూర్, అమృతరావు జంటగా నటించిన రొమాంటిక్ కామెడీ 'ఇష్క్‌విష్క్' చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతోంది. రాజేశ్ రోషన్ కూతురు, హృతిక్ రోషన్ సోదరి పష్మినా రోషన్ 'ఇష్క్ విష్క్ 2' చిత్రంతో వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుంది. జిబ్రాన్‌ఖాన్ ఈ చిత్రంలో కథానాయకుడు. నిపున్ ధర్మాధికారి దర్శకుడు.

» కొత్త డాన్ వస్తున్నాడు

అమితాబ్ బచ్చన్, షారూఖ్‌ఖాన్ 'డాన్' చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు. ఇప్పుడు వారి స్థానంలో రణవీర్‌సింగ్ డాన్‌గా రాబోతున్నారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్ 3' చిత్రం తెరకెక్కుతోంది. షారూఖ్‌ఖాన్ స్థానంలో రణవీర్‌సింగ్ హీరోగా నటిస్తున్నారు. 2025లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని ఫర్హాన్ తెలిపారు.

» వచ్చే ఏడాది దృశ్యం 3

'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలు ఒరిజినల్‌తో పాటు రీమేక్‌లూ ఘన విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఈ చిత్రానికి మూడో భాగం తెరకెక్కుతోంది. మలయాళంతో పాటు హిందీలోనూ ఏకకాలంలో తెరకెక్కించనున్నారు. మలయాళంలో మమ్ముట్టి, హిందీలో అజయ్‌దేవగణ్ కథానాయకులుగా జీతూ జోసెఫ్ తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.



» ఫామ్‌లోకి సన్నీ

బాలీవుడ్‌లో మరో సీనియర్ హీరో సన్నీ డియోల్ కూడా గతేడాది ఏడాది సీక్వెల్‌తో సక్సెస్ అయ్యారు. ఆయన హీరోగా రూపొందిన 'గదర్ 2' చిత్రం సూపర్ హిట్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. హీరోగా ఆయన తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. 2001లో వచ్చిన 'గదర్' చిత్రానికి ఇది కొనసాగింపు. అప్పట్లో ఈ సినిమా సంచలన విజయాన్ని అందుకొంది. వసూళ్లలో పాత రికార్డులను చెరిపేసింది. ఇప్పుడు ఆయన మరో సీక్వెల్‌కు శ్రీకారం చుట్టారు. 2007లో ఆయన హీరోగా వచ్చిన 'అప్నే'కు సీక్వెల్ ప్రకటించారు. 'గదర్' దర్శకుడు అనిల్ శర్మ 'బోర్డర్' సినిమాకు సీక్వెల్ తెరకెక్కించనున్నారు. 'యమ్లా పాగ్లా దీవానా', 'మా తుఝే సలామ్', చిత్రాలకు కూడా సన్నీ సీక్వెల్స్ ప్రకటించారు.



మూడు సార్లు మారిన సినిమా టైటిల్


సెన్సార్ అభ్యంతరంతో సినిమా పేర్లు మారిన సందర్భాలు తెలుగు చిత్ర పరిశ్రమలో చాలా ఉన్నాయి. అయితే దేశంలో విధించిన అత్యయిక పరిస్థితి కారణంగా ఓ సినిమా టైటిల్ మూడు సార్లు మారిన వైనం ఎప్పుడైనా విన్నారా.. వినకపోతే ఇది చదవండి. భారతదేశంలో 1975 జూన్ 25 అర్ధరాత్రి... దేశభద్రతకు ముప్పు వాటిల్లుతుందనే భయంతో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. దీని ప్రభావం మిగిలిన అన్ని పరిశ్రమలతో పాటు చలనచిత్ర పరిశ్రమ మీద కూడా పడింది. ఎమర్జెన్సీ ప్రభావం చిత్రపరిశ్రమ అనేక ఆటుపోట్లకు గురైంది. ముఖ్యంగా సెన్సార్ నిబంధనలు మరింత కఠినం కావడం, కొత్త నిబంధనలు రావడంతో చాలా మంది నిర్మాతలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెన్సార్ ఆదేశాల మేరకు కొంత మంది నిర్మాతలు తమ చిత్రాల కథలు, టైటిల్స్ అప్పటికప్పుడు మార్చుకోవాల్సి వచ్చింది. ఇలా సెన్సార్ నిబంధనల మార్పు కారణంగా పద్మాలయా బేనర్ పై సూపర్ స్టార్ కృష్ణ నిర్మించిన చిత్రానికి రెండుసార్లు టైటిల్ మార్చాల్సి వచ్చింది. అంతే కాదు కథాపరంగా కూడా మార్పులు చేయక తప్పని పరిస్థితి ఎదురైంది. ఈ సినిమాకు మొదట పెట్టిన టైటిల్ 'రామరాజ్యంలో రక్తపాతం' అయితే సెన్సార్ అభ్యంతరం చెబుతుందేమోననే అనుమానంతో టైటిల్‌లో స్వల్ప మార్పు చేసి 'రామ రాజ్యంలో రక్తపాతమా' అని మార్చారు. 1976 జూన్ 25న ఈ సినిమాను విడుదల చేయాలని నిర్ణయించుకొని పోస్టర్స్ ఇతర పబ్లిసిటీ మెటీరియల్ థియేటర్లకు పంపించారు. అయితే జూన్ 24 సెన్సార్ బోర్డు టైటిల్ పై అభ్యంతరం తెలిపింది. 'రామరాజ్యంలో రక్తపాశం' గా మార్చాలని ఆదేశించింది. సినిమా విడుదల కావడానికి 24 గంటల వ్యవధి మాత్రమే ఉంది. అంత తక్కువ సమయంలో పేరు మార్చడం అసాధ్యమే. అయితే ప్రింట్లు ఇంకా పంపించక పోవడంతో యుద్ధ ప్రాతిపదికన టైటిల్ మార్చి రాత్రికి రాత్రి అన్ని కేంద్రాలకు పంపించారు. ఎటువంటి ఆలస్యం లేకుండా మారిన టైటిల్‌తో మార్నింగ్ షో పడింది. పోస్టర్స్‌లో రక్తపాతమా అని ఉన్నచోట రక్తపాశం అనే స్టిక్కర్ అంటించారు. ఇదంతా చూసిన పరిశ్రమ వర్గాలు, ప్రేక్షకులు కృష్ణ కృష్ణే అని ప్రశంసించారు.




ప్రయోగాత్మక ఈవెంట్స్‌కు వేదికగా.. శ్రేయాస్ లైవ్



దేశవ్యాప్తంగా సినిమా ఈవెంట్స్‌ను, ప్రమోషన్స్‌ను నిర్వహించే ప్రముఖ మీడియా సంస్థల్లో శ్రేయాస్ గ్రూప్ మొదటి స్థానంలో ఉంది. ఎంటర్టైన్‌మెంట్ రంగంలో 13 ఏళ్లను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న శ్రేయాస్ గ్రూప్ మరో అడుగు ముందుకేసి తన సంస్థ కార్యకలాపాలను విస్తరించనుంది. బిగ్ బాష్ ఎంటర్టైన్‌మెంట్‌తో కలసి 'శ్రేయాస్ లైవ్' అనే ప్లాట్‌ఫామ్‌ను లాంచ్ చేసి, ఇకపై ప్రయోగాత్మక లైవ్ అండ్ ఎంటర్టైన్‌మెంట్ ఈవెంట్లను కూడా నిర్వహించడానికి సిద్ధమైంది." శ్రేయాస్ లైవ్ ద్వారా లైవ్ ఎంటర్టైన్‌మెంట్ ఈవెంట్లను కొత్త పుంతలు తొక్కించబోతున్నాం. ప్రేక్షకులను అలరించడానికి దేశంలోని కొన్ని ప్రముఖ నగరాలను ఎంచుకుని, వాటిలో కనీసం 50 లైవ్ ఈవెంట్లను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాం. అలానే పేరుమోసిన కళాకారులతో వరల్డ్ టూర్లు, మ్యూజిక్ ఫెస్టివల్స్‌ను కూడా ప్లాన్ చేస్తున్నాం. ఇందులో భాగంగా మా మొదటి లైవ్ కన్సర్ట్ మార్చి 24న ప్రఖ్యాత గాయకుడు సుఖ్విందర్ సింగ్‌తో హైదరాబాద్‌లో మీ ముందుకు రాబోతోంది" అని లాంచ్ ఈవెంట్‌లో శ్రేయాస్ గ్రూప్ ప్రకటించింది.







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
టూ కిల్ ఏ టైగర్	హిందీ చిత్రం	మార్చి 10
యంగ్ రాయల్స్	హిందీ వెర్షన్	మార్చి 11
జీసస్ రెవల్యూషన్	హిందీ వెర్షన్	మార్చి 12
24 హవర్స్ విత్ గాస్పర్	హాలీవుడ్ మూవీ	మార్చి 14
లాల్‌సలామ్	తమిళ చిత్రం	మార్చి 15
మర్డర్ ముబారక్	హిందీ చిత్రం	మార్చి 15
అమెజాన్ ప్రైమ్		
బిగ్‌గర్ల్స్ డోంట్ క్రై	హిందీ సిరీస్	మార్చి 14
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఆస్కార్స్ 2024	అవార్డుల వేడుక	మార్చి 11
లవర్	తమిళ చిత్రం	మార్చి 15
సేవ్ ది టైగర్స్	తెలుగు సిరీస్	మార్చి 15
సోనీ లివ్		
భ్రమయుగం	మలయాళ చిత్రం	మార్చి 15
లయన్స్ గేట్ ప్లే		
నో వే అప్	తెలుగు వెర్షన్	మార్చి 15
జియో సినిమా		
హను-మాన్	హిందీ వెర్షన్	మార్చి 16

ఆంధ్రజ్యోతి
diksuchi@andhrajyothy.com
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 10 మార్చి 2024



పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- హయ్యర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. హైదరాబాద్, గోవా, పిలానీ క్యాంపస్‌లలో ఎంఈ ప్రోగ్రామ్‌లు; గోవా మినహా అన్ని క్యాంపస్‌లలో ఎంఫార్మసీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌ను అనుసరించి గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. ఈ రెండు కేటగిరీలవారికి సమానంగా సీట్లు కేటాయించారు. రెంటికీ కటాఫ్ స్కోర్ వివరాలను అడ్మిషన్ కమిటీ ప్రకటిస్తుంది.

బిట్స్ పిలానీలో హయ్యర్ డిగ్రీ

ఎంఈ విభాగాలు: బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్), కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డిజైన్ ఇంజనీరింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్

ఎంఫార్మసీ విభాగాలు: ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మకాలజీ

అర్హత వివరాలు: ఎంఈ, ఎంఫార్మసీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్/ఫార్మసీ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ఆఫ్ బిట్స్ లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంపిక: ఎంఈ(సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ మినహా), ఎంఫార్మసీ సీట్లను బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ లేదా గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా భర్తీ చేస్తారు. గేట్ 2024/2023/2022, జీప్యాట్ 2024/2023/2022 స్కోర్లను పరిగణనలోకి తీసుకొంటారు. ఎంఈ(సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్) సీట్లను పూర్తిగా బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ఆధారంగా భర్తీ చేస్తారు.

బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు టెస్ట్‌లు ఉంటాయి. మొదటి టెస్ట్‌ను అభ్యర్థులందరూ తప్పనిసరిగా రాయాలి. రెండో టెస్ట్ అభ్యర్థి ఎంచుకున్న స్ట్రీమ్ మేరకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

మొదటి టెస్ట్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో మొత్తం 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్ మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్కిల్స్ అండ్ రీజనింగ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు అడుగుతారు.

రెండో టెస్ట్: పరీక్ష సమయం 105 నిమిషాలు. ఇందులో మొత్తం 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంఈ (సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్), ఎంఈ(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లకు నిర్వహించే ఎగ్జామ్‌లో 50 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట. విభాగాలకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.13,400లు చొప్పున ట్యూషన్ ఫీజులో రాయితీ ఇస్తారు. బిట్స్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు నెలకు రూ.13,400ల స్టయిపెండ్ ఇస్తారు. అభ్యర్థులందరూ వారానికి ఎనిమిది నుంచి పది గంటలసేపు అకడమిక్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** బిట్స్ హెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ రాసేవారికి రూ.3,400; గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 19
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** ఏప్రిల్ 22 నుంచి 23 వరకు
- **బిట్స్ హెచ్‌డీ టెస్ట్ సెంటర్ అలాట్‌మెంట్:** ఏప్రిల్ 27
- **స్లాట్ అండ్ డేట్ బుకింగ్:** ఏప్రిల్ 29 నుంచి మే 2 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 16 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **బిట్స్ హెచ్‌డీ ఆన్‌లైన్ టెస్ట్:** మే 19, 24
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 7
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 13
- **అభ్యర్థుల రిపోర్టింగ్ తేదీ:** జూలై 29
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** జూలై 31
- **కోర్సు వర్క్ రిజిస్ట్రేషన్:** ఆగస్టు 1
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.bitsadmission.com/hd

యోగాలో ఫౌండేషన్ కోర్సు



భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఎండీఎన్‌ఐవై)- 'ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగా సైన్స్ ఫర్ వెల్‌నెస్(ఎఫ్‌సీవైఎస్‌సీడబ్ల్యూ)'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సు వ్యవధి రెండు నెలలు. ఇది వీకెండ్ కోర్సు. దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఏప్రిల్ 6 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి. వారాంతాల్లో ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. కనీసం పదిహేనేళ్లు నిండిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.2,500
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.250
- **సర్టిఫికేషన్ ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **శిక్షణ వేదిక:** మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్‌ఐవై), 68, అశోక్ రోడ్, న్యూఢిల్లీ-110001
- **వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

ఏసీఎస్ఐఆర్‌లో పీజీ, పీహెచ్‌డీ

అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఎంటెక్, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్-పీహెచ్‌డీ(ఐడీడీపీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీహెచ్‌డీలో సైన్సెస్, ఇంజనీరింగ్, మెడికల్ రీసెర్చ్ విభాగాలు ఎంచుకోవచ్చు. సంస్థ నిబంధనల ప్రకారం సీఎస్ఐఆర్ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న ప్రాజెక్ట్ అసిస్టెంట్‌లు, సీనియర్ రీసెర్చ్ ఫెలోలు, గ్రూప్ 4 సైంటిస్ట్‌లు, గ్రూప్ 3 టెక్నికల్ స్టాఫ్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రకారం అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ/ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: పీహెచ్‌డీలో సైన్స్ విభాగాలకు సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇంజనీరింగ్ విభాగాలకు నాలుగేళ్ల బీఈ/బీటెక్/బీఎస్‌తోపాటు ఎంఈ/ఎంటెక్; అయిదేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. మెడికల్ రీసెర్చ్ విభాగానికి డీఎం/ఎంసీహెచ్/ఎండీ/ఎంఎస్/మాస్టర్స్ డిగ్రీ ఇన్ సైన్స్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నాలుగేళ్ల వ్యవధిగల బీఈ/బీటెక్/బీఎస్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత డిగ్రీ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రకారం సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా ఇన్‌స్పయిర్ ఫెలోషిప్/ఆర్‌జీఎన్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి. ఇటువంటి నేషనల్ ఫెలోషిప్ అర్హత లేనివారు ఇన్‌స్టిట్యూషనల్ ఫెలోషిప్(డీఎస్‌టీ-బీఎస్ఐపీ/డీఎస్‌టీ-ఐఏఎస్ఎస్‌టీ/డబ్ల్యూఐఐ/టీఐజీఎస్/టీసీజీ-సీఆర్ఈఎస్‌టీ)కోసం అప్లయ్ చేసుకోవచ్చు.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
- ఇంటర్వ్యూ/టెస్ట్ తేదీలు: మే 20 నుంచి జూన్ 5 వరకు
- ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: జూలై 12న
- ప్రోగ్రామ్‌లలో జాయినింగ్ తేదీలు: జూలై 20 నుంచి ఆగస్టు 8 వరకు
- వెబ్‌సైట్: www.acsir.res.in/admissions

జాబ్ కార్నర్



సీబీఎస్ఈలో గ్రూప్- ఎ, బి, సి పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 118

1. అసిస్టెంట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్): 18 పోస్టులు
2. అసిస్టెంట్ సెక్రటరీ(అకడమిక్): 16 పోస్టులు
3. అసిస్టెంట్ సెక్రటరీ(స్కిల్ ఎడ్యుకేషన్): 8 పోస్టులు
4. అసిస్టెంట్ సెక్రటరీ(ట్రెయినింగ్): 22 పోస్టులు
5. అకౌంట్స్ ఆఫీసర్: 3 పోస్టులు
6. జూనియర్ ఇంజనీర్: 17 పోస్టులు
7. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: 7 పోస్టులు
8. అకౌంటెంట్: 7 పోస్టులు
9. జూనియర్ అకౌంటెంట్: 20 పోస్టులు

అర్హతలు: పోస్టును అనుసరించి విద్యార్హతలు, అనుభవం తదితర పూర్తి సమాచారం మార్చి 12న సంస్థ వెబ్‌సైట్‌లో లభ్యమవుతుంది.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: మార్చి 12
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 11
వెబ్‌సైట్: https://www.cbse.gov.in/

ఎంవోఐఎల్‌లో గ్రాడ్యుయేట్ ట్రెయినీలు

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 44

1. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(గనులు): 13
2. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(మెకానికల్): 5
3. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(ఎలక్ట్రికల్): 4
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(జియాలజీ), గ్రాడ్యుయేట్ ట్రెయినీ(ప్రాసెస్): 1
5. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(కెమికల్, మెటలర్జీ, మినరల్ ప్రాసెసింగ్): 3
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మెటీరియల్స్): 5
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్): 1
8. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్స్/వెల్): 5
9. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఫైనాన్స్): 5
10. మేనేజర్(సర్వే): 2

విభాగాలు: మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, జియాలజీ, ప్రాసెస్, మెటీరియల్స్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, పర్సనల్, ఫైనాన్స్, సర్వే
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేట్, ఎంబీఏ, డిప్లొమా, పీజీ, డిగ్రీ, ఇంజనీరింగ్‌లలో ఉత్తీర్ణత.
వేతనం: నెలకు రూ.50,000 - రూ.1,60,000
వయోపరిమితి: 53 సంవత్సరాలు మించరాదు
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 21
వెబ్‌సైట్: https://www.moil.nic.in/

బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రాజెక్టు ఇంజనీర్-1: 10
2. ట్రెయినీ ఇంజనీర్-1: 11

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించరాదు
వేతనం: నెలకు రూ.40,000- రూ.55,000
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 23
వెబ్‌సైట్: https://bel-india.in/

భారత ఇలెక్ట్రానిక్స
BHARAT ELECTRONICS
QUALITY. TECHNOLOGY. INNOVATION

ఐటీడీసీలో అసిస్టెంట్ మేనేజర్లు

భారత టూరిజం డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐటీడీసీ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్: 6 పోస్టులు
2. చెఫ్: 3 పోస్టులు
3. అసిస్టెంట్ మేనేజర్(ఈవెంట్స్): 2 పోస్టులు
4. అసిస్టెంట్ మేనేజర్(సివిల్): 3 పోస్టులు
5. అసిస్టెంట్ మేనేజర్(ఈఅండ్ఎం): 3 పోస్టులు
6. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
7. అసిస్టెంట్ లెక్చరర్స్: 4 పోస్టులు

అర్హత: లా డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, హాస్పిటాలజీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్/మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 30 ఏళ్లు. అసిస్టెంట్ మేనేజర్(లీగల్) పోస్టుకు 32 ఏళ్లు మించరాదు.
జీతం: రూ.60,000
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 14
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
వెబ్‌సైట్: itdc.co.in/

ఐఆర్ఈఎల్‌లో మేనేజర్లు

ముంబయిలోని ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్...శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 10

1. మేనేజర్(టెక్నికల్)
2. డిప్యూటీ మేనేజర్(టెక్నికల్)
3. అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్)

అర్హత: ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు ఫీల్డ్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి.
వయోపరిమితి: మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 32 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 28 ఏళ్లు మించరాదు.
వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.60,000 - రూ.1,80,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.50,000- రూ.1,60,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000- రూ.1,40,000
దరఖాస్తు చివరి తేదీ: మార్చి 21
ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, సైకోమెట్రిక్ టెస్ట్
దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎమ్ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.
వెబ్‌సైట్: https://www.irel.co.in/careers

ఐఐటీఎంలో నాన్ టీచింగ్ ఖాళీలు

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్... కింద పేర్కొన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 41

1. సూపరింటెండింగ్ ఇంజనీర్: 1 పోస్టు
2. జూనియర్ టెక్నీషియన్: 40

విభాగాలు: సివిల్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఈసీఈ, ఈఅండ్ఐ, ఈఈ, బయాలజీ/లైఫ్ సైన్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్, జువాలజీ, ఫిజిక్స్
అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంఈ/ఎంటెక్
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2
వెబ్‌సైట్: https://www.iitm.ac.in/

హాయ్ బుజ్జీ



మీకు తెలుసా?


- గ్రేట్ వాల్ ఆఫ్ చైనా పొడవు 21,196 కి.మీ. అయితే ఇందులో ఒన్ థర్డ్ వంతు పాడైపోయింది. వెడల్పు 6.5 మీటర్లు ఉంది. పది లక్షల మంది ఈ గోడను కట్టారట.
- ఆరు శతాబ్దాల క్రితమే 'ఖిన్ షీ హువాంగ్' అనే చైనా చక్రవర్తి ఈ గోడను నిర్మించారు. 16 వ శతాబ్దం దాకా ఎన్నో పునర్ నిర్మాణాలకు లోనైంది. ఇప్పటికీ నిలిచింది.
- అంతర్యుద్ధకాలంలో జనాలను కాపాడుకోవటానికి దీన్ని నిర్మించారు. కొండరాళ్లను, మట్టి ఉపయోగించి ఈ పొడవైన గోడను కట్టారు. వాస్తవానికి చైనా ఏకీకరణ కోసమే ఖిన్ ఈ పనిని తలపెట్టారు.
- 67 కుడ్య బురుజులల్లో వ్లాగ్జింగ్ అనే బురుజు సముద్ర మట్టానికి




980 మీటర్ల ఎత్తులో ఉంది.

- ఈ బురుజు తపాలా, సంజ్ఞలు చేయటం కోసం, శత్రువుల కదలికలను కనిపెట్టడానికి ఉపయోగించుకునేవాళ్లు.
- చైనాలో గొప్ప నిర్మాణం ఇదే. దాదాపు రెండు వేళ ఏళ్ల ఆయా రాజులు దీన్ని కడుతూనే ఉన్నారట.
- ఉత్తరభాగంను 'బడాలింగ్' అని పిలుస్తారు. దీన్ని ఇటుకలతో నిర్మించారు. ఎత్తు 7.8 మీటర్లు.
- 1987లో యునెస్కో వరల్డ్ హెరిటేజ్‌గా ఈ గోడను గుర్తించింది.
- పల్లెవాసులు తమ ఇళ్ల కట్టుకోవటానికి ఈ గోడ రాళ్లను తీసుకెళ్లారు. చాలా చోట్ల పాడైపోయింది. అయినప్పటికీ మానవుడు నిర్మించిన అద్భుతమైన వింతల్లో ఇదొకటిగా కీర్తింపబడుతోంది.
- చైనావాల్‌ను సందర్శించాలంటే మే మాసం నుంచి అక్టోబర్ మాసం వరకే వెళ్లాలి. ఈ సమయంలో పిల్లల సెలవులు ఉండటం వల్ల అత్యధికంగా జనాలు వస్తారు. ఎలాంటి ఇబ్బందులు కలగవు. చలికాలంలో మంచు వల్ల ఎక్కడివారు అక్కడ నిలబడిపోతారు. ఇబ్బందులకు గురవుతారు. అందుకే చలికాలం అనువుగా ఉండదు.
- ఒకరోజులోనే లక్షమంది ఈ గోడను చూడటానికి జనాలు వచ్చిన రోజులు కోకొల్లలు.
- 2700 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ గోడ పాతది అని అనిపిస్తుంది కానీ అయితే దీని బలం మాత్రం అద్భుతమే.


సరైన నీడ ఏది?



10 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 251

9		6	2				5	
						3		
1			8	5				
3	6	9			1	4	8	
	8	4	6			9	7	1
				9	8			4
		3						
	5				2	6		3

సుడోకు - 250 సమాధానం

5	2	3	8	6	9	1	4	7
8	7	1	4	3	2	9	6	5
9	4	6	7	5	1	2	8	3
2	8	7	6	1	4	3	5	9
3	5	4	9	2	8	7	1	6
6	1	9	3	7	5	4	2	8
1	3	2	5	8	7	6	9	4
4	6	8	1	9	3	5	7	2
7	9	5	2	4	6	8	3	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.